మూకపంచశతి

కటాక్షశతకమ్

మూలము:
మూక మహాకవి

అర్థతాత్పర్య వివరణ
శ్రీ దోర్బల విశ్వనాథశర్మ

ప్రకాశకులు
సాధన గ్రంథ మండలి, తెనాలి

 [వెల రూ. 15-00

ప్రథమ ముద్రణ:

యువనామ సంవత్సరము
జ్యేష్ఠమాసము
ఏరువాక పూర్ణిమ
13-6-1995

ప్రతులు: 1000

Type Setting & D.T.P
Ch.V. Subrahmanyam &
G. Anjaneyulu
NICE, BAPATLA - 522 101

శ్రీః

శ్రీ చన్ద్రమౌళీశ్వరాయ నమః

శ్రీమత్పరమహంస పరివ్రాజకా చార్యవర్య

జగద్గురు శ్రీ శఙ్కర భగవత్పాదాచార్య పరమ్పరాగతం

శ్రీకామకోటి పీఠ మహాసంస్థానమ్

కాఞ్చీ పురమ్ - 631502

యాత్రాస్థానమ్: తంజనగరీ 19-03-1992

జగన్మాతుః శ్రీ కామాక్షీ దేవ్యాః ప్రసాదభాజన భూతః మూకః కవిర్బభూవ!

కరుణాలయాయాః శ్రీ కామాక్షీదేవ్యాః ప్రభావం - స్వరూప సౌన్దర్యాదికంచ పంచశతేషు శ్లోకేషు వర్ణితవాన్! కటాక్ష శతకాది పంచశతక సమన్వితోయం గ్రంథః మూక పంచశతీ వ్యాఖ్యాయతే!

మంత్రాత్మకస్య - వాఞ్ఛిత ఫలప్రదస్య - అస్య - గ్రన్థస్య - తెలుగు భాషాయాం - వ్యాఖ్యాసహిత ప్రకాశ నార్థం - ప్రయతతే చీరాలాభిజనః శ్రీ మోహనరావ మహోదయః ఇతి విజ్ఞాయ సుభృశం సంతుష్యామః!

మహదుపకారక మిదం కార్యం శ్రీ కామాక్ష్యాః కటాక్ష వీక్షణేన సుఫలం సఫలంచ భూయా దిత్యాశాస్మహే!

నారాయణస్మృతిః

***

II

మండలి మాట

'కవీన్ద్ర హృదయేచరీ పరిగృహీత కాంచీపురీ
నిరూఢ కరుణాఝరీ నిఖిలలోక రక్షాకరీ
మనః పథ దవీయసీ మదన శాసన ప్రేయసీ
మహాగుణ గరీయసీ మమ దృశోఽస్తు నేదీయసీ-'

ఒకప్పుడు కీ.శే. శతావధానులు బ్రహ్మశ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారు ప్రాసంగికముగా అన్న మాట. "జ్ఞాని మాటాడడు. అజ్ఞాని మాటాడడు. అన్నియు తెలిసిన వాడగుటచే జ్ఞాని యందు, ఏమియు తెలియని వాడగుటచే అజ్ఞాని యందు వాగ్వ్యాపారము నిలిచి పోవును, ఎవరు జ్ఞాన అజ్ఞానముల నడుమ కొట్టు మిట్టాడు చుందురో వారి యందు వాగ్వ్యాపారము అనంతము"- అని. ఇపుడీ మాట దేనికి? అందురేమో తెలుపుచున్నాము 'ఆయన ఎవడో మూగవాడు, అనగా మాటలేనివాడు. ఆయన పంచశతి (500 శ్లోకములు) రచింపగా విపశ్చిదగ్రణులు ఆశ్లోక సముదాయమును దర్శించి తద్గత మహార్థ సౌందర్యమును భావించి - ఆహా! ఇదెంత మధురము! ఇదెంత సుసంగతము! ఇదెంత యపూర్వము! అని శ్లాఘించుచు వాని చుట్టును - పరిభ్రమించుచు వ్యాఖ్యలను రచించు చున్నారు. విమర్శనములను సాగించు చున్నారు.

మూగవాడు మాటాడినాడు కదా! 'జ్ఞావి మాటాడడు, అని అనుకొన్ననాడు మాటాడిన ఈ మూగవానిని జ్ఞాని అనవలెనా? అజ్ఞాని అనవలెనా? అని సందేహము. అట్లే మూకపంచశతీ వ్యాఖ్యాన రచయితలను ఏమనవలెను? అన్నది కూడ సంశయమేకదా! ఆ రెండు సంశయములు ఇటులుండగా-

శ్రుతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయం నమామిం భగవత్పాద శంకరం లోకే శంకరమ్. అని కీర్తింపబడిన శ్రీ శంకర భగవత్పాదుల వారి సముద్ర మంత వాఙ్మయము లోకమున విస్తరించి యున్నది కదా! వారినే మనవలెను? అన్న సంశయము - వామనుడు త్రివిక్రముడై ఎదుట నిలిచినట్లు ఆవిర్భవించుచున్నది. మరి ఆ శతావధానుల మాట? అయ్యా! నేను మరి

మాటాడు చున్నాను కదా! వ్రాయు చున్నాను కదా! లోకముతో సంబంధము కలవాడనైయున్నాడను కదా! సర్వంఖల్విదం బ్రహ్మ - నేహ నానాస్తి కిఞ్చన అన్న అనుభూతి యందు పండిన వాడనైనచో ఈ మాటలు ఈ వ్రాతలు ఉండవు కదా! కాగా నేను అజ్ఞానినే కాని జ్ఞానిని కానని వేరే చెప్పనక్కరలేదు కదా! సరి! తెలియని నేను మాటాడిన మూకకవీంద్రునిజ్ఞాని అనవలెనా? కూడదా? అను సందేహమును నివారించుటకు పూనుకొనుట కంటె తెలివిలేమి యుండునా? అయినను నాకు దోచినమాట!

జ్ఞాని బ్రహ్మము తానై జగదుద్ధరణమునకై పలుకును. ఆ పలుకులు వానివి కావు. అచట 'నేను' అనెడి అభిజ్ఞకు తావు లేదు. అతడు అద్వయానంద శిఖరాధి రూఢుడు. ఇతరులో! సంసారమునందున్నవారై అద్వయానంద శిఖరమునధిరోహించిన వారు కారు. వీరు ఆరూఢులు కారు. ఆరు రుక్షువులు. వీరు అహంతా శిఖరాధిరూఢులు. నేను చేయుచున్నాను, నేను పలుకుచున్నాను - అనెడి భావము వీరియందు ప్రబలము. ఇంచుక వివరించు చున్నాను. తన అహంతను పరబ్రహ్మమున విలీన మొనర్చి తదనుభవమున పండిన వాడు జ్ఞాని. వాని యందు 'నేను-నాది' అనెడి భావమే ఉండదు. అందుచే - అచటనుండి వెల్వడిన ఉపదేశ వాక్కునం దాతనికి 'ఇది నా వాక్కు - నారచనము" అన్నభావమెట్లుండును? కాగా అచటి వాక్కు బ్రహ్మవాక్కు! అది వైయక్తికము కాదు! ఇతరులో! తన అనుభవమునకు ఇంకను అందని విషయమును గూర్చి - తన అహంతను (నేను అనెడి భావమును) దృఢముగా నిలువ బెట్టుకొని 'ఇది నా మాట' నా రచన' అనెడి భావముతో నిండిన గుండె కలవారై పల్కుచుందురు. కాగా ఇచటి వాక్కు వైయక్తికము! ఇది అసమగ్రము.

యస్యదేవే పరాభక్తిః యధా దేవే తథాగురౌ తస్యైతే కధితాహ్యర్థా ప్రకాశన్తే మహాత్మనః పరాభక్తి యుక్తుడు కావలెను. గురుదైవతమై (గురువే దేవుడుగా గలవాడు) వెలయ వలెను. అపుడు మాత్రమే మూకపంచశతి వంటి గ్రంథముల మహార్థములు సాక్షాత్కారించును. అటులైనచో ఈ వివృతి ఈ వ్యాఖ్య దేనికి? అందురేమో! శ్రీకామాక్షీ మహాదేవిని అనన్య భక్తితో సేవించ వలెను గదా! ఆ భజించు మార్గమును ఈ వివృతి - ఈ వ్యాఖ్య విశదీకరించును. కాగా ఈ వివృతితో - ఈ వ్యాఖ్యతో ఈ శతకమును దన మానసమున నిలుపుకొన్న వాడు శ్రీకామాక్షీ మహాదేవి యొక్క కరుణా

దృగాసారమున సుస్నాతుడై ఇహ పర భోగభాజనుడై ప్రకాశించుటయే కాదు, బ్రహ్మ విద్వరిష్ఠుడై పరిఢవిల్లును ఈ శతకమున కిట్లు పండిత సమ్మతమైన ప్రతిపదార్థ తాత్పర్యములను అనేక విశేషాంశములతో సమకూర్చిన శ్రీ దోర్బల విశ్వనాథ శర్మగారు మహా పండితులు. వారిని సాహిత్యాకాశమునందు ఇపుడిపుడే ఉదయించు చున్న బాల భాను మూర్తిగా భావింతురేమో? అట్లు కాదు. ఉద్దోలమైన పాండితీ వైభవముచే ఉద్గ్రంథరచన చే ఉరుతర విఖ్యాతి నే నాడో గడించుకున్న విద్వత్కవితల్లజులు వారు. వారు రచించిన 'శ్రీలాలిత్యము' ఆంధ్రభాష యందు అనిదంపూర్వమైన ప్రక్రియ. అది అమ్మ మెడనలంకరించిన అమ్లాన పంకజ సహస్రమాలిక. ఇట్టి విద్వాంసులు రచించిన వివృతితో, ఈ కటాక్ష శతకమును - పాదారవింద శతకమును బ్రకటించిన వెంటనే వెలువరించు చున్నందులకు మిక్కిలి ఆనందించు చున్నాము. మూక మహాకవిని మూక వాక సౌందర్యమున దర్శింపగలరు.

ఈ వ్యాఖ్యాన గ్రంథము శ్రీశ్రీశ్రీ చిదానంద భారతీ స్వామి (శ్రీ దోర్బల విశ్వనాథశర్మగారి పూర్వాశ్రమ జనకులు) గారికి సమర్పితము.

అన్నిటా సహాయ సహకారాలందించుచూ, చిరునవ్వులు చిందించే శ్రీ స్వామి మధుసూదన సరస్వతి (బ్రహ్మవిద్యాశ్రమము, కేశవపట్నం) గారికి నమస్సుమాంజలులు.

సాధన గ్రంథ మండలికి వెన్నెముకగా ఉండి నిరంతరమూ సహాయ సహకారాలందించు నా సోదరుడు శ్రీబులుసు సూర్య ప్రకాశం - "శంకర కింకరుడు" ను ఆయురారోగ్య ఐశ్వర్యాభివద్ధి నొంద ఆశీర్వదించు చున్నాను.

కశ్చాశ్చ మశ్చ నామ్నో క్తాః బ్రహ్మమాధవ శూలినః త్రయో వయం యతో దేవ్యా అక్షిజాతా స్తతః ప్రభోకామాక్షేతి ప్రసిద్ధాస్తు లలితా జననీ చ నః —స్కాందము.

కకారము బ్రహ్మను అకారము హరిని మకారము శివుని దెలుపును. క + అ + మ = కామ. వీరు లలితా పరమేశ్వరి యొక్క అక్షులనుండి (కనులనుండి) ఆవిర్భవించినారు. అందుచే ఆ జగజ్జనని యైన లలిత "కామాక్షి" యను పేర ప్రసిద్ధివహించెను. 'యోవైతాం బ్రహ్మణోవేద అమృతేనా వృతాం పురీం' అని శ్రుతిచే కీర్తింపబడిన బ్రహ్మపురి కాంచీనగరమే

కేశ - బ్రహ్మణా - అంచతేతి కాంచీ. అచట వెలిసిన చూతవృక్షము - వేదమే. దాని నాల్గు కొమ్మలు నాల్గు వేదములు. వేద వేద్యుడైన పరమాత్మయే ఏకామ్రనాథుడు. అనగా ఆయన కామేశ్వరుడే.

కాగా కాశి కంటె విశిష్టమైనది కాంచీనగరమనియు - లలితయే కామాక్షి యనియు, కామేశ్వరుడే ఏకామ్రనాథుడనియు గ్రహించి - శ్రీ కంచి కామకోటి పీఠాధిపతుల ఆశీస్సుల ఫలంగా పుస్తకరూపం సంతరించుకొన్న ఈ స్తుతి యందు బద్ధాదరులై ఎల్లరును మేలందుదురు గాతమని అకాక్షించు చున్నాము.

వట్టి చెరుకూరు వాస్తవ్యులైన శ్రీరావి వెంకట సుబ్బయ్య, సీతారావమ్మల ఆర్థిక సహాయములతో ఈ వ్యాఖ్యాన గ్రంథము ముద్రింపబడినది. వారిని ఆ భగవతి కటాక్షించు గాక.

ప్రూఫు చూచుటయందు సహకరించిన చిరంజీవి శ్రీ వెల్లంపల్లి దాశరథికి శ్రీ కామాక్షీదేవి ఆయురారోగ్య ఐశ్వర్యములు ఇచ్చుగాక.

ఇట్లు,

బులుసు సూర్య ప్రకాశ శాస్త్రి

తెనాలి

వ్యవస్థాపకుడు

20-05-'95

సాధన గ్రంథ మండలి

VI

మూకవాక సౌందర్యము

శ్రీలలితా సహస్రనామ స్తోత్ర పారాయణమును "శివశక్త్యైక్యరూపిణీ లలితాంబికా" యని ముగించినారు. శ్రీ శంకరులు తమ సౌందర్యలహరి యను స్తోత్ర కావ్యమును "శివశ్శక్త్యా" యని యారంభించినారు.

శ్రీ శంకరులు సుమారేబది శ్లోకములలో శ్రీ దేవి యొక్క శీర్షాది పాదాంత సౌందర్య వర్ణనమును "జయతి కరుణా కాచిదరుణా" యని ముగించినారు. మూక మహాకవి సౌందర్యలహరిలోని యీ వర్ణనమును పఠించిన వెంటనే *'కారణ పర చిద్రూపా కాంచీ పుర సీమ్ని కామ పీఠగతా కాచన విహరతి కరుణా కాశ్మీరస్తబక కోమలాంగలతా'*- అని తమ పంచశతి నారంభించినారు.

శ్రీలలితా సహస్రనామ స్తోత్ర లాలిత్యమునంతను శ్రీ శంకరులు తమ సౌందర్యలహరిలో ప్రతిఫలింప జేసినట్లు మూక మహాకవి శ్రీ శంకరుల సౌందర్యలహరిలోని శ్రీదేవి సౌందర్యమును తన పంచశతిలో ప్రతిఫలింప జేసినారు. వాస్తవమునకు మూక మహాకవి కవితా విషయమున నితరుల ననుకరింపవలసిన భావదారిద్ర్యముకలవాడు కాడు. పైగా తన పంచశతిని పఠించిన వారిలో వందల కొలది మహాకవుల నుద్భవింప జేయు సామర్థ్యము కలిగినవాడు. ఐనను అచ్చటచ్చట శ్రీ శంకరుల ననుకరించుట వారి యెడ గౌరవమును బ్రదర్శించుటకే. కవులు సౌన్దర్యోపాసకులు. వారు మాధుర్యాగమ సంప్రదాయ ప్రవర్తకులు. శృంగార రసబ్రహ్మము వారి మాధుర్యాగమమునకేకైక లక్ష్యము. ఏకైక తాత్పర్యము. శృంగారము స్త్రీ పురుషాద్వైత బ్రహ్మము. సాధారణ వేదాంత పరిభాషలోనది జీవేశ్వరైక్యము. భక్తుల పరిభాషలోనది మధురభక్తి. భగవంతుని స్వపురుషునిగా జేసుకొని స్త్రీ భావమున తమనతని యందు లీనము జేసికొన గలిగిన వారు మధుర భక్త కవులు.. సౌందర్యోపాస కులైన కవులలో జ్ఞానిభక్త కవులుత్కృష్టులు. శ్రీ శంకర మూక మహాకవులట్టివారు.

సౌన్దర్యము ద్వివిధము. ఆంతరంగికము, బహిరంగికము. ఉన్దీక్లేదనే అను ధాతువునకు సు ఉపసర్గ చేర్చి నిష్పన్న మొనర్చిన శబ్దము సున్ద శబ్దము. సున్ద శబ్దమునకు శంకరులు తమ విష్ణుసహస్రనామ భాష్యములో

కరుణ యను యర్థమును చెప్పినారు. ఆ సున్దమును, కరుణను, ఆర్ద్రీ భావమును ఇచ్చునది సుందరి. ఆమె యే జగన్మాత. ఆంతరంగిక సౌందర్యము అనగా కరుణ. కవుల బాహిరంగిక సౌన్దర్యమునభినందించు వారు సాధారణ సహృదయులు. అసాధారణ సహృదయులు జగన్మాత కరుణనుపాసించు మహాకవుల నధికముగా నభినందింతురు. మనమిప్పుడు శ్రీ శంకరుల సౌందర్యమును మూక మహాకవి వాక్కులలో పరిశీలించి దర్శించి యనుభవించెదము గాక! ఆరాధించెదము గాక!

శ్రీ శంకరులు జగన్మాత నరుణ కరుణగా పేర్కొన్నారని యీ వరకే చెప్పుట జరిగినది. ఆమె "శిరీషాభా చిత్తే" (చిత్తమున దిరిసెన పువ్వు వంటిది) యని శంకరులామె చిత్తకోమలతను వర్ణించినారు. మూక మహాకవి ఆమెను" కాశ్మీరస్తబక కోమలాంగలతా" కుంకుమ పూ గుత్తి వంటి కోమలమైన అంగలతగాబేర్కొన్నారు. పూవు మారినదే కాని కోమలత యదే. శంకరులు "కాచిత్" అనగా మూక మహాకవి "కాచన" అనినారు. మూక మహాకవి కారాధ్య దేవత యైన కామాక్షీ దేవి కాలివలె కామేశ్వరి వలె కాది. కాది విద్యారూపిణి ఆమె తమ పంచశతిలోని మొదటిదైన **ఆర్యాశతకము** నందలి మొదటి శ్లోకము ఇదివఱకే ఉదహరింపబడినది. దానిని చూచిన వారి కందలి పాదములన్నియు కాదులని తెలియగలదు. పంచశతిలో మొత్తములో కాది శ్లోకములు కాది పాదములు గణనీయములుగా నున్నవి. ఆర్యా శతకములోని ఈ క్రింది రెండవ శ్లోకములోని పాదములు పదములు కాదులే.

కంచన కాంచీ తిలకం కరధృత కోదండ బాణసృణి చాపమ్
కఠిన స్తన భర నమ్రం కైవల్యానంద కందమవలమ్బే

దీనికి మూలమనదగిన శంకరుల సౌందర్యలహరి యందలి శ్లోకము కూడకాదియే.

క్వణత్కాంచీదామా కరికలభ కుంభస్తననతా
పరీక్షీణా మధ్యే పరిణత శరచ్చంద్ర వాదనా
ధనుర్బాణాన్ పాశంసృణి మపిద ధానా కరతలైః
పురస్తాదాస్తాం నః పుర మథితు రాహోపురుషికా

VIII

ఈ శ్లోకమందలి మూడవ పాదము పై శ్లోక మందలి రెండవ పాదముగా రూపాంతర మందినది. పై శ్లోక మందలి మూడవ పాదమీ శ్లోకమందలి మొదటి పాదములోని రెండవ భాగముగా రూపాంతర మందినది. మొదటి భాగములోని కాంచీ శబ్దము ఆభరణ వాచకముకాగా పై శ్లోకములోని మొదటి పాదములోని కాంచీ శబ్దము నగర వాచకము. రెండింటిలోను కాంచీ శబ్దమున్నది.

శ్రీ శంకరు లరుణకరుణగా నమ్మవారిని పేర్కొన్న శ్లోకము అరాళాకేశేషు అని యారంభింప బడినది. ఆ యెత్తుగడనే స్వీకరించి మూక మహాకవి ఆర్యా శతకములోని నాల్గవ శ్లోకమును రచించినాడు.

కుటిల కచం కఠిన కుచం కుందస్మిత కాంతి కుంకుమచ్ఛాయమ్
కురుతే విహృతిం కాంచ్యాం కుల పర్వత సార్వభౌమ సర్వస్వమ్

ఈ శ్లోకములోని పెక్కు పదములు, పాదములు నాలుగు కాదులే, శంకరుల "అరాళాకేశేషు" అను పదద్వంద్వ మీ శ్లోకమున "కుటిల కచం" అను సమాసముగా మారినది. శంకరులు "దృషదుపల శోభా కుచతటే" అని కుచములలోని కాఠిన్యమును వ్యంగ్యమొనర్పగా నీ శ్లోకమున నా కాఠిన్యము కఠిన కుచం' అని వాచ్యము చేయబడినది. శంకరుల అరుణా అను పదము ఈ శ్లోకమున "కుంకుమచ్ఛాయమ్" అని వివరింప బడినది. పై శంకరుల 'ఆరాళాకేశేషు" అను శ్లోకములోని యెత్తుగడనే గ్రహించి మూక మహాకవి ఆర్యాశతకములో మరొక శ్లోకమును రచించినారు.

'శ్వేతా మన్థరహసితే శాతా మధ్యే చ వాఙ్మనోऽతీతా
శీతాలోచన పాతే స్ఫీతాకుచసీమ్ని శాశ్వతీ మాతా

ఈ శ్లోకములోని యెత్తుగడయే గాక మొత్తము నిర్వహణము శంకరుల శ్లోకముననుసరించి యే యున్నదని వేరుగా చెప్పనక్కఱలేదు. శంకరుల "పరీక్షీణా మధ్యే, భృశంతన్వీమధ్యే" అను పద బంధములే ఈ శ్లోకమందలి శాతా మధ్యే అను పద ద్వంద్వముగా మారిన వనుట గూడ స్పష్టమే. ఈ క్రింది పట్టికను పరిశీలించిన శంకరుల పద బంధములను మూక మహాకవి ఎంతచగా నాదరించినది తెలియ గలదు.

సౌందర్యలహరి	పంచశతి
పురారాతే రంతఃపరమసి	- అంతఃపురేణ శంభోః
రతినయనలేహ్యేన	- శంభోర్లోచన యుగలేశ లేహ్యమానాయామ్
విశ్వమ్భ్రమయసి పరబ్రహ్మ మహిషి	భ్రమయసీ కామాక్షీ శాశ్వతీ విశ్వం
రవీన్దుస్తనయుగీమ్	- ఇందురవి మండలకుచా
శివాకారే మంచే	- మంచే సదా శివమయే
వరత్రాసత్రాణ స్ఫటిక ఘటికా పుస్తక ధరామ్	- జపవటి పుస్తక వరాభయకరామ్

మూక పంచశతి లోని రెండవ శతకము **పాదారవింద శతకము.** ఇది శిఖరిణీచ్ఛందస్సులో రచింపబడినది. శంకరులు తమ సౌందర్యలహరిని శిఖరిణీచ్ఛందస్సులోనే నిబంధించిరి. శిఖరిణి లహరీ సౌందర్యమున కాలవాలమగుట కుచితమైనది. దీనినే వృత్తౌచిత్యమన వచ్చును. దేవతల మహిమాలహరులు పాదార విందముననే విశేషముగా నెలకొని యుండును. అందుచేతనే మూక మహాకవియు అమ్మవారి పాదార వింద ద్వంద్వమును వర్ణించుచు నీ శతకమును గూర్చినాడు. దీని యందు శంకరుల సౌందర్యలహరీచ్ఛాయలు ఆర్యాశతకము నందు కంటె నెక్కుడుగా నున్నవి. శ్రీ శంకరు లమ్మవారి పాదారవిందముల నారేడు శ్లోకములలో వర్ణించిరి. పాదేతరావయవముల వర్ణించునప్పుడు కూడ సౌందర్యలహరుల ప్రవహింప జేసినారు. వాని యనుకరణములు మూక కవి పాదారవింద శతకమున బుష్కలముగానే యున్నవి. భవన కలహంసము లమ్మవారి పదన్యాస క్రీడతో పరిచయమును సంపాదింప దలచి వాని నాశ్రయింపగా నమ్మవారి పాదము మంజీర రణితచ్ఛలా దాచక్షాణమ్" అని మంజీర నాదము అను మిషతో హంసములకు శిక్షణమునే భంగ్యంతరముగా మూక మహాకవి "విరావైర్మాంజీరైః కిమపి కథయన్తీవ మధురమ్" అని వివరించినారు. ఇంతేగాక "మరాలీనాం యానాభ్యసన కలనామూల గురవే" అని శంకరులుపై భావమునే వివరించినారు. శంకరులు అమ్మవారి పాదముల వర్ణించుచు "దరిద్రేభ్యో భద్రాం శ్రియ మనిశ మహ్నాయ దదతౌ" అని చెప్పగా నదే యెత్తుగడతో మూక మహాకవి "దరిద్రాణాంత్రాణ వ్యతికర సురోద్యాన తరవే" అని చెప్పినాడు. శంకరులు "యదభిహననాయ స్పృహయతే" అనగా మూక మహాకవి చరణ నలినాయ స్పృహయతే అని అదే స్పృహ ధాతువును

ప్రయోగించినాడు. ఇట్లే మరొక చోట 'అరుణమ్నో స్పృహయతే" అని ప్రయోగించినాడు. శ్రీ శంకరులు శివుని నెత్తిపై గంగయున్నదని గౌరి యలిగినప్పుడిదిగో నీ పాదములకిది పాద్యమని చెప్పి శివుడు ఆమె యలకను దీర్చుటకామె పాదములపై గంగను గ్రుమ్మరించినట్లు "యయోః పాద్యం పాదః" అని చెప్పగా మూక మహాకవి స్మరారాతే ర్చూడా నియతి గృహమేధీ హిమకరో యయోస్సాంధ్యాంకాంతిం వహతి అశివ జటా జూట గత చంద్రుడు పాదముల కాంతిలో నెఱ్ఱబడి నట్లు వర్ణించినాడు. ఇరువురును అమ్మవారి పాదములకు శివుడు మోకరిల్లుటనే వర్ణించినారు. శ్రీ శంకరులమ్మవారి సీమంతమును వర్ణించుచు "వహన్తీ సిన్దూరమ్ ప్రబల కబరీ - భారతిమిర! త్విషామ్ బృన్దైర్బన్దీ కృతమివ నవీనార్క కిరణమ్"- అందలి సిన్దూరమును తిమిర బృందముచే బంధింప బడిన నవీనార్క కిరణమును గానుత్ప్రేక్షింపగా మూక మహాకవియునదే యెత్తుగడతో

'వహన్తీం సైందూరీం సరణి మివ నమ్రామరపురీ
పురన్ధ్రీ సీమంతే కలికమల బాలార్క సుషమా'-

అమరపురీ పురన్ధ్రీ సీమంత సిందూర సరణిని వహించి బాలార్కశోభను వెలార్చు నమ్మవారి పద నలిన కాంతిని వర్ణించినాడు. ఇందలి సరణి శబ్దము కూడ శంకరుల శ్లోకము లోనిదే. ఆర్యా శతకమున శంకరుల పద బంధములను మూకకవి యనుకరించిన పట్టిక వంటి మరొక పట్టిక ఈ క్రింద నీయబడినది. అది పరిశీలించిన మరికొన్ని అనుకరణములు కానవగును. ఇవి యన్నియు పాదారవింద శతకమునకు సంబంధించినవే.

సౌందర్యలహరి	మూకపంచశతి
తులాకోటి క్వాణైః	- తులాకోటి ద్వంద్వక్వణిత
పవిత్రీకర్తుం నః	- పవిత్రీకుర్యుర్నః
కదాకాలే మాతః	- కదాదూరీ కర్తుమ్; కదాహం లప్స్యేతే
కవీన్ద్రాణాం చేతః	- కవీనాం చేతో; కవీన్ద్రాణాం నానా
పరిహసతిపంకేరుహరుచిమ్	- పయోజం కామాక్ష్యాః పరిహసతి
అవిశ్రాంతం పత్యుః	- అవిశ్రాంతం పంకే; అవిశ్రాంతం తిష్ఠన్
పురసాదాస్తాంనః	- పురస్తాత్కామాక్షీ!

దరిద్రాణాం చింతామణి గుణనికా	- దరిద్రాణామ్మధ్యే
జయత్యంబస్తంబేరమ	- జయత్యంబ శ్రీమన్నఖ
నదఃశోణో	- నదః శోణాభిఖ్యో
జడానాం చైతన్య	- జడానమప్యంబ
అహస్స్రోతే సవ్యమ్	- యశస్స్రోతే మాతః
పురమథితురాహోపురుషికా	- భణితు మాహోపురుషికామ్
మాహేన్ద్రీ వితతి	- మాహేన్ద్రీం కకుభమివ
ప్రణత జన సౌభాగ్య జననీమ్	- అమర తరుదౌర్భాగ్య జననీమ్

శ్రీ శంకరులు పాదముల వర్ణనమును ముగించుచు "తవాస్మిన్ మన్దార స్తబక సుభగేయాతు చరణే! నిమజ్జన్మజ్జీవః కరణ చరణైః షట్చరణ తామ్" - (తన జీవుని అమ్మవారి మన్దార స్తబక సుభగమైన చరణమున, షట్చరణ త్వమును పొందుగాక) యని ప్రార్థింపగా మూక మహాకవి పాదారవింద శతకములోని తొంబది నాల్గవ శ్లోకమున

'మనోభృంగోమత్కః పదకమల యుగ్మే జననితే .... రమతామ్'

అని అమ్మవారి పదకమల యుగ్మమున తన మనో భృంగము రమించు గాక యని ప్రార్థించినారు. ఇంతే గాక "దధానో మన్దార స్తబక పరిపాటీమ్" అని శంకరులు ప్రయోగించిన మందార స్తబక శబ్దమునే ప్రయోగించినాడు. ఇంక కొన్ని చోట్లను మందార స్తబక శబ్దమునే ప్రయోగించి శ్రీ శంకర ప్రయోగమందాదరమును ప్రదర్శించెను.

శ్రీ శంకరులు తమ సౌందర్యలహరి పూర్వభాగమున మూలాధారాది షట్కమలములలో ధ్యేయమైన శివ సహిత యగు నమ్మవారిని స్తుతించి చివఱకు సహస్రారగత శివ చంద్రామృత రసముచే సమస్త దేహము ప్లావితమగుటను వర్ణించినారు. మూక మహాకవియు మూడవదైన తమ **స్తుతిశతకమున**

'ప్రదలిత షడాధార కమలాం చరన్తీం
సౌషుమ్నేపథి పరపదేన్దు ప్రవిగలత్సుధాం'

అని శంకరుల వర్ణనమును సంగ్రహించినారు. పై రెండు శతకములందు వలెనే ఈ స్తుతి శతకమందును. శంకరుల యను కరణముల నెన్నింటినో ఈ క్రింది పట్టిక యందు గమనింపవచ్చును.

సౌన్దర్యలహరి	పంచశతి
కుచాభ్యా మానమ్రమ్	- స్త నాభ్యామానమ్రా
గోత్రాధరపతి కులోత్తంసకలికే	- నిగమముకుటోత్తంసకలికే
తుహినగిరి వంశ ధ్వజపటి	- విషమ శరవీరధ్వజపటి జనని
మయి దృష్టిస్స్న కరుణా	- జనని మయి కామాక్షి కరుణా
పురస్తాదాస్తాం నః	- పురస్తాన్మే భూయః
నగపతిపతాకే	- హిమగిరి పతాకే
హరమహిషి తేమన్మథకలామ్	- హరమహిషి సస్యాంకురుమసౌ
కుటిల శశి చూడాల ముకుటమ్	- కరముకుల చూడాల ముకుటా
నమో వాకమ్ బ్రూమః	- నమో వాకమ్ బ్రూయుః
జహిజమ్భారి మకుటమ్	- జంభారాతి ప్రభృతి ముకుటీః
కలత్రం వైధాత్రమ్	- శాంకరం తత్కలత్రమ్
వాణీం వీణా	- వాణీ వేణీ
క్వణత్కాంచీదామా	- క్వణ త్కాంచీ కాంచీ

శ్రీ శంకరులు తమ సౌన్దర్యలహరిలో చివరి "ప్రకృత్యామూకానామపిచ కవితా కారణతయా" అని మూగల చేత గూడ అమ్మవారు కవిత్వమును చెప్పింప గల్గరని చెప్పగా మరింత అందముగా మూక మహాకవి 'మూకానామపి కుర్వతీ సురధునీ నీకాశ వాగ్వైభవమ్ - ఆకాశ గంగా సమాన వాగ్వైభవము నమ్మవారు మూగలకు కూడ కలిగించెదరని చెప్పినాడు.

నాల్గవదైన కటాక్ష శతకము యొక్క ఆరంభమున గూడ మూక మహాకవి "మూకాత్మనామపి మహాకవితా వదాన్యాన్" - మూగలకు గూడ మహాకవిత్వము నమ్మవారి చూపులు ప్రసాదించునని చెప్పినాడు.

శ్రీ శంరులమ్మవారి కన్నులను ఏడెనిమిది శ్లోకములలో వర్ణించినారు. కటాక్ష శతకమున వానిలోని భావములతోడి సామ్యము కనిపించును. శ్రీ శంకరులు "అహస్సూతే సవ్యం తవ నయన మర్కాత్మకతయా త్రియామాం వామాతే సృజతి రజనీ నాయకతయా"- అని అమ్మవారి కన్నులను అహర్జనక

సూర్యాత్మకముగా రాత్రి జనక చంద్రాత్మకముగా వర్ణించినారు. మూక మహాకవి అదే భావమును" నక్తందిన ప్రసవ భూనయనాభవంతి" అమ్మవారి భక్తులు రాత్రిందిన జనక నయనములు గల వారగుదురని పర్యాయోక్తాలంకార రూపమున సంగ్రహించినాడు. శంకరులు వర్ణించిన సంధ్యాజనక వహ్న్యాత్మక తృతీయ నేత్రమును బేర్కొనలేదు. కామాక్షీ దేవి విగ్రహమున తృతీయ నేత్రము కానరాకుండుట కారణముగా దానిని బేర్కొని యుండక పోవచ్చును. "నిలీయన్తే తో యేనియత మనిమేషా శ్శ ఫరికాః" అమి శంకరులు అమ్మవారి కంటి సౌందర్యమునకోడి చేపలునీట మునిగి యున్నవని యవి యనిమేషములైన వని యుత్ప్రేక్షింపగా మూకమహాకవి శివశిరముపై నున్న మన్దాకిని పై గల కోపముతో అమ్మవారి కటాక్షము కుటిలముగా తిరుగు చేపయా? యని సందేహించినారు. శంకరులు త్ప్రేక్షాలంకారమును మూక మహాకవి సందేహాలంకారమును నయన శోభాహేతువులుగా గూర్చినారు.

'దృశాద్రాఘీ యస్యాదర దలిత నీలోత్పల రుచా
దవియాం సందీనం స్నపయకృపయా మామపిశివే'

అని శంకరులు అరవిరిసిన నల్లని కలువ కాంతి వంటి కాంతి గలనీ పొడవైన చూపుచే దూరముగా నున్న దీనుడనైన నన్ను గూడ గృపతో దడిపి వేయుమని ప్రార్థింపగా "మాతః క్షణం స్నపయ మాంతవ వీక్షణేన" అని మూక మహాకవి అమ్మా! నీ చూపుతో క్షణమాత్ర కాలమైనను దడిపి వేయుమని ప్రార్థించినాడు. మరొక చోట "విదలితోత్పల చాతురీణాం నిందాంకురః" వికసించిన కలువల చాతుర్యములకు నిందాం కురమమ్మవారి కటాక్షమని చెప్పినాడు. ఇరువురును అమ్మవారి చూపును కలువతో బోల్చియున్నారు. శంకరుల పైశ్లోక ప్రథమ పాదములోని "దరగలిత నీలోత్పల రుచా" అను దృగ్విశేషణము యొక్క యర్థమునే మూక మహాకవి "నీలోత్పలం నిజ సమీప నివాసలోలమ్ ప్రీత్యైవ పాఠయతి వీక్షణ దేవి కేన్వః"- తనకడ (చెవిపైన) శిష్యుడుగానున్న నీలోత్పలమునకు అమ్మవారి కటాక్షమనెడి గురుస్వామి కాలిమ సంప్రదాయమును నేర్పుచున్నట్లున్నదను నుత్ప్రేక్షతో నలంకరించినాడు.

'ఇయంచ శ్రీర్బద్ధచ్ఛాదక పాటం కువలయం
జహాతి ప్రత్యూషేనిశాన విఘటయ్య ప్రవిశతి'

XIV

అని శంకరులు చెప్పిన భావమునే మూక మహాకవి "దినేషు ప్రమ్లానతాం కువలయమ్ ప్రకటీ కరోతి",- పగళ్ళలో కలువ తన మ్లానతను ప్రకటించు చున్నది అని భంగ్యంతరముగా ప్రకటించినాడు. శంకరులొక చోట అమ్మవారి చూపును హేమాంబుజ రుచిః (బంగారు కమలము యొక్క కాంతి వంటి కాంతి గలది) అని పేర్కొన్నారు. దాని యర్థమునే మూక మహాకవి

'నీలాలకా మధు కరన్తి మనోజ్ఞ నాసా
ముక్తారుచః ప్రకట కన్ద బిసాంకురన్తి
కారుణ్యమంబ మకరన్ద్యతి కామకోటి
మన్యేతతః కమల మేవ విలోచనం తే'

(ఓ కామకోటీ! కామాక్షీ నల్లని ముంగురులు తుమ్మెదలైనీ నాసాభరణ ముక్తా కాంతులు బిసాంకురములై నీ దయ మకరన్దమై యుండుటచే నీ కన్ను కమలమే యని తలచు చున్నాను) అని ఉత్ప్రేక్షాలంకారముతో నలంకరించి విస్తరించినాడు. శంకరులమ్మవారి తృతీయ నేత్ర మగ్నిరూపము కావున హేమాంబుజ మన్నారు. మూక మహాకవి కామాక్షి యందు తృతీయ నేత్రము దర్శింపబడకుండుటచే సాధారణ కమలముగా నుత్ప్రేక్షించినాడు. శ్రీ శంకర మూక మహాకవులిరువురు అమ్మవారిని తమ జూపులతో తమను దడుపు మని ప్రార్థించినారని ఇంతకు ముందే చెప్పబడినది.

మూక మహాకవి ఐదవ దైన మన్దస్మిత శతకము నందు మన్దహాసముతో 'నను దడుపుమని ఈ క్రింది శ్లోకమున

'క్రమేణ స్నపయస్వకర్మకుహనా చోరేణ మారాగమ
వ్యాఖ్యా శిక్షణ దీక్షితేన విదుషా మక్షీణ లక్ష్మీపుషా

కామాక్షి! స్మిత కన్దలేన కలుషస్ఫోటక్రియా చుంచునా కారుణ్యామృత వీచికా విహారణ ప్రాచుర్య ధుర్యేణమామ్ (కర్మను దొంగిలించు, మన్మధాగమమును వ్యాఖ్యానించుటకు నేర్పుటకు దీక్ష వహించిన, క్షీణించని పాండిత్యముగల వారితో కాంతినింపగల, పాపములను పగులగొట్టు కర్మ యందు సమర్థమైన, దయామృత తరంగములలో దేలియాడు, నీ చిరునవ్వుతో నన్ను దడుపుము) అని ప్రార్థించినాడు. శ్రీ శంకరులు తమ సౌందర్యలహరిలో

నొక చోట అమృతము ద్రావియు దేవతలు మరణించు వారే కాని ఓ యమ్మ! నీ భర్త విషము ద్రావియు మరణము లేక యున్నాడు. ఇది నీ తాటంక మహిమ యని చెప్పినారు. ఈ భావమునే మూక మహాకవి

'సాహాయ్యం కలశాంబుధేర్వహతితే కామాక్షి మన్దస్మితం
శోభామోష్ఠ రుచాంచ విభ్రమ భు వామేతద్భిదామ్ బ్రూమహే
ఏతస్మాదుదితం పురాకిల పపౌశర్వః పురాణః పుమా
నే తన్మధ్యసముద్భవాం రసయతే మాధుర్య రూపాంసుధామ్

(ఓ కామాక్షీ! నీ మన్దస్మితము పాలసముద్రమునకు సాయమొనరించు చున్నది. విలాసముల జన్మభూములైన పెదవుల కాంతిని ధరించు చున్నది. పూర్వము పురాణ పురుషుడైన శివుడు ఆ పాలసముద్రము నుండి పుట్టిన యమృతముద్రావెనట, అదిపాతకథ, తృప్తినందక నీ పెదవుల మధ్య నుండి జనించు మాధుర్య రూప సుధను నిరంతరము ఆస్వాదించు చున్నాడు. ఇది వర్తమాన కథ) అని అమృతము కన్నను అమ్మవారి పెదవుల మధ్య జనించు సుధ యొక్క విశిష్ఠతను చెప్పుచునే విషమును ద్రావి యుండుట తద్దోష పరిహారార్థ మిప్పుడధర సుధను ద్రాగుట మనోహరముగ వర్ణించి విషము అమృతము రెండు పాల సముద్రము నుండి పుట్టి యుండవచ్చును. కానీ అమ్మ వారి మన్దస్మితము నుండి సుధయే జనించును గాని విషము జనించదు. అని వ్యంజింప జేయుచు మందస్మిత మహిమను ధ్వనింపజేయుచు తాటంక మహిమ కంటె మన్దస్మిత మహిమ గొప్పదియని సింగారించుచున్నాడు. పాలసముద్రములో జన్మించిన అమృతము నితర దేవతలతో బాటు శివుడు త్రావినను అది సాధారణమే కాని అసాధారణము కాదు. అమ్మవారి పెదవుల మధ్య నుండి జనించిన సుధ మాత్రము శివునకు మాత్రమే లభించినదగుట నిది యసాధారణము. అమృతము విషము పాల సముద్రములోనే జనించుటచే దేని కదే గుణమును దోషమును బ్రసాదించునే కాని యొక దాని ప్రభావము నింకొకటి పోగొట్ట జాలక పోవచ్చును. అని తలచి శివుడీ మందస్మిత క్షీర సముద్ర మధ్య జనితాధర సుధను ద్రావినాడు. తాటంక మహిమనెఱిగి ద్రావినాడు. తాటంక మహిమ మృత్యునివారకమైనదే. అయినను నీ మందస్మిత క్షీర సముద్ర జనితాధర సుధకున్న మాధుర్య మహిమ దానికి లేదు. ఈ పారవశ్యమును గల్గించు శక్తి దానికి లేదు.

మృత్యుంజయత్వము గొప్పదే కాని యది యానంద రూపము కాదు. అమ్మవారి యధర సుధ ఆనంద దాయకమని మూక కవి సింగారించుటలోని శృగార రసమాస్వాదింప దగినది.సాధారణామృతము నిచ్చు పాల సముద్రము కన్న అసాధారణ సుధ నొసగు మన్దస్మితము గొప్పది అని తాత్పర్యము. శ్రీ శంకరులు తమ సౌన్దర్యలహరిలో అమృతలహరి, ఆహ్లాదలహరి, ఆనన్ద లహరి, సౌన్దర్యలహరి అను లహర్యంత పదములను ప్రయోగించినారు. మూక మహాకవి గూడ ఇట్టి లహర్యంత పదముల బెక్కింటి బ్రయోగించినాడు. ఈ మన్దస్మిత శతకమున గూడ "మందస్మిత జ్యోతిషాం లహరీ" అని ప్రయోగించినాడు. శంకరుల వలె సమూహార్థకనికురుంబ శబ్దమును ఓష్ఠ శ్రీనికురుంబ పల్లవపుటే అని మూక మహాకవియు ప్రయోగించినాడు. శంకరులు "బహిరపి సముక్తామణిధరః" అని ముక్తామణిధరమైన నాసికను వర్ణించగా మూకమహాకవి "నాసాగ్రముక్తామణిః" యని ప్రయోగించినాడు. శ్రీ శంకరులమ్మవారి ముఖమును వర్ణించుచు అమ్మవారి ముఖ చంద్రస్మిత జ్యోత్స్నాపాన మాధుర్యాతిశయముచే చకోరములకు చంచు జడిమ ప్రాప్తముకాగా కొంచెము పులుపు నంజుకొని దానిని తగ్గించు కొనుటకై పుల్లనైన చంద్రామృత లహరిని పులిసిన గంజి యనుబుద్ధితో నా చకోరములు త్రాగినవని చెప్పి అమ్మవారి ముఖము చంద్రుని మించిన కాంతి గలదని వ్యంజింపజేయగా మూక మహాకవియు "బింబంచాంద్రమసంచ వంచయతి యాగర్వేణ సతాదృశీ కామాక్షి! స్మిత మంజరీ" (స్మిత మంజరి చంద్ర బింబమును వంచించు చున్నది) అని అమ్మవారి స్మితమంజరి చంద్రకాంతి నతిశయించుటను వ్యంజింప జేసినాడు. శంకరుల దృష్టిలో చకోరములనగా శివాది సాధువులు లేక వారి మనస్సులు కావచ్చును. మనమూహించుకొన వలసినదే కాని స్పష్టము చేయలేదు. అమ్మవారి ముఖ చంద్రజ్యోత్స్నలో వీరు తరు నీల పీతాది వర్ణముల వదలి శ్వైత్యమునే పొందుదురు. శుద్ధ సాత్త్వికత్వమునే పొందుదురు.

'వక్త్రేన్దోస్తవ చన్ద్రికా స్మిత రుచిర్వల్గు స్ఫురన్తీ సతాం
స్వాచ్ఛేద్యుక్త మిదం చకోర మనసాం కామాక్షి! కౌతుహలమ్'

అని మూక మహాకవి ఆ చకోరములు సత్పురుష మనస్సులే యని స్పష్టము చేసినాడు. ముఖచన్ద్ర జ్యోత్స్నను చకోరము లాస్వాదించుట యసంభావ్యము కదా! మూకమహాకవి వాక్కులలో కానవచ్చు సౌందర్యము ఇట్లు ప్రదర్శింపబడినది.

***

శ్రీ కామాక్ష్యైనమః

మోహాన్ధ కార నివహం వినిహన్తు మీడే
మూకాత్మనామపి మహాకవితావదాన్యాన్
శ్రీ కాంచిదేశ శిశిరీకృతి జాగరూకా
నేకామ్రనాథ తరుణీ కరుణావలోకాన్

అ|| శ్రీకాంచిదేశ - శ్రీకాంచీనగర ప్రాంతము యొక్క, శిశిరీకృతి - చల్లబరచుటయందు, జాగరూకాన్ - మేల్కొనియుండునట్టి, మూకాత్మనామ్ అపి - మూగవోయిన మనస్సు కలవారికైనను, మహాకవితావదాన్యాన్ - మహాకవిత్వమును ప్రసాదించునట్టి, ఏకామ్రనాథ - ఏకామ్రేశ్వరునియొక్క, తరుణీ - భార్య యయిన శ్రీ కామాక్షీదేవియొక్క, కరుణావలోకాన్ - దయతోకూడిన చూపులను మోహాన్ధకారనివహమ్ - మోహమనెడి చీకట్ల రాశిని, వినిహన్తుమ్ - నశింపజేయ, ఈడే - స్తుతించెదను.

తా|| శ్రీ కాంచీనగర ప్రాంతమును చల్లబఱచు నట్టివి శ్రీ కామాక్షీ కరుణావలోకములు - అవి మూగవారికిని మహాకవిత్వము నొసగును. నా మోహాంధకార రాశిని దొలగించ వానిని స్తుతించెదను.

వి|| భూమండలమందలి అన్ని ద్వీపములును సముద్రముచే చుట్టబడియుండును. భూదేవికి సముద్రమే కాంచియైయుండును. శ్రీ కామాక్షికి సర్వబ్రహ్మాండములు కాంచీ కింకిణీరూపములే. ఆమే బ్రహ్మాండనగరనాయిక. బ్రహ్మాండములనన్నిటిని తనలో నిముడ్చుకొన్న మహాకాశము ఆమెకు అంబరము. నడుముపైనున్న పీతాంబరము నొడ్డాణముతో బిగింపవచ్చును. కాంచీనగరమిట సర్వబ్రహ్మాండోపలక్షకము. సర్వబ్రహ్మాండముల కాధారమైన తననగరము కాంచియని పిలువబడుచు భారత దక్షిణ ప్రాంతమున విరాజిల్లుచున్నది. ఆ కాంచీనగర నాయకుని ప్రాంతమున నున్న యొక శివలింగము దగ్గఱగా ఒక మామిడి చెట్టుండుటచే నేకామ్రనాథ నామము కలిగినది. ఏకామ్రనాథ నాముడైన శివునకు కామాక్షీ నామముకల దేవి భార్య. కామాక్షీ నామమున కన్నుల

ప్రాధాన్యము కనబడును. మూకమహాకవి వ్రాసిన పంచశతిలోని ఐదు శతకములలో కటాక్షశతకము ముఖ్యము. కటాక్షమామెదే, ఆమె కన్నులలోనిదే. అదియే మూక మహాకవిచే నైదు శతకముల రచింపజేసినది. అక్షి ప్రాధాన్య సూచక కామాక్షీ శబ్దప్రతిపాద్యదేవతా కటాక్ష ప్రాముఖ్యమే కటాక్ష శతకము ప్రతిపాదించుచున్నది. సర్వేంద్రియాణామ్ నయనం ప్రధానమ్ అన్నంత మాత్రమున మిగిలిన యింద్రియముల యావశ్యకత నివారింపబడదు. మిగిలిన శతకములున్నప్పుడే దీనికి ప్రాధాన్యము లభించును. విగ్రహమునందు పాదముఖములే అనాచ్ఛాదితములు. భక్తుల యుపాసనలకు లక్ష్యములగుట యుపపన్నము. రెండవ శతకమున పాదద్వంద్వ ముపాసింపబడినది. ముఖమునందు పాసింపదగినవి కటాక్షమందస్మితములు. కటాక్షము కలిగినందుక సూచనగా పెదవులపై దరహాసమంకురించును. కావున మందస్మిత శతకమిందు చివరదైనది. కటాక్షము మందస్మితమునకు ముందుండవలసినది అట్లేయున్నది. ఇంద్రియములలో కన్నులు తైజసములు. అజ్ఞానమోహాద్యంధకార ప్రభేదముల నివారణమున కవియే యుపయుక్తములగును. కావుననే మూకమహాకవి యీప్రథమ శ్లోకమున మోహాన్ధకార నివహ వినిహననమునకై శ్రీ కామాక్షీ దేవి యొక్క కరుణావలోకములను బ్రార్థించు చున్నాడు. పరికరాంకు రాలకారధ్వని యీ శ్లోకమునందున్నది. జాగరూకాన్, కరుణావలోకాన్ అనిముగియు నుత్తరార్థ పాదాంతములలో అంత్యాను ప్రాసయున్నది. మూకా, శ్రీకా, ఏకా అని 2,3,4 పాదముల ఆదిలోనుండుటచే నాద్యనుప్రాసము. హాక, రక్ృ, ణీక మధ్యలో నుండుటచే మధ్యానుప్రాసము అను శబ్దాలంకారములున్నవి. ఈ శతకమున వసంతతిలకవృత్త ముపయోగింపబడినది. ఇందు "తభజజగగ" అనుగణములుండును వసంత ముఖమునకు భ్రమరము తిలకము అవదగును. కటాక్ష భ్రమరౌపమ్యము ప్రసిద్ధమగుటచే కటాక్షవర్ణనమున వసంతతిలకవృత్తముపయోగించుటచే వృత్తౌ చిత్య శోభితమీశతకము.

2. మాతర్జయన్తి మమతాగ్రహ మోక్షణాని
మాహేంద్రనీల రుచి శిక్షణ దక్షిణాని

కామాక్షి కల్పిత జగత్త్రయ రక్షణాని
త్వదీక్షణాని వరదాన విచక్షణాని

అ|| మాతః - తల్లీ!, కామాక్షి - కామాక్షీ!, మమతాగ్రహ మోక్షణాని - మమకారమనెడి దయ్యమునుండి విడిపించునట్టి, మాహేంద్రనీల - ఇంద్రనీల మణులయొక్క, రుచి - కాంతిని, శిక్షణ - శిక్షించుట యందు, దక్షిణాని - సమర్థములైన, కల్పిత - కల్పింపబడిన, జగత్త్రయ - మూడులోకములయొక్క, రక్షణాని - రక్షణముగల, వరదాన విచక్షణాని - వరముల నిచ్చుటయందు నేర్పుగల, త్వదీక్షణాని - నీచూపులు, జయంతి - సర్వోత్కృష్టముగా వర్ధిల్లుచున్నవి.

తా|| ఓ తల్లీ! కామాక్షీ! నీ చూపులు, నన్ను లేక అందఱను పట్టిన మమకారమనెడి దయ్యమునుండి విడిపించగల్గునవి. ఇంద్రనీల మణుల కాంతిని శిక్షించుటలో, ముల్లోకములకు రక్షణమును కల్పించుటలో, వరములిచ్చుటలో, సమర్థములైనవి.

వి|| మొదటిశ్లోకమున మోహమంధకారముగా రూపొందింపబడి దాని నాశము ప్రార్థింపబడినది. అజ్ఞానమందలి ఆవరణ శక్తి మోహమనబడును. ఉన్నవస్తువును కన్పింపకుండగప్పి వేయునది మోహము కావుననది యావరణశక్తి. దీనవలన స్వకీయులు పరకీయులునను భేదభావముత్పన్నమై ఒకే ఆత్మ కొందరు తనవారుగా కొందఱు తన వారుకాని వారుగా బహుత్వమును బొందును. వీరు తనవారు (ఇవి తనవి) అను భావమే మమకారమని పేర్కొన బడును. ఈ మమకారమొక దయ్యమువలె మనచే వికృతచేష్టల చేయించును. అమ్మవారి చూపులాదయ్యమునుండి విముక్తి కలిగించునని యీ శ్లోకమున జెప్పబడినది. ఈశ్వరత్వ వ్యవస్థాపకములైన నాలుగు కర్మలీ శ్లోకమున జెప్పబడినవి. మోక్షణము - మమకారము నుండి విడిపించుట. జీవులను సంసార బంధము నుండి విడిపించుటయే. మమేతి బధ్యతే జంతుః నిర్మమేతి విముచ్యతే అనుసూక్తి యిందుకు ప్రమాణము. శిక్షణము - ఇంద్రనీల మణుల కాంతులు అర్హత లేకున్నను దేవి చూపులతో సామ్యమును, ఐక్యమును పొందగోరుటచే వానిని శిక్షించుచున్నవా యమ్మ చూపులు. అహంకారము

వీడనివాడు స్థూల సూక్ష్మ కారణ శరీరములు నేననుకొనుచునే ఈశ్వరోహమని భావించును. ఇటువంటి వానిని గీతనిందించినది. ఈశ్వరోహమహంభోగీ సిద్ధోహం బలవాన్సుఖీ - అధ్యాయము 16 - శ్లోకము14' దుష్టులైన రాక్షసులందఱు ఈ కారణముననే శిక్షింపబడినారు. నేటికిని అప్పుడప్పుడు దుష్టులేదో విధమున నీశ్వరునిచే శిక్షింపబడుచునే యున్నారు. అద్వైతకలవాడు ఈశ్వరునితో నైక్యము ననుసంధించుట శాస్త్రసమ్మతమే. రక్షణము - దుష్ట శిక్షణముతోబాటు శిష్ట రక్షణము ఈశ్వర కృత్యమే. అమ్మ కనులు ముల్లోకముల రక్షించుచున్నవి, వరదానము - జీవుల కిహ పరలోకములలో కూడ సుఖములు కావలయును. దీనికభ్యుదయమను పేరు. దానిని కూడ ఈశ్వరుడే వివిధదేవతోపాసకులకు వారిద్వారా స్వోపాసకులకు స్వయముగా ప్రసాదించును కావున నిదియు నీశ్వరకృత్యమే. 'ణాని' అనినాలుగు పాదములచివఱ నుండుటచే నీశ్లోకమున నంత్యాను ప్రాసాలంకారము కలదు. కన్నులకు సమానములు కాదగిన ఇంద్రనీల మణుల కాంతులను శిక్షించుచున్నదని ఉపమాననింద వ్యంగ్యమగుచుండుటచే ఈ శ్లోకమునందలి అలంకారము ప్రతీపము.

3. ఆనంగ తంత్రవిధిదర్శిత కౌశలానా
మానందమంద పరిఘూర్ణిత మన్థరాణామ్
తారల్య మంబ తవతాడిత కర్ణసీమ్నాం
కామాక్షి! ఖేలతి కటాక్ష నిరీక్షణానామ్

అ|| అంబ - తల్లీ!, కామాక్షి - కామాక్షీ!, ఆనంగ తంత్రవిధి - మన్మథ తంత్రవిధాన మందు, దర్శిత - చూపబడిన, కౌశలానామ్ - నేర్పుగల, పరిఘూర్ణిత - తిరుగుటచేత, మంథరాణామ్ - అలసములైన, తాడితకర్ణసీమ్నామ్ - తాకిన చెవుల హద్దుగల, తవ - నీయొక్క, కటాక్షనిరీక్షణానామ్ - క్రీగంటి చూపులయొక్క, తారల్యమ్ - చంచలిత, ఖేలతి - ఆడుచున్నది.

తా|| అమ్మా! నీ చూపులు మన్మథ తంత్ర విధానమును ప్రదర్శించినవి. వానిలో ఆనందము మెల్లగా సుడి తిరుగుటచే కదలికలలో వేగము కోల్పోయినవి. అవి కర్ణాంతము వ్యాపించినవి. అట్టి నీచూపులలో చాంచల్యము ఆడుకొను చున్నది.

వి|| భర్తయైన శివునాకర్షించుటకు నీ కన్నులు మన్మథ తంత్ర విధానము ననుసరించి శృంగారవిలాసములను ప్రదర్శించుచుండును. కామునకు అనంగుడను పేరుగలదు కావున కామశాస్త్రమునకు అనంగ తంత్రమను పేరు వచ్చినది. అంతరంగమునందు పుట్టు కామునకు అంగములేదు. విష్వంగమునందు బుట్టిన అంగజుని అంగము శివునిచే కాల్పబడినది కావున కామునకు అనంగుడనుపేరు వచ్చినది. "సోఽకామయత" అనునుపనిషద్వాక్యానుసారము ఈశ్వరుని బహుభవన సంకల్పమే కాముడు. స్త్రీ పురుషులిద్దఱు. వారిని ముగ్గురిని చేయుటకు వారి అంతరంగములలో కాముడుద్భవించును. అట్టి కాముని జయించుట శివునకు మాత్రమే సాధ్యమయినది. అదియు తాత్కాలికముగ మాత్రమే. అమ్మవారి సౌందర్యము శివునిలో కామము కల్గింపజేయలేక పోవుటయే శివుని మన్మథదాహము. నిర్గుణ శివునకు కామరాహిత్యము శాశ్వతము. సగుణేశ్వరునకది తాత్కాలికము, తాద్దేశికము. ఈశ్వరుడనగా మాయాశబలబ్రహ్మము. ఆయనకు మాయతోడి సంపర్కమున సృష్టికర్తృత్వమేర్పడినది. మాయాస్వరూపిణియైన కామాక్షీదేవి కన్నులలోని అనంగ తంత్రము యొక్క మహిమయది. ఆమె కన్నులలోని శృంగార విలాసములకు శివుడు బానిసయైనాడు. తనను దహించిన శివునిపై అమ్మవారి కన్నులలో దాగియుండి కాముడు అదను చూచి శివుని జయించినాడు. మన్మథుడు శ్రీ విద్యా ప్రభేదములలోని కాది విద్యకు ద్రష్ట. త్రిపురోపనిషత్తులో నొక మంత్రమున కాదివిద్య ఉద్ధరింపబడినది. ఆ మంత్రమిది. "కామోయోనిః కమలా వజ్రపాణిః గుహాహసా మాతరిశ్వాభ్రమింద్రః పునర్గుహా సకలామాయయాచ పురూచ్యేషా విశ్వమాతాదివిద్యోమ్" ఈ విద్యయందు మూడు కూటములు కలవు. అందు రెండవ కూటమునకు కామరాజకూటమనిపేరు. హాదివిద్యాదులు కూడ శ్రీ విద్య ప్రభేదములే. వానిలోని ద్వితీయ కూటమునకును కామకూటమనియే పేరు. శ్రీవిద్యా సంప్రదాయములోని కామమునకున్న స్థానమిది. ఇంతేకాదు శాక్తేయ సాంప్రదాయమున శివునకు కాముడు, కామేశ్వరుడు అను పేర్లు కూడా కలవు. ఆతని దేవేరి కామేశ్వరి. ఆమెయే ఈ కామాక్షి. కామునకు చెఱుకుగడ విల్లు, పూలు బాణములు కలవనుట కవిసమయము కాని మన్మథుడు తన యుపాస్య దేవతయైన కామాక్షీదేవి

యొక్క సారూప్యము ధరించి యామెనుపాసించెను. ఆమెయను గ్రహమున ఆ సారూప్యమే ఆతనికి శాశ్వతమయ్యెను. ఉపాసనాకాలమున "నారుద్రోరుద్రమర్చ యేత్ నావిష్ణుర్విష్ణుమర్చ యేత్" ఇత్యాది సూక్తుల ననుసరించి యుపాస్య దేవతారూపమువంటి రూపమునుధరింపవలెను. అందుకే శివోపాసకులు భస్మరుద్రాక్షలు ధరించెదరు. విష్ణూపాసకులు తులసీమాలోర్ధ్వ త్రిపుండ్రముల ధరించెదరు. అందుచేత కామేశ్వరీ యుపాసకుడైన కాముడు వానిదరించి యామెనుపాసించెను. సచ్చిదానందము లీశ్వరునికి స్వరూపములు. అమ్మ వారీశ్వరి. కావున ఆనందమామె స్వరూపము. ఆమె శరీరమంతయు నానందఘనమే. కన్నులు ఆ ఆనందము చేతనే చాపల్యము తగ్గించుకొని మెల్లగా కదలుచున్నవని కవి వర్ణించినాడు. మెల్లగా కదలినప్పుడెక్కువకాలము తనపైనవి ప్రసరించుచుండునని కవి భావము. ఆమె కన్నులా కర్ణాంతములు. పెద్ద కన్నులలోని చూపులు మెల్లగా కదలినపుడు తనపై నెక్కువకాలము ప్రసరించుటనే విశ్లేషించి తెల్పుటకే కన్నులకు తాడిత కర్ణసీమ్నా మను విశేషణమును కవి కూర్చినాడు. జగమంతయు ఆ తల్లి చూపుల విలాసమే. ఆ చూపుల ఆటయే. ఖేలతియను క్రియాపదమీ యంశమును స్పష్టమొనర్చు చున్నది. బేసి పాదములు నామంతములు. సరిపాదములు ణా మంతములు అగుటచే నీ శ్లోకమున అంత్యానుప్రాసము కలదు.

4. కల్లోలితేన కరుణారసవేల్లితేన
కల్మాషితేన కమనీయ మృదుస్మితేన
మామంచితేన తవకించన కుంచితేన
కామాక్షి! తేన శిశిరీకురు వీక్షితేన

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, కల్లోలితేన - తరంగితమైన, కరుణారస వేల్లితేన - కరుణారసముచే పొంగిన, కల్మాషితేన - కలంకము కూర్పబడిన, కమనీయ మృదుస్మితేన - మనోహరమైన చిరునవ్వుగల, అంచితేన - గొప్పనైన, కించనకుంచితేన - కొంచెము వంచిన, తేన - ఆ, వీక్షితేన - చూపు చేత, మాం - నన్ను, శిశిరీకురు - చల్ల బఱుపుము.

తా|| అమ్మా! నీ శరీరమొక కరుణాసముద్రము. కన్ను అందలి తరంగమువలె నున్నది. అందు దయారసము పొంగుచున్నది. ఆ కన్ను కొంచెము వంగి యున్నది. అదిచూచువారికి పూజింప దగినదిగా తోచును. అందు అందమైన మందహాసము చిందులు త్రొక్కును. దానికి కాటుక దిద్దబడియున్నది. అట్టి నీ కంటి చూపుతో సంసారతాపతప్తుడనైన నన్ను చల్లబఱపుము.

వి|| శ్రీశంకరులమ్మ వారిని జయతి కరుణా కాచిదరుణా అని కరుణా స్వరూపిణిగా పేర్కొన్నారు. శ్రీలలితాసహస్రనామ స్తోత్రము కరుణారససాగరా అని పేర్కొన్నది. ఈ రెంటినీ కలిపి మూకమహా కవి అమ్మవారి కంటిని కరుణారస సముద్ర మందలి తరంగముగా పేర్కొన్నారు. అమ్మవారి కన్నుల యందలి ఆరుణ్యము కారుణ్యమే. ఆ కన్నుల యందు కాటుక రేక తీర్చబడినది. అది కన్నులలోని సహజమైన నైల్యమునకు మరింత వన్నెబెట్టుచున్నది. ఆ కన్నులయందు మందహాసము దోబూచులాడు చున్నది. అది ధావల్యమును బెంపొందజేయుచున్నది. సృష్టిస్థితిలయ హేతువులైన రజస్సత్త్వతమస్సులకు ఆరుణ్యనైల్య ధావల్యములు ప్రతీకలు. సృష్టిస్థితులేకాక లయముకూడ అమ్మవారి కరుణా కృత్యమే. లయము లేనిచో సృష్టియే యుండదు. సృష్టిలయ పూర్వకమని ధ్రువం జన్మమృతస్యచ అను గీతా వాక్యము సిద్ధాంతీకరించి చెప్పినది. అమ్మవారి సంపూర్ణ దృష్టిని కోరుట అత్యాశయమగునేమో కొంచెము వంగిన దృష్టియైన (అనగా కరుణ లేశముగలచూపు) చాలునని అదియే లౌకికాలౌకిక సర్వసుఖముల నొసగ సమర్థమగునని అమ్మవారి కరుణా ప్రభావాతిశయము వర్ణించుటకు కరుణగల కడగంటి చూపుచాలునని కవి చెప్పుచున్నాడు. దక్షిణ భారత భాషల వారి కవిత్వములో వర్ణమైత్రియను నామాంతరముగల వళికి ఆదరము హెచ్చు. కావున వారు ప్రాంతీయములైన తమభాషల కవిత్వములలో దానిని నియతమొనర్చిరి. దాక్షిణాత్య కవులు వ్రాసిన సంస్కృత కవిత్వములలో నియత మొనర్పకున్నను దానిని పుష్కలముగా ప్రయోగించిరి. ఈ శ్లోకమున 1-6 వర్ణములకు మొదటి రెండు పాదములలో మైత్రి కూర్ప బడినది. మొత్తము 11 పదములలో 8 పదములు తేన అను నక్షరములతో ముగియుటచే పదాంతాను ప్రాసము కలదు. కల్లోలిత యను విశేషణము

తరంగములను; కరుణారసవేల్లిత అను విశేషణము జలాధిక్యమును; కల్మాషితయను విశేషణము సముద్రములోని కాలకూట విషమును, కమనీయ మృదుస్మితయను విశేషణము సముద్రములో జనించిన చంద్రుని ధ్వనింపజేయుటచే విశేష్యమైన వీక్షితమునకు సముద్రముతోడి సామ్యము ధ్వనిత మగుచున్నది.

5. సాహాయ్యకం గతవతీ ముహురర్జునస్య
మందస్మితస్య పరితోషిత భీమ చేతాః
కామాక్షి! పాండవచమూ రివ తావకీన
కర్ణాంతికం చలతి హంత కటాక్షలక్ష్మీః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీదేవీ, ముహుః - మాటి మాటికి, అర్జునస్య - తెల్లనైన (అర్జునునకు), మందస్మితస్య - చిరునవ్వునకు, సాహాయ్యకం - తోడ్పాటుగా, గతవతీ - వెళ్ళిన, పరితోషిత - సంతోషపెట్టబడిన, భీమ - శివునియొక్క (భీమునియొక్క), చేతాః - చిత్తముగల, కటాక్షలక్ష్మీః - కడగంటి కాంతి, పాండవచమూరివ - పాండవసేనవలె, తావకీన కర్ణాంతికమ్ః - తావకీన - నీ, కర్ణ - చెవులయొక్క (కర్ణునియొక్క)ః, అంతికమ్ - దగ్గఱకు, చలతి - కదులుచున్నది, హంత - ఆహా!

తా|| ఈ శ్లోకమున అమ్మవారి కాంతి పాండవసేనతో పోల్చబడినది. అమ్మవారి కడగంటి కాంతి మాటిమాటికి తెల్లని చిరునవ్వునకు సహాయముగా వెళ్ళుచున్నది. ఎట్లు? పాండవసేన అర్జునునకు సహాయముగా వెళ్లినట్లు. అమ్మవారి కడగంటి కాంతి శివుని చిత్తమును సంతోషపరచు చున్నది. ఎట్లు? పాండవసేన భీముని చిత్తమును సంతోషపఱచినట్లు. పాండవసేన కర్ణుని దగ్గఱకు వెళ్ళినట్లు అమ్మవారి కడగంటి కాంతి చెవిసమీపమునకు కదలుచున్నది. అమ్మవారి కటాక్షములు చిరునవ్వు చిందించునవి. కర్ణాంతమును చేరునంత విశాలములైనట్టివి.

వి|| అర్జున, భీమ, కర్ణ పదములు శ్లిష్టములు. కావున శ్లేషానుప్రాణితో పమాలంకారము కలదు. తకార వర్ణావృత్తి యుండుటచే వృత్త్యనుప్రాసాలంకారమను శబ్దాలంకారమిందు కలదు. కటాక్షలక్ష్మి కర్ణుని దగ్గఱకు

కదలుచున్నది అను వాక్యమున నాయికా నాయక భావము స్ఫురించుటచే సమాసోక్త్యలంకారము కలదు.

6. అస్తంక్షణా న్నయతు మే పరితాపసూర్య
మానన్దచంద్రమస మానయతాం ప్రకాశమ్
కాలాంధకారసుషమాం కలయ న్దిగన్తే
కామాక్షి! కోమలకటాక్ష నిశాగమ స్తే

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవి!, దిగన్తే - దిక్కులచివఱ, కాలాంధకారసుషమామ్ - నల్లని చీకటి కాంతిని, కలయన్ - కలిగించుచు, తే - నీ యొక్క, కోమలకటాక్షనిశాగమః - మృదువైన కటాక్షమనెడి రాత్రి యొక్క రాక, మే - నాయొక్క, పరితాపసూర్యమ్ - పరితాపమనెడి సూర్యుని, క్షణాత్ - క్షణములో, అస్తమ్ - చివరిదశను, నయతు - పొందించును గాక! ఆనన్దచన్ద్రమసమ్ - ఆనందమనెడి చంద్రుని, ప్రకాశమ్ - సమక్షమునకు (బయటకు), ఆనయతామ్ - కొని వచ్చునుగాక!

తా|| అమ్మవారి కటాక్షమనెడి రాత్రి యొక్క రాక దిగంతమున చీకట్లను వ్యాపింపజేయుచున్నది. అది పరితాపమనెడి సూర్య కాంతిని వెంటనే అస్తమింప జేయుగాక! అది నాలో ఆనంద చంద్రప్రకాశమును నింపుగాక! రాత్రిరాకతో దిక్కులచివఱలలో చీకట్లు గ్రమ్ముకొనును. సూర్యుడస్తమించును. ప్రకాశము విస్తరించును. కటాక్షాగమముతో పరితాపము నశించును. ఆనందము వెల్లివిరియును. కన్నులలోని నల్లదనము దిగన్తముల విస్తరించును.

వి|| అవయవులు కటాక్షనిగాగమములు. అవయవములు పరితాప సూర్యులు. ఆనంద చంద్రులు. సూర్య చంద్రాద్యవయవసహితనిశా గమముగా అమ్మవారి కోమలకటాక్షము రూపింపబడుటచే నీ శ్లోకమున సావయవరూపకాలంకారము కలదు. అది కటాక్ష నిశాగమః అను సమాసమున నుండుటచే సమస్త రూపకము. కటాక్ష నిశాగమములయొక్క సామ్యము వ్యంగ్యము. అమ్మవారి కటాక్షము తమస్సును హరింపవలసినదై యుండగా రాత్రివలె దిక్కులలో నంధకారమును విస్తరింప జేయునదిగా ఇట వర్ణింపబడుట కొందఱకౌచిత్య భంగముగా తోచవచ్చును. కాని యా నిశాసర్వభూతానాం

తస్యాం జాగర్తి సంయమీ యస్యాం జా(గతి భూతాని సానిశా పశ్యతోమునేః అను గీతాసూక్తిననుసరించి జ్ఞానికిసంసారము రాత్రిగా తోచును. అజ్ఞానికి బ్రహ్మము రాత్రిగా తోచును. సంసారదుఃఖమును కనిపింప జేయని చీకట్లు ముసరుకొనుట అమ్మవారి కటాక్షముతో సంభవించినచోనిక కావలసిన దేమున్నది. కావున సంసారము కనిపించజేయని చీకట్లను అమ్మవారి కటాక్షము వ్యాపింప జేయుట యుచితమేయగుచున్నది. అపుడే పరితాపసూర్యుడస్తమించుట ఆనంద చంద్రప్రకాశము వ్యాపించుట సంభవింపగలదు

7. తాటంక మౌక్తిక రుచాంకుర దన్తకాన్తిః
కారుణ్య హస్తిప శిఖామణి నాధి రూఢః
ఉన్మూలయ త్వశుభపాదప మస్మదీయం
కామాక్షి! తావక కటాక్షమతంగజేన్ద్రః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, తాటంక - కమ్మలలోని, మౌక్తిక - ముత్తెములయొక్క, రుచాంకుర దన్త కాన్తిః - కాంతి మొలకలనెడి దంతకాంతులుగల, కారుణ్య హస్తిపశిఖామణినా - దయయనెడి శ్రేష్ఠుడైన మావటీనిచేత, అధిరూఢః - ఆరోహింపబడిన, తావక కటాక్షమతంగ జేన్ద్రః - నీ కడగంటి చూపనెడి గజేన్ద్రము, అస్మదీయమ్ - మా, అశుభపాదపమ్ - అమంగళమనెడి వృక్షమును, ఉన్మూలయతు - పెకలించి వేయుగాక!

తా|| ఓ కామాక్షీదేవీ! నీ కర్ణభూషణములలోని ముత్యముల కాంతులు దంతకాంతులుగా కనిపించుచున్నవి. (ఏనుగునకు దంతియను పేరు దంతముల వలననే వచ్చును) నీ కటాక్షమే ఏనుగు. దానిపై కారుణ్యమను మావటివాడు ఎక్కి యున్నాడు. ఏనుగులకు వృక్షమును పెకిలించుట అలవాటైన సులభమయినపని. కారుణ్య హస్తిపారూఢమైన నీ కటాక్ష గజేంద్రము మాయొక్క అమంగళ వృక్షమును సమూలముగా పెకలించి వేయుగాక!

వి|| అమ్మవారి కర్ణభూషణములలో ముత్యములు పొదగబడినవి. వాని కాంతి కటాక్షములపై బడుచుండగా కటాక్ష గజేంద్రమునకు దంతములు

పొడచుకొని వచ్చినట్లు అమ్మవారి కారుణ్యము కటాక్షముపై ప్రకాశించు చుండగా కటాక్ష గజేంద్రవము కారుణ్య హస్తిపారూఢమైయున్నట్లు కనియుత్ప్రేక్షించుట వ్యంగ్యమగుచున్నది. అరణ్యమున మంచివి చెడ్డవియైన బహువిధ వృక్షములుండును. మావటివాడు లేనప్పుడే వృక్షములనైన నేనుగులు పెకలించివేయగలవు. ఇట అశుభపాదపమే ఉన్మూలింపబడ వలెనన్న కటాక్ష గజేన్ద్రవము కారుణ్య హస్తిపారూఢము కావలెను. అదియట్లే తన యశుభవృక్షమును నిర్మూలింప జేయుగాక యని కవిచే నమ్మవారి కటాక్షము ప్రార్థింప బడుచున్నది. ఈ శ్లోకమున రూపకాలంకారమున్నను పైన వివరింపబడిన యుత్ప్రేక్షణము వ్యంగ్యముగా నున్నది. రెండు నాల్గు పాదములలో క - ఖ వర్ణములకు కా - క అను వర్ణములకు మైత్రి పాటింప బడినది. పై శ్లోకమున వృక్ష ప్రస్తావన వచ్చినది. కటాక్షమునే సురవృక్షమునుగా నిరూపించుటకీ శ్లోకమవతరింప జేయబడు చున్నది.

8. ఛాయా భరేణ జగతాం పరితాప హారీ
తాటంక రత్న మణితల్లజ పల్లవశ్రీః
కారుణ్యనామ వికిరన్మకరంద జాలం
కామాక్షి రాజతి కటాక్ష సురద్రుమ స్తే

అ|| కామాక్షి! - ఓ కామాక్షీదేవి!, ఛాయాభరేణ - దట్టమైన నీడచేత, జగతాం - లోకములయొక్క, పరితాపహారీ - పరితాపమును దొలగించు, తాటంక - కమ్మలయందలి, రత్నమణి తల్లజ - శ్రేష్ఠములయిన రత్నముల మరియు మణుల వంటి, పల్లవశ్రీః - చిగురుటాకుల కాంతిగల, తే - నీయొక్క, కటాక్షసురద్రుమః - కడకంటి కాంతియనెడి కల్ప వృక్షము, మకరందజాలమ్ - పుష్పరస సమూహమును, కారుణ్యనామ - దయయను పేరి, వికిరన్ - వెదజల్లుచు, రాజతి - ప్రకాశించుచున్నది.

తా|| ఓ కామాక్షీదేవీ! తన చల్లని నీడతో జగముల పరితాపమపహరించునట్టి కమ్మలలో పొదగబడిన శ్రేష్ఠ రత్నమణులే ఎఱ్ఱని చిగురుటాకులై ప్రకాశించుచుండగా దయయను మకరందరసపు వెల్లువను వెదజల్లుచు నీ కటాక్ష కల్పతరువు రాజిల్లు చున్నది.

వి॥ వృక్షము, సూర్యతాపహరము. కటాక్షము ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవిక జగత్పరితాపత్రయమును హరించును. కటాక్షకల్ప తరువునకు తాటంక రత్నమణులే చిగురుటాకులు. కారుణ్యమే మకరందము. కటాక్షకలిన్ద కన్యా అను సమాసమున్నందున ఈ శ్లోక మునందును పై శ్లోకము నందువలె వ్యస్తరూపకాలంకారము కలదు. వృక్షము సూర్య తాపమును మాత్రమే యపహరింపజాలును. సురవృక్షము ఆధ్యాత్మికాది తాపత్రయమును సైతము కొంచెమపహరింపజాలును. శ్రీదేవీ కటాక్షము మాత్రము సంపూర్ణముగా వాని నపహరింపగలదు. ఈ లోకములోని వృక్షాది భౌతిక పదార్థముల వలన లభించు సుఖము అత్యల్పము. సురలోకములో లభించునట్టి సుఖము నరలోకసుఖము కంటే దీర్ఘ కాలము వఱకు ఉండు నట్టిదే యైనను 'శాశ్వతము' మాత్రము కాదు. శాశ్వతమైన సుఖము మోక్షమొక్కటే. అది కామాక్షి కటాక్షముననే కలుగును.

9. సూర్యాశ్రయ ప్రణయినీ మణికుండలాంశు
లౌహిత్య కోకనద కానన మాననీయా
యాంతీ తవ స్మర హరానన కాన్తిసిన్ధుం
కామాక్షి! రాజతి కటాక్ష కలిన్దకన్యా

అ॥ కామాక్షి! - ఓ కామాక్షీదేవీ!, సూరి - సూర్యునియొక్క (విద్యాంసులయొక్క లేక విద్యా సూరులనెడి జీవుల యొక్క), ఆశ్రయ - ఆశ్రయించుట యందు, ప్రణయినీ - ప్రేమగల, మణికుండలాంశు - మణికుండలముల కాంతులయొక్క, లౌహిత్య - ఎఱుపు అనెడి, కోకనద - ఎఱ్ఱకలువల, కానన - అడవిచేత, మాననీయా - గౌరవింప దగిన, స్మరహర - శివుని యొక్క, ఆనన - ముఖము యొక్క, కాన్తిసిన్ధుమ్ - కాంతియనెడు సముద్రమును, యాన్తీ - చేరుచున్న, తవ - నీయొక్క, కటాక్షకలిన్ద కన్యా - కడగంటి చూపనెడి యమునానది, రాజతి - ప్రకాశించుచున్నది.

తా॥ ఓ కామాక్షీదేవీ! నీ కటాక్షము యమునానదియే. యమునానది తన ఆవిర్భావహేతువైన సూర్యుని ఆశ్రయమునందు ప్రేమకలది. నీ కటాక్షము సూరిజనుల ఆశ్రయించుట యందు ప్రేమకలది. యమునానది

ఎఱ్ఱి కలువల వనముల నుండి ప్రవహించును. నీ కటాక్షము మణికుండల కాంతుల నుండి పెల్లుబికి వచ్చును. యమునానది సముద్రమును చేరును నీ కటాక్షము శివముఖ కాంతినిజేరును. అందుచేత నీ కటాక్షము యమునానదియే.

వి|| యమునానది కలిన్దగిరి నుండి పుట్టి ప్రవహించుచు చివఱకు గంగలో కలసి గంగతో కూడి సముద్రమును చేరునట్లు అమ్మ కటాక్షమమ్మవారి ముఖము నుండి యావిర్భవించి కుండలాంశు కాంతులనెడి యెఱ్ఱి కలువల యడవులలో నుండి ప్రవహించుచు చివఱకు శివుని ముఖము చేరి యాగి పోవును. నది ప్రయాణము సముద్రము వఱకే గదా. యమునానది గంగానదికుపనది యగుటచే స్వయముగా సముద్రము చేరజాలకున్నను గంగతోకూడి సముద్రమును చేరును. ఈ శ్లోకమునందు రూపకాలంకారమే కలదు. విశిష్టాద్వైత సిద్ధాంతమున జీవులు మూడు విధములుగా నుందురు. బద్ధులు, ముక్తులు, నిత్యులు (సూరులు). బద్ధులు అనగా మనవలె సంసారమున బంధింపబడియున్నవారు. ముక్తులనగా పరమేశ్వరానుగ్రహమున ముక్తిని పొందిన వారు. నిత్యులనగా నెల్లప్పుడు వైకుంఠముననే యుండి విష్ణువును సేవించువారు. వీరినే నిత్య సూరులనియు నందురు. మూకకవి పరమార్థమున విశిష్టాద్వైత మంగీకరింపకున్నను వ్యావహారికముగ నందు చెప్పబడిన భక్తి సిద్ధాంతము నాశ్రయించియే యీ స్తోత్రమును రచించియున్నందున సూర్యాశ్రయ ప్రణయనీ అను విశేషణమున ఆ విశిష్టాద్వైత సిద్ధాంతమందంగీకరింపబడిన సూరులను జీవభేదములను సూచించియున్నాడని చెప్పవచ్చును. లేదా సూరియనగా జ్ఞాని అని మాత్రమే అర్థము చెప్పుకొని విశిష్టాద్వైత పరామర్శమిట లేదనియు చెప్పవచ్చును. అద్వైతము నందును వ్యావహారికముగా భక్తికి గొప్ప స్థానమున్నదే.

10. ప్రాప్నోతి యం సుకృతినం తవ పక్షపాతా
త్కామాక్షి! వీక్షణ విలాస కలాపురన్ధ్రీ
సద్య స్తమేవ కిల ముక్తి వధూ ర్వృణీతే
తస్మా న్నితాన్త మనయో రిద మైకమత్యమ్

అ|| కామాక్షి - ఓ కామాక్షీదేవీ!, వీక్షణ విలాసకలాపురన్ధ్రీ - చూపుఅను

నొయ్యారపు భామ, తవ - నీయొక్క, పక్షపాతాత్ - తెప్పంకదల్చుటవలన (ఇరుపక్షముల యెడల సమానముగా నుండక యొకపక్షముపై ప్రేమను ప్రకటించుట వలన), యమ్ - ఏ, సుకృతినమ్ - పుణ్యవంతుని, ప్రాప్నోతి - చేరునో, తమేవ - అతనినే, ముక్తివధూః - ముక్తియనెడి కాంత, సద్యః - వెంటనే, వృణీతే - స్వయముగా వరించునది, అనయోః - కటాక్ష విలాసకలాపురంధ్రీ ముక్తి వధువు అనునీయిరువురికి, తస్మాత్ - అందువలన, ఇదమ్ - ఈ, ఐకమత్యమ్ - ఏకాభిప్రాయము, దృశ్యతే - కానవచ్చునను (అధ్యాహారము).

తా|| ఓ కామాక్షీదేవీ! నీ చూపుల కదలికలలోని కళయనెడి యొకసతి పక్షపాతము చూపి ఎవనిని చేరుకొనునో ఆతనినే ముక్తి వధువు వెంటనే స్వయముగా వరించును. అందువలన వీక్షణ విలాస పురంధ్రికి ముక్తి వధువునకైకమత్యము కనబడుచున్నది. ఎన్ని జన్మల పున్నెమున్ననో అమ్మవారి కటాక్షము కల్గును. కటాక్షమా పుణ్యాత్మునిపై పడెనో లేదో అప్పుడే అతనికి ముక్తి లభించును.

వి|| ఈ లోకమున ఎవరికేక్షణమున నెవరిపై రాగమంకురించునో చెప్పజాలము. ఇరుపక్షములవారు సమానమైనను శ్రీ కృష్ణుడు పాండవ పక్షపాతియని పేరు తెచ్చుకొనెను. అమ్మవారి కటాక్షపాతమునకు పూర్వజన్మ పుణ్యమే కారణమని మన మనుకొనవలెను. కాని యిటువంటి పుణ్యాత్ము లెందఱో యుండగా నా యొకనిపై నమ్మవారి కటాక్షమునకు పక్షపాతమేలనో చెప్పజాలము. కాని పుణ్యాత్ముడు తన పుణ్యబలమే అమ్మవారి కటాక్షమునకు తనను పాత్రమొనరించుకొన్నదని యహంకారము రూపుమాపుటకే యాకటాక్షమాపక్ష పాతము ప్రదర్శించినది. మరొక విషయము. అమ్మవారి కటాక్షము పుణ్యాత్మునిపై బడునా? లేక కటాక్షము పడిన పిమ్మటనే యాతనికి పుణ్యమొనర్చు బుద్ధి పొడమునా? యనియు సందేహము కలుగును. సాధారణముగా పుణ్యాత్ములు అనగా వేదశాస్త్ర రూపమైన దేవి యాజ్ఞననుసరించి సత్కర్మనాచరించువారు తమ యాజ్ఞను పాటించువారిపై నెవరికైనను ప్రేమ కలుగును కదా! కాని యొక్కొక్కప్పుడు అవ్యాజముగా నిర్నిమిత్తముగా అమ్మవారి కటాక్షమే ముందుపడును. ఆ తరువాతనే వాడు పుణ్యమొనరించును. ఇది అసాధారణము. ఈ అసాధారణ్యమే

లేనిచో పుణ్యాత్ములకు తమ పూర్వ కర్మలకు సంబంధించి యహంకారము కల్గును. అమ్మవారనుగ్రహింపక యెట్లుండ గలదను గర్వము కలుగును. అట్టి దోషము నివారించుటకు అమ్మవారసాధారణరీతిలో ముందుగానే యొకనిపై కటాక్షము పఱచును, వాడు పుణ్యాత్ముడగును, వానికి చిత్తము శుద్ధమై జ్ఞానవముదయించి పిమ్మట ముక్తుడగును. సాధుకర్మ కారయతియమేవైష. ఇత్యాది శ్రుతి పైవివరణమునకు ప్రమాణము. ఒక పురుషుడుండును వానిని పెక్కురు స్త్రీలు ప్రేమింతురు లేక కామింతురు. పెక్కురు స్త్రీల ప్రేమకు పాత్రుడైన వానిని దక్షిణనాయకుడందురు. దాక్షిణ్యమనగా ఇరువురు నాయికలందు సమానానురాగము కలిగియుండుట లేదా కనీసము సమానానురాగము కలిగియున్నట్లు నటించు సామర్థ్యము కలిగియుండుట దాక్షిణ్య శబ్దమునకు సామర్థ్యమను నర్థము కూడ కలదు. కటాక్ష విలాసకల ఎవనిని చేరునో వానిని ముక్తి వధువు కూడా చేరును. పుణ్యాత్మునకు దక్షిణ నాయకత్వము కలుగునని కవి యిచ్చట వ్యక్తమొనర్చుచున్నాడు. సాధారణముగా పురుషునొక స్త్రీ చేరినదని యెఱిగిన పిమ్మట మరొక స్త్రీ యాతనిని చేరదు. అసాధారణముగా ఒక స్త్రీ పురుషుని చేరుట చూచి మరొక స్త్రీ యాతనినే చేరును. శ్రీకృష్ణుని విషయమున నిట్లే జరిగి వేలకొలది కన్యలను శ్రీ కృష్ణుడు పెండ్లాడవలసి వచ్చెను. కటాక్ష విలాసకల కటాక్షాధీన యైన పతివ్రతయను కొందము. ఆమె పక్షపాతమును ప్రదర్శించి యొక పుణ్యాత్ముని చేరినది. పతివ్రతయే యిట్లొనరించినప్పుడు పెండ్లి కాని వధువు నాతనినేల వరింపకుండును. అందుకే ముక్తి వధువు ఆతనిని వరించునని కవి చెప్పుచున్నాడు. ఈ నాయికానాయక వ్యవహారమిందు రూపకాలంకారముచే వ్యంజింప జేయబడినది. సాధారణముగా సమాసోక్త్యాలంకారమున నాయికానాయక వ్యవహారము వాచ్యము చేయబడక వ్యంగ్యముగానే స్ఫురించుచుండును. ఈ శ్లోకముననది వాచ్యము చేయబడినది. అయినను పుణ్యాత్మునందు దక్షిణనాయకత్వము వ్యంగ్యముగానే యున్నది. అది వాచ్యము చేయబడలేదు. కావున రూపకానుప్రాణిత సమాసోక్త్యలంకారము ఇందున్నదని చెప్పవచ్చును. ఒక పురుషునిరువురు ప్రేమించు సందర్భమున పురుషుడిరువురు స్త్రీలను సమానముగా ప్రేమింప గలిగినను స్త్రీలు తమలో తాము ఆతని యధిక ప్రేమనాశించి కలహింపకుండక యుండజాలరు. దక్షిణ నాయకుడైన

శ్రీకృష్ణుని యిరువురు రాణులు రుక్మిణీ సత్యభామలట్లు కలహించినారందురు. కాని సత్యభామ కలహించి యుండవచ్చును. రుక్మిణి సత్యభామపై మత్సరమును పొందినట్లు తార్కాణమేమియు కానరాదు. అస్తు. ప్రస్తుతమున అమ్మవారి కటాక్షవిలాసకల నాదరించి దాని యాదరమునకు పాత్రుడైన యాతనినే ముక్తి వధువు వరించునని కవి యిచ్చట చెప్పుచున్నాడు. ఆమె ఆతరువాత కలహింపనే కలహింపదను విషయము వృణీతే యని కవి యాత్మనే పద క్రియను ప్రయోగించుటచే స్పష్టమగుచున్నది. స్వయముగా సస్త్రీకుని వరించిన వారు పిమ్మటెట్లు కలహింపగలరో! ఆసత్యభామయట్లు కలహించెను. అందుచే గర్వభంగమునకు గురియయ్యెను. కథ సుఖాంతమే యయినది. ఈ పుణ్యాత్ముని కథయు సుఖాంతముగానే యుండగలదు. కామాక్షి మహాదేవత. దేవతలకే పక్షపాతముండదు. అందుకే వారని మిషులని పిలువబడుచున్నారు. కామాక్షీ దేవతకెట్లు పక్షపాతము సంభవించును. సామాన్య రాజ్ఞికే పక్షపాతము తగదు. మహారాజ్ఞియగు కామాక్షీ దేవి యొక్క వీక్షణ విలాస కలాపురంధ్రికి పక్షపాతము ఎట్లు సంభవించును? సామాన్య జీవుల నేత్రమునకు పక్షపాతము సహజము. పక్షపాతము లేని జీవులే లేరని చెప్పిన నతిశయోక్తి కాదు. పక్షపాతము ఒకరి యెడ నిష్కారణముగ దయను ప్రదర్శించుట ఈశ్వరి యొక్క నిరంకుశస్వాతంత్ర్యమునకు సూచకము. వైషమ్యనైర్ఘృణ్యదోషములు లేవని చెప్పుటచే నీశ్వరుడు పక్షపాతము లేక జీవులకందరికి వారు చేసిన కర్మలకు ఫలమును మాత్రమే నొసగునను మాట ఈశ్వరునికి పారతంత్ర్య దోషమును సమకూర్చును. తన్నివారణార్థమే యసాధారణముగా యత్నించి జీవసమూహమున పక్షపాతమును ధరించుట పారతంత్ర్య దోష నివారణార్థమంగీకరించదగినదియే యగును. ఇందుకు ప్రమాణమీ ఉపనిషద్వాక్యము తమేవసాధు కర్మ కారయతీయమే వైషఉన్ని నీషతే తమేవా సాధు కర్మ కారయతి యమధోనినీషతే పక్షపాత శబ్దప్రయోగ సౌందర్యమత్యాశ్చర్యకరము.

11. యాన్తీ సదైవ మరుతా మనుకూలభావమ్
భ్రూ వల్లి శక్రధను రుల్లసితా రసార్ద్రా
కామాక్షి! కౌతుక తరంగిత నీలకంఠా
కాదంబినీవ తవ భాతి కటాక్షమాలా

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, కటాక్షమాలా - కడగంటి చూపుల వరుస, సదా - ఎల్లప్పుడును, మరుతామేవ - దేవతలకే (గాడ్పులకే), అనుకూలభావమ్ - ఆనుకూల్యమును, యాన్తీ - పొందుచున్నదై, భ్రూవల్లి శక్రధనుః - కనుబొమ్మలనెడి యింద్ర ధనువుచే, ఉల్లసితా - ప్రకాశించినదై, రసార్ద్రా - శృంగార రసముచే (జలముచే) తడిసినదై, కౌతుకతరంగిత నీలకంఠా - కుతూహలముప్పొంగిన శివుడు (నెమలి) కలదై, కాదంబినీవ - మేఘమాల వలె, భాతి - ప్రకాశించుచున్నది.

తా|| అమ్మ వారి కటాక్షమాలిక మేఘమాలిక వలె ప్రకాశించుచున్నది. ఇట్లనుటకీ క్రిందివి హేతువులు. మేఘమాలిక గాడ్పులకనుకూలముగా చలించును. కటాక్షమాలిక దేవతలకనుకూలముగా చలించును. మేఘమాలిక పైన ప్రకాశించినది. జలముచే తడిసినది. కటాక్షమాలిక ఉల్లాసముగలది. దయారసముచే తడిసినది. మేఘమాలిక శక్రధనువు గలది. కటాక్షమాలిక భ్రూవల్లి కలది. మేఘమాలికను చూచి నెమలి కుతూహలము చెంది యుండును. కటాక్షమాలికను చూచి శివుడు కుతూహలము చెంది యుండును. ఈ శ్లోకమున శ్లేషానుప్రాణితమైన ఉపమాలంకారము కలదు. అది శివుడు, నెమలి; భ్రూవల్లి, శక్రధనువు, అను ఉపమేయోపమాన ధర్మముల బింబ ప్రతిబింబ భావముతో కూడియున్నది. కటాక్ష భ్రమరములకు పోలిక స్వతస్సిద్ధము. కటాక్ష మేఘమాలికల కౌపమ్యము స్ఫురింపజేయుటకు శ్లేషయను బింబ - ప్రతిబింబ భావము నిట నాశ్రయింపబడినవి.

వి|| దేవతల పట్లనే ఆనుకూల్యమును ప్రదర్శించుట. వెనుక శ్లోకమున జెప్పిన ఈశ్వరి పక్షపాతమునకీ శ్లోకమున దృష్టాంతము చూపబడుటచే పూర్వ శ్లోకమునకు ఈ శ్లోకమునకు ప్రసంగ సంగతి కలదు. *శివే శృంగారార్ద్రా*" అని అమ్మవారి చూపును శివుని పట్ల శృంగారార్ద్రమని శంకరులు చెప్పినారు. మూకకవి ఈ శ్లోకమున రసార్ద్రా అని ప్రయోగించి శంకరుల భావమును వ్యంగ్యమొనర్చినాడు. మేఘముల జూచిన నెమలి యాడుచున్నప్పుడు క్వాచిత్కముగా పక్షపాతము జరుగును. దయాస్వరూపురాలైన అమ్మవారి శృంగారపుజూపుల మైకములో శివుడు వైషమ్యమునకులోనై అమ్మవారి భక్తుల యెడ పక్షపాతము జూపుననుటయు అమ్మవారి కటాక్షము తన పక్షపాత స్వభావమును శివుని పైనను రుద్ది సత్కర్మకారులనే

యనుగ్రహింతునను భీష్మ స్వభావమును బోగొట్టినదనుటయు నను రెండు వస్తువులు వ్యంగ్యముల దోచుచుండుటచే నీ శ్లోకమున వస్తుధ్వని కలదు. ఒడలంతయు దెల్లగా నున్న శివుని కంఠమునందమ్మ వారి చూపు పడి కంఠమునందు నైల్యము కలిగించినదా? యనునూహను పుట్టించుటకు 'శివ' శబ్దమునకు బదులుగా నీలకంఠ శబ్దమును ప్రయోగించుట. ఈ ప్రయోగవము "అసంబంధ సంబంధాతిశయోక్త్యలంకారవము"నం వ్యంగ్యమొనర్చుచున్నది. కావున నిందతిశయోక్త్య లంకారధ్వని గలదు. కవికి భగవతి పట్లనున్న భక్తి భావమునకిది గుణీభూతమైనను, వాచ్యార్థమునకు గుణీభూతము కాకపోవుటచే నిది "ధ్వనియే"యగును.

12. గంగామ్భసి స్మితమాయే తపనాత్మజేవ
గంగాధరోరసి నవోత్పల మాలికేవ
వక్త్రప్రభాసరసి శైవల మండలీవ
కామాక్షి! రాజతి కటాక్ష రుచిచ్ఛటా తే

అ॥ కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, కటాక్షరుచిచ్ఛటా - కడగంటి చూపుల వెల్గుల ప్రసారము, స్మితమాయే - చిఱునవ్వనెడి, గంగాంభసి - గంగాజలమునందు, తపనాత్మజేవ - సూర్యపుత్రి (యైన యమునా నది) వలె, గంగాధరోరసి - గంగను ధరించు వాని (శివుని) ఱొమ్మున, నవోత్పలమాలికేవ - అప్పుడే పూచిన నల్లకలువల హారమువలె, వక్త్రప్రభాసరసి - ముఖకాంతియనెడి జలాశయము నందు, శైవల మండలీవ - నాచుగుంపువలె, రాజతి - ప్రకాశించుచున్నది.

తా॥ అమ్మవారి కటాక్ష రుచిచ్ఛట చిరునవ్వు అనెడి ఆ గంగ యందు యమున వలె, తెల్లనైన శివుని యురమున అప్పుడే పూచిన నల్లకల్వల మాల వలె ముఖ కాంతి సరస్సునందు నాచు వలె ప్రకాశించుచున్నది.

వి॥ అమ్మవారి కటాక్ష రుచిచ్ఛట ఎల్లప్పుడును ప్రకాశించుచుండును. శివుడెదురుగ నున్నపుడు మరింత ప్రకాశించును. అమ్మవారి ముఖమెప్పుడు చిఱునవ్వు చిందించు చుండును. ఆ చిరునవ్వు గంగ వలె స్వచ్ఛమైనది మఱియు తెల్లనైనది. ఆమె చిఱునవ్వామె కటాక్షము నందును దోబూచులాడు

చుండును. అందుచే చిఱునవ్వు గంగ కాగా దాని యందమ్మవారి కటాక్ష రుచిచ్ఛట యమున యైనది. చిఱునవ్వు తెలుపుచే గంగ యైనది. సరే! ఎదుట గంగాధరుడే యున్నాడు. ఆయన ఱొమ్మునందొక కటాక్ష కాంతిచ్ఛట అప్పుడే పూచిన నల్ల కల్వపూల మాల యైనది. అమ్మవారి ముఖ కాంతి యొక సరోవరము. దాని యందమ్మవారి కటాక్షకాంతి నాచైనది. ఇంతకు చిఱునవ్వు అమ్మవారిదేనా? కాదనుటకే మాధారమున్నది? ఆ చిరునవ్వు శివునిది కాకూడదా? దానిని చూచినపుడు అమ్మవారి కడగంటి చూపుల కాంతి యమునయైనది. ఇచ్చట వక్త్రప్రభాసరస్సెవ్వరిది? అమ్మవారిదా? శివునదా? ఎవరిదన్నను కాదనుటకు వీలులేదు. ఎవరిదైనను అగుగాక! అమ్మవారి కడగంటి కాంతి నాచువలె కన్పడుచునే యుండును. ఈ తెలుపు నలుపుల సమ్మేళనము (శివాశివుల సమ్మేళనము) గంగా-యమునా సంగమము వలె శోభాయమానముగా నున్నది. ఇచ్చట శివుడనుటకు బదులుగా గంగాధరుడనుట శివుని నెత్తిమీది గంగ ఈ చిఱునవ్వుముందఱ వెల-వెల పోవుటచేనది గంగాత్వము కోల్పోయినదేమో? అందుకే చిఱునవ్వునందు ఎక్కడో చూచిన గంగా సామ్యము చెప్పబడినదేమో? ఇంతకును కామాక్షీదేవి యెదుట నుండగా శివుడింకను గంగను నెత్తిపై పెట్టుకొనుటయా? అట్లు పెట్టుకొన్నచో నమ్మవారి కడగన్నుల కాంతి యమునగా మారుటకాదు! శోణనదముగా మారకుండునా? అందుకే శివుని నెత్తిపైని గంగ యందు అమ్మవారి కడగంటి కాంతి యమునయైనదని చెప్పక, చిఱునవ్వు నందు గంగాత్వమును 'మూకకవి' యారోపించినాడేమో? యనునూహలను పుట్టించుచున్నది. శ్రీ శంకరులమ్మవారి మూడుకన్నులను గంగా యమునా - శోణా సంగమముగా వర్ణింపగా మూకకవి యెదలోతులలోని సరస్వతి అమ్మవారి కటాక్షరుచిచ్ఛట యందు గంగా - యమునా సంగమ సౌభాగ్యమును దర్శింపజేసినది. మూకకవి యూహాప్రవాహములలో నెక్కువగా సుళ్ళుతిరుగునది అమ్మవారి కటాక్షమాలికయే! అదియే పై శ్లోకమున వర్ణింపబడినది. ఈ శ్లోకమున నవోత్పల మాలిక యొకటి శివుని తెల్లని యురమున నలంకరింపనూహ పుట్టినది. అమ్మవారి కటాక్షమాలా కాంతి పుంజముల పూల మాలయే నవోత్పల మాలికగా మూకకవి యూహా ప్రవాహమున గొట్టుకొని వచ్చినది. 'మాలికా' శబ్దము పై శ్లోకమునకు, నీశ్లోకమునకు సంగతిగా రూపొందినది. శివునియన్ని యవయవములు, సుందరములే కాని అమ్మవారే శివుని విశాల వక్షస్థలమును దనివిదీరక

యల్లుకొని పోయియున్నదని మందహాస గంగాభోవక్త్రప్రభాస సరస్సుల మధ్య "నవోత్పల మాలికేవ" యని మూకకవి ప్రయోగించుటచే వ్యంగ్యమగుచున్నది. వక్షస్థలము ప్రధాన శరీరరమున శిరస్సునకు క్రింద, ఉదరమునకు బైన ననగా రెంటి మధ్య నుండు నట్టిదే గదా! మందహాస గంగా వక్త్రప్రభా సరస్సులు రెండు జలస్వరూపములు. జలముల మధ్య ప్రకాశించునది "నవోత్పల మాలిక". అమ్మవారి కటాక్షకాంతి నవోత్పల మాలికయని మూకకవి వర్ణించుటలో నమ్మవారే స్వయముగా నవోత్పల మాలికయై శివుని వక్షస్థలమున విరాజిల్లుచున్నట్లు వ్యక్తమగుచున్నది. మందహాస గంగాంభోరహితముగా వక్త్రప్రభా సరస్సుండనే యుండదు. వాస్తవమునకు అమ్మవారి మందహాసము గంగయగుటకు అమ్మవారి వక్త్రము ప్రభాసరస్సు అగుటకు విశాల శివవక్షోదర్శనము హేతువనుటలో విప్రతిపత్తి యుండరాదు. ఈ శ్లోకమున కటాక్షరుచిచ్ఛటకు మూడుపమానములుండుటచే మాలోపమాలంకారము కలదు. మూడు పాదముల అంతమున "ఇవ" శబ్దముండుటచే నీ శ్లోకమున నంత్యప్రాసమను శబ్దాలంకారము గలదు. పై శ్లోకమున వక్త్ర ప్రభాసరస్సు ప్రస్తావింపబడినది. సరస్సులోనికి నీరు వచ్చుట దాని వెనుక నున్న పొలములు పండుట మేఘాధీనములు కావున నీ శ్లోకమున నమ్మవారి కటాక్షము మేఘముగా రూపింపబడుచున్నది.

13. సంస్కారతః కిమపి కన్దలితా న్రసజ్ఞ(జ్ఞా)
కేదా రసీమ్ని సుధియా ముపభోగయోగ్యాన్
కల్యాణ సూక్తిలహరీ కలమాంకురా న్నః
కామాక్షి! కన్దలయతు త్వదపాంగమేఘః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవి!, త్వదపాంగమేఘః - నీ కడకన్నునెడి మేఘము,రసజ్ఞ కేదారసీమ్ని - సహృదయులనెడి పొలముల ప్రదేశములందు, రసజ్ఞాకేదారసీమ్ని - నాలుకయను పొలము నందు, సంస్కారతః - భావన వలన, కిమపి - విచిత్రముగా, కన్దలితాన్ - మొలకెత్తిన, సుధియామ్ - విద్వాంసుల యొక్క, ఉపభోగయోగ్యాన్ - అనుభవమునకు దగిన, కల్యాణ సూక్తిలహరీకలమాంకురాన్ - మంగళ సుభాషిత ప్రవాహములనెడి వరిమొలకలను, కదలయతు - మొలపించుగాక.

తా॥ అమ్మా! సంస్కారము వలన రసజ్ఞకేదారముల యందు మొలకెత్తిన విద్వదుపభోగ్యములైన మా వాక్కులనెడి వరి మొలకలను నీ కడగంటి చూపనెడి మేఘము మొలకెత్తించు గాక! లేక, అమ్మా! నా నాలుకయనెడి పొలము నందు సంస్కారము వలన మొలకెత్తిన విద్వదుపభోగ్యములైన శోభ వాక్కలమాంకురము లనే కటాక్షమేఘము మరల మొలకెత్తించు గాక!

వి॥ రసజ్ఞులు పొలము వంటి వారు. కవుల శోభన వాక్కలమాంకురములు వానిలో పండవలెను. ఆ పొలములు దేవ మాతృకములు. కావున కటాక్షము మేఘముగా రూపొంది వానిని పండింపవలెనని కవి ప్రార్థన ప్రార్థనా కాలమందే నెరవేరినది. లేనిచో పొలము లెక్కడనైన రసజ్ఞములై యుండునా? ఇక్కడ కవియే రసజ్ఞకేదారమైనాడు. కవి సహృదయాఖ్య సరస్వతీ తత్త్వద్వయ మిందు సమైక్యమొందినది. ఇది యన్వర్థసుధీ భోగ్యమీచమత్కారము. పొలమందు నిండిన పంట జూచి రైతు హృదయమున బొందునట్టి యానందము లౌకికము. ఇచట నలౌకిక బ్రహ్మానందము కవి సహృదయ ద్వయైక్య రూపాద్వయ స్థితినందినది. చదువది యెంత గల్గిన రసజ్ఞత యుంచుక చాలకున్న నా చదువు నిరర్థకమ్ము రసజ్ఞతవేరు పాండిత్యము వేరు. పాండిత్యము కొంత తక్కువయైనను రసజ్ఞత పుష్కలముగా నున్నచో కవి శోభనవాక్కులలోని రసము ననుభవింపగలరు. రసజ్ఞత తోబాటు మంచి బుద్ధి అనగా సదసద్విమర్శనాబుద్ధియున్న పండితులు దానిని చక్కగా విమర్శింపగలరు. అప్పుడు కవి యొక్క హృదయరహస్యము రసజ్ఞుల హృదయములందు ప్రతి బింబించి రసఫలోదయమై యద్వితీయ బ్రహ్మానందము సాక్షాత్కరింప సంసారదుఃఖము సమూలముగా నశించి కృతకృత్యత ధన్యత యేర్పడును. ఈ శాఖా చంక్రమణ మంతయు రసజ్ఞకేదార సీమ్ని అను ముద్రిత పాఠముననుసరించి చేయబడినది. వాస్తవమునకు ఇచట రసజ్ఞాకేదార సీమ్ని అను పాఠము సరియైనదని నాయుద్దేశ్యము. అప్పుడు నా నాలుకయను పొలమునందు సుధ్యుపభోగ్యములైన వాక్కల మాంకురములు మొలకెత్తుగాకయను భావమ క్లేశముగా హృదయంగమముగా స్ఫురించును. అప్పుడు శాఖా చంక్రమణ మంతయు ననావశ్యకమేయగును. ఈ శ్లోకమున సావయవ రూపకాలంకారము కలదు. త్వదపాంగ మేఘః అను సమాసపదముండుటే సమస్త రూపకము.

అ.వ|| పై శ్లోకమున కటాక్షము మేఘముగా రూపించబడినది. మేఘము సజలమైనట్లు కటాక్షము సకరుణమని ఈ శ్లోకమున జెప్పబడు చున్నది.

14. చాంచల్యమేవ నియతం కలయన్ ప్రకృత్యా
మాలిన్య భూశ్శ్రుతి పథాక్రమ జాగరూకః
కైవల్యమేవ కిము కల్పయతే నతానాం
కామాక్షి! చిత్రమపి తే కరుణా కటాక్షః

అ|| కామాక్షి ! - ఓ కామాక్షీదేవీ!, ప్రకృత్యాః - సహజముగా, నియతం - విడువకుండ, చాంచల్యమేవ - చపలత్వమునే, కలయన్ - ధరించు నట్టి, మాలిన్యభూః - మాలిన్యమునకు (కాటుకకు) ఆధారమై, శ్రుతి పథాక్రమజాగరూకః - చెవి మార్గముకు చేరు (వేదమార్గము)యొక్క దాటుట యందు మెలకువ గలిగియున్నట్టి, తే - నీయొక్క, కరుణా కటాక్షః - దయగల చూపు, నతానాం - నమస్కరించు వారికి, కైవల్యమేవ - కైవల్యమునే (ఈశ్వరునితో నైక్యమునే), చిత్రమపి - విచిత్రముగా, కల్పయతే కిము - కల్పించుచున్నదా!

తా|| కామాక్షీదేవి దయగలచూపు చాంచల్యమును విడువదు. కాటుకను (మాలిన్యమును) ధరించును. చెవిచేరు మార్గమును (వేదమార్గమును) అతి క్రమించినది. ఐనను నమస్కరించు వారికి జీవేశ్వరైక్య రూపకైవల్యమునే ఇచ్చుట వింతచిత్రము.

వి|| కన్నులు రెండైనను చూపు మాత్రమొకటే. వ్యావహారికముగా జీవేశ్వరులు వేరుగా నున్నట్లున్నను పారమార్థికముగా వారిరువురొక యాత్మయే కాని వేరుగా లేరు. ఇది కటాక్షమునందలి కైవల్యము. కేవలాత్మానుభూతిని బొందిన జీవన్ముక్తుడే గురువై తనకు నమస్కరించి శరణుజొచ్చిన శిష్యులకు గూడ ఆ కేవలాత్మానుభూతినే కలిగింపగలడు. కటాక్షమునందు నీతులందు, గురుశిష్య వ్యవహారము స్ఫురించుటచే నిందు సమాసోక్త్యలంకారము కలదు. స్వయంతీర్థః పరాంస్తారయతి అనులోకోక్తి ఈ శ్లోకమున వ్యంగ్యము. కైవల్యము లభింప వలెనన్న మొదటి శ్రుత్యుక్తమైన కర్మానాచరించి చిత్తమున మాలిన్యరాహిత్యమును (శుద్ధిని) సంపాదించి ఉపాసనచేసి చిత్తము యొక్క

చాంచల్యము తొలగించుకొనవలెను. కన్నులకు చాంచల్యమాలిన్యములు నశించలేదు, తగ్గను కూడ లేదు. పైగానవి శ్రుతిమార్గాతిక్రణమును చేసియున్నవి. అయ్యును అవి చూపునకైవల్యము నందియున్నవి. అమ్మవారి కన్నులకు శ్రుతి మార్గాతి క్రమణములేకున్నను శ్లేషతో శ్రుతి మార్గాతిక్రమణము నాపాదించుటచే నసంబంధ సంబంధాతిశయోక్తి యిట వ్యంగ్యము. కన్నుల దైర్ఘ్యాతిశయము వ్యక్తము చేయు నతిశయోక్త్యలంకారము గూడ నిందుభావ్యము గానేయున్నది. శ్రుతి మార్గాతిక్రమణ మాలిన్య చాంచల్యములు కలవారికి కైవల్యము లభించుట విరుద్ధము. ఈ విరోధము శ్లేషచే పరిహరింపబడి విరోధమాభాస రూపమగుటచే నిందు విరోధాభాసాలంకారము కలదు.

అవ॥ "పై శ్లోకమున అమ్మవారికన్నుల యొక్క అలౌకిక కైవల్యాదానసామర్థ్యము ప్రతిపాదింపబడినది. ఈ శ్లోకమున ఐహలౌకిక ఫలప్రదానసామర్థ్యము వర్ణింపబడుచున్నది.

15. సంజీవనేజనని చూతశిలీముఖస్య
సమ్మోహనే శశికిశోరక శేఖరస్య
సంస్తమ్భనే చ మమతాగ్రహచేష్టితస్య
కామాక్షి! వీక్షణ కలా పరమౌషధం తే

అ॥ జనని - తల్లీ, కామాక్షి ! - ఓ కామాక్షీదేవీ!, తే - నీయొక్క, వీక్షణకలా చూపులోని పదారవ భాగము, చూతశిలీముఖస్య - మామిడిపూవు బాణముగాగల మన్మథుని యొక్క, సంజీవనే - బ్రదికించుట యందు, శశికిశోరక శేఖరస్య - బాలచంద్రుడు శిరోభూషణముగాగల శివునియొక్క, సమ్మోహనే - మోహింపజేయుటయందు, మమతాగ్రహా చేష్టితస్య - మమకారమనెడి దయ్యము యొక్క చేష్టితమును, సంస్తంభవేచ - స్తంభింప జేయుట యందును, పరమౌషధమ్ - గొప్పమందు.

తా॥ అమ్మా! కామాక్షీదేవీ! నీదృష్టిపాతము లేశమైనను మన్మథుని సంజీవింప జేయును. శివుని సమ్మోహింప జేయును. మమతాగ్రహాము యొక్క వికృత చేష్టలను స్తంభింప జేయును.

వి|| కొన్ని ఔషధములు సంజీవనములుగా పేరొంది యున్నవి. కాని అవి సమ్మోహనములు కాజాలవు. సంస్తమ్భకములును కాజాలవు. సమ్మోహనమునకో సంస్తమ్భనమునకో పనికి వచ్చు ఔషధములు సంజీవనములు కాజాలవు. కాని అమ్మవారి చూపు సంజీవనౌషధము, సమ్మోహనౌషధము, సంస్తభనౌషధము. ఔషధము వ్యక్తి భేదమున గూడ భిన్నరోగముల మాన్పును. చచ్చిన మన్మథునికది సంజీవనము, మోహమెరుగని శివునకు సమ్మోహనము. వికృత చేష్టగల మమతాగ్రహమునకు సంస్తమ్భనము. అమ్మవారి కటాక్షౌషధమొక్కటియే ముగ్గురికి మూడు విధములనుపయోగపడు నౌషధముగా అమ్మవారి కటాక్షము రూపింపబడుటచేనిది వ్యస్తరూపకము. మన్మథుడు పంచబాణుడు. ఆయన యైదు బాణములు:- అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము. చూతశిలీముఖస్య అని మన్మథుని పేర్కొనుట ఆయన పంచ బాణత్వోపలక్షకము. పంచ బాణుడు శివుని ఫాలాగ్నిలో పంచత్వము నొందినాడు. అమ్మవారి కరుణాకటాక్ష మొకింత సోకెనో లేదో వాడు మరల బ్రతికినాడు. ఈ యర్థమును చెప్పు నీ శ్లోకములోని ప్రథమ పాదము హరనేత్రాగ్ని సందగ్ధకామ సంజీవనౌషధిః అను శ్రీలలితా సహస్ర నామ స్తోత్రములోని నామము యొక్క అర్థమునే చెప్పును. అచట అమ్మవారు కామునిబ్రదికించునౌషధము. ఇచట నమ్మవారి చూపు చూపుకాదు, చూపులోని అత్యల్పభాగము. శుక్లపక్షములోని మొదటి ఐదు రాత్రులలోని బాల చంద్రుడు రెండవయైదు రాత్రులలోని చంద్రుడు అర్ధచంద్రుడు, చివరియైదు రాత్రులలోని చంద్రుడు పూర్ణచంద్రుడు. ఈ చంద్రుని బాలత్వ అర్థత్వ పూర్ణత్వములు కృష్ణపక్షములో విపరీతములగును. కృషపక్షములోని చివరియైదు రాత్రులలో శుక్లపక్షములోని మొదటి యైదు రాత్రులలోను శశికిశోరుడు కుహూ అను అమావాస్యనాడు గర్భస్థశిశువువలె శశికనిపించడు. సినీ అను అమావాస్య శీర్షోదయమైన శిశువువలె కన్పించును. కన్పించినను కన్పించకున్నను అది అమాకళ. సాధారణ భక్తులలోని ఈశ్వరాస్తిత్వము వలెనది దృష్టాదృష్టము. శశికిశోర అనక శశికిశోరక అనుటచేత నీ సాదాపరపర్యాయమైన యమాకళ శివుడు ధరించు చంద్రకల యని వ్యంగ్యముగుచున్నది. శివజటాజూటము రాత్రి యందలి యాకాశము. అందొకప్పుడు చంద్రుడు కనిపించియు కనిపించనట్లుండును. ఒకప్పుడర్థమే కనిపించును. కొన్ని యేండ్ల వఱకే తండ్రి బిడ్డను నెత్తికెక్కించుకొనును. శివుడును చంద్రుని యర్ధభాగము

పెఱుగు వఱకే నెత్తికెక్కించు కొనును. ఆతర్వాతి పూర్ణచంద్రునాతడు శిరమున ధరింపడు కాని శిరోభూషణమైన చంద్రుడు పూర్ణత నందినప్పుడు వానిని తన సహస్రారమునుగా రూపొందించుకొనును.

16. కామద్రుహో హృదయ యన్త్రణ జాగరూకా
కామాక్షి! చంచలదృగంచల మేఖలా తే
ఆశ్చర్యమమ్బ భజతాం ఝటితి స్వకీయ
సంపర్క ఏవ విధునోతి సమస్త బన్ధాన్

అ||కామాక్షి ! - ఓ కామాక్షీదేవీ!, అంబ - అమ్మా!, కామద్రుహః - శివుని యొక్క, హృదయ యన్త్రణ జాగరూకా - మనస్సు యొక్క బంధనమునందు మెలకువ గలిగినది. తే - నీ యొక్క, చంచలదృగంచలమేఖలా - కదలు కడగంటి చూపుల వలయము, స్వకీయసంపర్క ఏవ - తన సంబంధమే, ఝటితి - వెంటనే, భజతాం - భజించువారి యొక్క, సమస్త బన్ధాన్ - అన్ని బంధములను, విధునోతి - తొలగించును, ఆశ్చర్యమ్ - వింతకదా!

తా|| అమ్మా! ఓ కామాక్షీదేవీ! చంచలములైనను నీ చూపులు శివుని హృదయమును బంధించి వేయుటకు సమర్థములు కాని భక్తుల బంధనములన్నింటిని సంబంధ మాత్రము చేతనే ఛేదించి వేయ గలవనుట ఎంత విచిత్రము!

వి|| అమ్మవారి చూపులు చంచలములు. శివుని మనస్సు స్థిరము. స్థిరమైన త్రాటితో చంచలములైన పశ్వాదులను బంధించ వచ్చును. కాని చంచలము లైన అమ్మవారి చూపులే అన్యత్ర (ఆత్మావలోకమునందు) స్థిరమైన శివుని మనస్సును దాని నుండి మరల్చి తమపై స్థిరముగా నుండునట్లు చేయుటలో మెలకువ గలిగియున్నవి. అస్థిరములు స్థిరమును బంధించుట లోక విరుద్ధము మరొక విషయము బంధించునది విడిపింపజాలదు. త్రాడెక్కడైన ఎవరినైనా విడిపించునా? కాని అమ్మవారి చూపుల వలయము శివుని బంధించునదే యైనను భక్తుల సమస్త బంధముల దొలగించగలదు. ఇది మరింత లోకవిరుద్ధము. త్రాటి యొక్క స్పర్శ దేనిని ఎవనిని విడిపింప జాలదు.

పైగా త్రాటి యొక్క సంబంధము లేకపోవుటయే బంధవిముక్తి. అట్లుండ అమ్మవారి చూపుల త్రాడు తన సంబంధముచేతనే అనగా చూపుల స్పర్శ చేతనే భక్తుల బంధములను హరించి వేయుచున్నది. ఇది మరియు విరుద్ధము. కావున నీ శ్లోకమున మూడు విరోధాభాసాలంకారముల సమ్మేళనమున్నది. ఇవి అమ్మవారి మహిమాతిశయమును వ్యంజింప జేయుచున్నవి.

అవ|| విరోధాభాసాలంకారమునే ఈ శ్లోకమునను నిబంధించుచున్నాడు.

17. నీలోఽపి రాగమధికం జనయన్పురారే
ర్లోలోఽపి భక్తి మధికాం ద్రఢయ న్నరాణామ్
వక్రోఽపి దేవి నమతాం సమతాం వితన్వన్
కామాక్షి! నృత్యతు మయి త్వదపాంగ పాతః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, నీలో + అపి - నల్లనిదైనను, పురారేః - శివునకు, అధికమ్ - ఎక్కువయిన, రాగమ్ - రక్తిని, జనయన్ - కలిగించుచు, లోలో + అపి - చంచలమయినను, నరాణామ్ - మనుష్యులకు, అధికామ్ - ఎక్కువయిన, భక్తిం - భక్తిని, ద్రఢయన్ - గట్టిపఱచుచు, వక్రో + అపి - వంకఱయైనను, నమతాం - నమస్కరించువారిలో, సమతాం - సమభావమును, వితన్వన్ - విస్తరింపజేయుచు, త్వదపాంగ పాతః - నీ క్రీగంటి ప్రసారము, మయి - నాయందు, నృత్యతు - నర్తించుగాక.

తా|| అమ్మా! నీ క్రీగంటి ప్రసారము నల్లనిదయ్యును శివునకు రాగమును (ఎఱ్ఱదనమును) కలిగించు చున్నది. అది చంచలమయ్యును మనుష్యులలో నధికముగా భక్తిని దృఢీకరింప జేయుచున్నది. మరియునది వంకఱయైనను నమస్కరించు వారలలో సమభావమును విస్తరింపజేయుచున్నది. అది నా యందు రాగమును కలిగించి భక్తిని దృఢమొనరించి సమభావమును విస్తరింప జేయుగాక!

వి|| నీలవస్తువు నైల్యమునే వెదజల్లుట సహజము. కాని అమ్మ వారి

నీలమైన క్రీగంటి ప్రసారము శివునిలో రాగమును కలిగించుట యొక విరోధము. చాంచల్యము నాపక పోయిన చాంచల్యమునే నిరంతరము కలిగి యుండుట వైజ్ఞానిక సమ్మత సిద్ధాంతము. కాని అమ్మవారి క్రీగంటి ప్రసారము భక్తిని అనగా తైలధారవలె నవిచ్ఛిన్నమైన భగవత్స్వరూపజ్ఞానధారను అనగా భగవత్స్వరూపమునందు చిత్తము యొక్క అచంచలమైన ఏకాగ్రతను భక్తులలో దృఢీకరింపజేయు చున్నది. మనస్సులో విషయములు మారిపోవుట దానినిబట్టి మనస్సు యొక్క వృత్తులు మారిపోవుట మనస్సు యొక్క చాంచల్య మనబడును. భక్తుల మనస్సున భగవంతుడను విషయము మారక పోవుటచే వారి చిత్తమే కాగ్రమని చెప్పబడును. ఆ ఏకాగ్రత ఎక్కువ మరింత యెక్కువ కాలముండుటయే భక్తి యొక్క దృఢీకరణము. భగవద్రామానుజ సిద్ధాంతమున భక్తి శేముషీరూపమనగా జ్ఞానధారాస్వరూపము. భగవత్స్వరూప ధ్యానము భక్తియని వారి సిద్ధాంతము వలన తెలియును. శ్రీ శంకరులు సైతము స్వస్వరూపానుసంధానమే భక్తియని చెప్పినారు. అనగా స్వస్వరూప ధ్యానమన్నమాట. శంకరుల సిద్ధాంతమున భగవంతుడు స్వాభిన్నుడు. కావున స్వస్వరూపాను సంధానము అన్నను భగవత్స్వరూప ధ్యానమన్నను ఒక్కటియే యగును. ఉభయుల మతము నందును భక్తి ఉపాసనా రూపమే. సరే ఆలంకారిక దృష్టిలో చంచలమైన అమ్మవారి క్రీగంటి ప్రసారము చిత్తమునందు భక్తి రూపస్థైర్యమును కలిగించుట మరియొక విరోధము. వక్రత సమత్వము పరస్పర విరుద్ధములు. కాని అమ్మవారి క్రీగంటి ప్రసారము నందలి వక్రత నమస్కరించు వారిలో సమత్వమును విస్తరింప జేయును. ఇది మరి యొక విరోధము. మూడు విరోధములీ శ్లోకమున నిబంధింపబడి యున్నవి. మొదటి పాదమున రాగశబ్దము నందలి శ్లేషచే విరోధ మాభాసమయి పోవును. రెండవ, మూడవ పాదములలో అమ్మవారి అపాంగపాతము యొక్క మహిమాతిశయము వలన విరోధమాభాస మాత్రమయిపోవును. మూడు పాదములందును గల అపి శబ్దము విరోధమును స్ఫురింపజేయును. ఆ విరోధము నిలువక పోవుటచే రజ్జువునందు సర్పము వలె నాభాస మాత్రమయి పోవును. ఇట్లు విరోధ మాభాస మాత్రమే యై విరోదములపహరింప బడుటయే విరోధాభాసాలంకారమనబడును. ఇట్టి

అలంకారములు మూడు ఈ శ్లోకమున నొప్పుటచే ఈ శ్లోకమున పై శ్లోకము నందు వలెనే మూడు విరోధాభాసాలంకారముల సమ్మేళనము కలదు. నీలలోల జనయన్ ద్రఢయన్ అని మొదటి రెండు పాదముల నుండుటచే ఆద్యనుప్రాసము మధ్యాను ప్రాసము అను శబ్దాలంకారములు ఈ శ్లోకమున కలవు.

18. కుంఠీకరోతు విపదమ్మమ కుంచిత భ్రూ
చాపాంచితః శ్రితవిదేహ భవానురాగః
రక్షోపకార మనిశం జనయన్ జగత్యాం
కామాక్షి! రామ ఇవతే కరుణాకటాక్షః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీదేవీ!, కుంచిత భ్రూః చాపాంచితః - వంచిన కనుబొమలు అనెడి వింటితో కూడిన, శ్రితవిదేహ భవానురాగః - పొందిన దేహ భవానురాగ రాహిత్యముకలది (విదేహరాజపుత్రి యగు సీత యందలి యనురాగము గల), జగత్యాం - భూమియందు, అనిశం - ఎల్లప్పుడు, రక్షోపకారం - రక్షించుటయను, తే - నీ యొక్క, కరుణా కటాక్షః - దయగల చూపు, రామ ఇవ - రామునివలె, మమ - నా యొక్క, విపదం - ఆపదను, కుంఠీకరోతు - నశింపజేయుగాక.

తా|| అమ్మా! కామాక్షీ దేవీ! నీ కరుణా కటాక్షము రాముడే. రాముడు వంచిన ధనువు గలవాడు. నీకటాక్షము వంచిన కనుబొమలుకలది. కటాక్షము సంసారులలో దేహానుభవానురాగ రాహిత్యమును కలిగించునది. రాముడు విదేహరాజ పుత్రిక యందు ప్రేమను పొందినవాడు. కటాక్షము జగమునను రక్షించుట యనునుపకారమొనరించునది. రాముడు జగద్రక్షణోపకారమొనర్చిన వాడు. ఈ విధముగ శ్రీరామ స్వరూపమైన నీ కటాక్షము నా ఆపదను నశింపజేయుగాక!

వి|| ఆపదామ పహర్తారమ్ అని రామా యాపన్నివారిణే అని భక్తులాపద నివారణము కొఱకు శ్రీరాముని నుతించు చుందురు. శ్రీ రాముడు వైకుంఠవాసియైన శ్రీమహావిష్ణువుయొక్క యవతారమే. ఆతనికి వికుంఠుడు వైకుంఠుడు అను పేర్లు కూడ కలవు. ఆయన లోకమెవరిచేతను నశింపజేయ బడదు. కావుననది వైకుంఠము. ఆయన నెవరు నశింపజేయ జాలరు.

గావున నాశమే లేనివాడు గావునను ఆయన వికుంఠుడు లేక వైకుంఠుడు. ఆయన మాత్రము దుష్టుల పరాక్రమమును దురాక్రమణలను కుంఠీకరింప జేయును. రామావతారమున నీలక్షణము మరింత యధికము. కావున ఆపన్నివారణమునకు శ్రీరాము నాశ్రయించెదరు. మూక కవియు శ్రీరాముని యీ లక్షణము నమ్మవారి చూపుల యందున్నదని నిరూపింప గోరినాడు. శ్రీరామునికా శక్తి అమ్మవారి యుపాసన వలన కలిగినదే. శ్రీరామునకీశక్తి అమ్మవారి దయగల చూపునకు బాత్రుడైన పిమ్మటనే లభించినది. చూపు అమ్మవారిలో నొక అవయవము. శ్రీరాముడమ్మవారిలో నొకభాగము. *అంగాన్యన్యాదేవతా* అని శ్రుతి. కామాక్షి దేహచ్ఛాయ శ్యామలము. కటాక్షము కూడ శ్యామలము. కావుననే కొందఱు *శ్రీరామః శ్యామలాదేవీ* - అని శ్రీరామ శ్యామలాదేవ్యభేదమును భావించెదరు. ఇంత ముఖ్య దైవమైన శ్రీరాముడు కూడ అమ్మ చూపు చివఱ నొదిగి మూకకవికి సాక్షాత్కరించినాడు. అందుకే కటాక్షము రాముని వలె నున్నదని శ్రీరామునితో కటాక్షమనుపమించినాడు. ఉపమానము ఉపమేయమున కన్న గుణాధిక్యము కలదై యుండును. ఈ సూత్రము భగవద్వర్ణమునకు వర్తించదు. భగవంతుని కన్న నధికమైన దేదియు సృష్టి యందుండదు గదా! సాధారణ నాయికానాయకుల వర్ణనము నందును ప్రతీపాలంకార వ్యాజమున నుపమానమును నిందించుట ద్వారా కవులు వారి నతిశయింప జేయు చుండగా భగవద్వస్తువు తాకి ఉపమానద్రవ్యమున కన్న శ్రేష్ఠమనుటలో విచిత్రమేమి? శ్రిత విదేహ భవాను రాగః అను కటాక్ష విశేషణము గమనింపదగినది. అమ్మవారు దలచు కొన్నచో దేహాభిమానమును విసర్జించిన జ్ఞానులను కూడ బలాత్కారముగా లాగి మోహ రాక్షసునకప్పగించి పతితులగావించున *జ్ఞానినామపి చేతాంసి మాయా భగవతీ హిసా బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి.* అని చండీ సప్తశతీ వాక్యము. విదేహులకు సైతము భవమునందు అనగా సంసారము నందాసక్తి కలిగించగల దమ్మవారి కటాక్షము. కరుణా హీనమైన యెడల అది కరుణా సహితమైన దేహ భవానురాగ విహీనులనుగా, సంసారుల నొనర్చును. (లేక దేహ భవాను రాగమును విశిష్టమును గా జేయును). శ్రీరాముడు వంచిన ధనువు కలవాడు. అమ్మవారి కటాక్షము కుంచిత భ్రూయుగము కలది. కావుననే

కటాక్షమునకు శ్రీరాముడుపమానముగా జేయబడినాడు శ్రీరామునకు ధనువు ప్రతీకము. శ్రీకృష్ణునకు నెమలిఫింఛము. నెమలి పింఛమును చూచిన కృష్ణుడు తలపునకు వచ్చును. ధనుర్ధరులలో శ్రీరాముడగ్రేసరుడు. ధనువు శ్రీరామునకు ప్రతీకము. ధనువును చూచిన రాముడు తలపునకు వచ్చును. మూక కవికి దేవి యొక్క కుంచిత భ్రూయుగము దర్శించుటచే రాముడు తలపునకు వచ్చెను. అందుకే రామునితో కటాక్షమును పమించినాడు. ఇట వాచ్యమైన ఉపమాలంకారముచే స్మృత్యాలంకారము వ్యంగ్యమగుచున్నది. *రామో విగ్రహవాన్ ధర్మః* అను సూక్తి రాముడు శరీరముధరించిన ధర్మమని తెలియ జేయును. ధర్మమను శబ్దమునకు ధనువని కూడ నర్థముకలదు. కావుననే శ్రీరామునకు ప్రతీకము ధనువని చెప్పబడినది. శ్రీరాముడు రావణాది రాక్షసుల వధించి జగత్తునకు రక్షయను నుపకారము చేసినాడు. అమ్మవారి కటాక్షము రజస్తమో వృత్తుల నశింపజేసి భక్తకోటికి రక్షోపకారమొనర్చుచున్నది. శ్రీరాముడు సైతమమ్మ వారి కటాక్షము పడని వాని రక్షింపజాలడు. కరుణా కటాక్షము కల యమ్మవారిచే బ్రహ్మరుద్రులు జగత్సృష్టి ప్రలయ కర్మల యందు నియోగింపబడినారు. అమ్మవారి కంటికొన శ్రీ విష్ణ్వవతార భూత రామావతారము ధరించి జగత్తును రక్షించు చున్నదేమోయను నుత్ప్రేక్షాలంకారము వాచ్యమైన ఉపమాలంకారము చేత వ్యంగ్యమగుచున్నది. సృష్టి ప్రలయము లన్యోన్యాధీనములు. సృష్టి లేనిదే ప్రలయము లేదు. ప్రలయము లేనిదే సృష్టిలేదు. ఇక మిగిలినది రక్షణము. అది అమ్మవారి కటాక్షము యొక్క కృత్యము. అమ్మవారి కటాక్షము కామజనకము. కాదుకాదు కామకోటి జననము. కాముని ధనుర్బాణము లమ్మవారి ప్రసాదములే. అమ్మపుండ్రేక్షు పుష్పబాణహస్త. మన్మథుడునట్టివాడే. శ్రీరాముడును కోటి కందర్ప సుందరుడు. స్త్రీలకే కాదు పురుషులకు నాయనను (జూచినప్పుడు స్త్రీత్వభావనాభావితులై శ్రీరామునాలింగనము చేసికొన గోరుదురు. పుంసామ్మోహన రూపాయ గార అని కదా పెద్దలందురు. వాస్తవమునకు శ్రీరాముడమ్మవారి కటాక్షమే. కామమును కలిగించి సంసారిని జేయునామె కటాక్షమే కరుణతో కూడి సంసారుల ముక్తుల జేయగలదు. శ్రీరాముడు తారక మంత్ర స్వరూపుడు. కావుననే అమ్మవారి సంసార తారక కరుణా

కటాక్షమునకుపమానముగా జేయబడినాడు. విపత్కుంఠీ కరణము అనగా ఆపన్నివారణము. పురుషార్థము. సర్వ ప్రాణులాడన్నివారణము గోరుకొందురు. ఇతర వాంఛలు దోష యుక్తములైన కావచ్చును. ఆపన్నివారణవాంఛ మనివార్య వాంఛ కావున అది పురుషార్థము. వివేకులు జీవ బ్రహ్మైక్యానుభవ మహానందమునే గోరుకొందురు. తదితర పురుషార్థములు, తదితర సామాన్య వాంఛలు వారి దరికి చేరవు. వారికితర వాంఛా ఫలము లన్నియు దుఃఖ రూపములే కావున విషద్రూపములే. మూక మహాకవి వివేకి కావుననే విపత్కుంఠీ కరుణ రూప పరమ పురుషార్థమునే యీ శ్లోకమున కోరుకొనుచున్నాడు.

అవ|| శివుడు కాముని దేహమును కాల్చివేయగా వాడు విదేహుడైనాడు. అయినను వాడు చావలేదు. స్త్రీ పురుషులందరలో జనించు ననురాగమంతయు విదేహభవమే. విదేహుడైన పిమ్మట మన్మథుడు అమ్మవారి కటాక్షమునాశ్రయించినాడు. లోకబంధ హేతువైన యనురాగమును జన్మింపజేయు కాముడమ్మవారి కటాక్షము నాశ్రయించుటచే నమ్మవారికి కామాక్షియను పేరేర్పబడినది. ఈ శ్లోకమున శ్రీరాముని సౌందర్యములోని లేశము నాశ్రయించిన మన్మథుడను బీజము యొక్క పుట్టుక కమ్మవారి కటాక్షము కేదారమగుట చెప్పబడుచున్నది.

19. శ్రీ కామకోటి శివలోచన శోషితస్య
    శృంగారబీజ విభవ స్యపునః ప్రవాహే
    ప్రేమామ్భసార్ద్ర మచిరా త్ప్రచు రేణ శంకే
    కేదార మంబ తవ కేవల దృష్టిపాతమ్.

అ|| శ్రీకామకోటి - శ్రీకామకోటి పీఠ స్వరూపిణివైన యోకామాక్షీ దేవీ!, అంబ - అమ్మా, శివలోచన శోషితస్య - శివుని కంటిచేత నార్పివేయబడిన, శృంగార బీజ విభవస్య - స్త్రీ పురుష పరస్పర రతివాంఛా బీజసంపద్రూపుడైన మన్మథుని యొక్క, పునః - తిరిగి, ప్రవాహే - మొలకెత్తించుట యందు, ప్రచురేణ - అధికమైన, ప్రేమాంభసా - ప్రేమజలముచేత, అచిరాత్ - క్రొత్తగా, ఆర్ద్రమ్ - తడిసిన, తవ - నీ యొక్క, కేవలదృష్టి పాతమ్ - ఏకైక కటాక్ష ప్రసారమునే,

కేదారమ్ - పొలమునుగా, శంకే - భావించు చున్నాను.

తా|| శ్రీ కామకోటి పీఠాధిష్ఠాత్రివైన యో తల్లీ! శివుని కంటి వేడిచే నెండింపబడిన శృంగార బీజరాశి (మన్మథుడు) తిరిగి మొలకెత్తుటకు అత్యంత ప్రేమార్ద్రమైన నీ యేకైక దృష్టి పాతమే పొలమయినదని యెంచు చున్నాను.

వి|| కొత్త పంటలోని తాలులేని మంచి విత్తనముల నెండ బెట్టి బాగుగా నెండిన పిదప నీరు కట్టి పొలమున దిరిగి మొలకత్తించుట హాలికులెరిగిన విషయమే. మూకకవి కవితా హాలికుడు. ఆతనికి నీ విషయము తెలియును కావుననే శివుని కంటి మంటకు బాగుగా నారి పచ్చ దొలగి యెండిన శృంగార రసబీజమును తిరిగి మొలకెత్తించుటకు కావలసిన పొలమును గుర్తించినాడు. అది అమ్మవారి దృష్టి పాతము. అది ఇటీవల యత్యంత ప్రేమ మనెడి జలాధిక్యముచే బాగుగా తడిసి యున్నది. కావున ఆ బీజము యాశించిన విధముగా తిరిగి మొలకెత్తి స్త్రీ పురుష హృదయ ద్వంద్వమున ఫలించినది. ఈ సంసారమిట్లు సాగుటకు అమ్మవారి దృష్టి పాతమే హేతువు. ఆమె కన్నుమూసినచో సంసార బీజమయిన కామమే లేకపోవును. ఇక సంసార మెట్లుండును? అంతర్హితమై పోవును. ఆమె ఉన్మేషనిమిషోత్పన్న విపన్న భువనావళి కదా! ఈ శ్లోకమునందుత్ప్రేక్షా లంకారము కలదు. కామాక్షి యను సంబోధనము లేనిది ఈ శ్లోకము.

20. మాహాత్మ్య శేవధిరసౌ తవ దుర్విలంఘ్య
సంసార వింధ్యగిరి కుంఠన కేలి చుంచుః
ధైర్యాంబుధి మ్పశుపతే శ్చులుకీ కరోతి
కామాక్షి! వీక్షణ విజృంభణ కుంభజన్మా

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, మాహాత్మ్య శేవధిః - మహాత్మత్వమునకు నిధియైన, దుర్విలంఘ్య - దాటరాని, సంసార - సంసారమనెడి, వింధ్యగిరి - వింధ్య పర్వతము యొక్క, కుంఠ నకేలి - అణచి వేయుటయను నాట యందు, చుంచుః - సమర్థుడైన, తవ - నీ యొక్క, అసౌ - ఈ, వీక్షణ విజృంభణ కుంభ జన్మా - చూపు

యొక్క విజృంభణ మను, కుంభము నందు జన్మించిన యగస్త్యుడు, పశుపతేః - శివుని యొక్క, ధైర్యాంబుధిమ్ - ధైర్యసముద్రమును, చులుకీ కరోతి - పుడిసిలిగాజేయు చున్నాడు.

తా|| అమ్మా! కామాక్షీ! నీ వీక్షణ విజృంభణాగస్త్యుడు సంసారమనెడి వింధ్యగిరిని దాటి వచ్చి, శివుని ధైర్యమను సముద్రమును బుడిసిట బట్టుచున్నాడు.

వి|| మునులలో నగస్త్యుడు మహాముని. అతని మాహాత్మ్యమనన్య సామాన్యము. మేరు పర్వతముతో మాత్సర్యమును వహించి, సూర్యగతికవరోధము కలిగించిన వింధ్యపర్వత మగస్త్యుని జూడగనే మోకరిల్లెను. "నేను దక్షిణదేశమున కేగుచున్నాను. తిరిగి వచ్చు వరకు నీవిట్లే యుండుమని" వింధ్య పర్వతమును ఆజ్ఞాపించినాడు. అంతే, అగస్త్యుడు తిరిగి రాలేదు. వింధ్యుడు తలయెత్తలేదు. సూర్యగతికవరోధము గలుగలేదు. అగస్త్యుడు సముద్రమునంతయు పుడిసిట బట్టి యాచమించెను. ముమ్మారాచమింపవలెగదా! ఒకసారికే సముద్రజలమంత యైపోయినది. అమ్మవారు కన్ను దెరచుకొని మనను చూచుచో సంసార వింధ్యగిరి గర్వమణగి పోవును. ఆమె వీక్షణము శివుని ధైర్య సముద్రమునే పుడిసిట బట్టినది. అందుకే ఆ వీక్షణ మగస్త్యమునిగా రూపింపబడినది. కావున నీశ్లోకమున రూపకాలంకారము గలదు.

21. పీయూష వర్ష శిశిరా స్ఫుటదుత్పలశ్రీ
మైత్రీ నిసర్గ మధురా కృతతారకాప్తిః
కామాక్షి! సంశ్రితవతీ వపురష్టమూర్తే
ర్జ్యోత్స్నాయతే భగవతి త్వదపాంగమాలా

అ|| భగవతి! - షడ్గుణైశ్వర్య సంపన్నురాలా!, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, త్వదపాంగ మాలా - నీ కడగంటి చూపుల వరుస, పీయూష వర్ష శిశిరా - అమృతము యొక్క వర్షముచే చల్లనిదై, స్ఫుట దుత్పల శ్రీ మైత్రీ - వికసించు చున్న కలువల కాంతితో స్నేహము గలదై, నిసర్గమధురా - స్వభావముచే మధురమైనదై, కృతతారకాప్తిః - చేయబడిన కనుపాపల

పొందిక కలదై లేక నక్షత్రముల పొందిక కలదై, అష్టమూర్తేః - శివుని యొక్క, వపుః - శరీరమును, సంశ్రితవతీ - ఆశ్రయించినదై, జ్యోత్స్నాయతే - వెన్నెలవలె నాచరించు చున్నది.

తా|| అమ్మవారి కడగంటి చూపుల వరుస అమృతమును వర్షించుచు చల్లగా నుండును. వికసించుచున్న కలువల కాంతి కలిగి యుండును. సహజ మధురముగా నుండును. వెన్నెలయు పై లక్షణములు కలిగి యుండును. అమ్మవారి కడగంటి చూపుల వరుస కనుపాపలతో కూడి యుండును. వెన్నెల నక్షత్రములతో కూడి యుండును. రెండును తారకాప్తి కలవియే కావున అమ్మవారి కడగంటి చూపుల వరుస వెన్నెల వలె నాచరించు చున్నది.

వి|| ఈ శ్లోకమునందలి మొదటి మూడు విశేషణములు, ఐదవ విశేషణము అర్థశ్లేషము ననుసరించి వెన్నెల యందు అమ్మవారి కడగంటి చూపులతో నభేద ప్రధానసాదృశ్యము. నాల్గవ విశేషణము శబ్దశ్లేషము నాశ్రయించి సమాన ధర్మమును నారెంటికి చెప్పుట చేతనుపమాలంకార మేర్పడుచున్నది. చంద్రుడు సుధాకరుడు. అమృతకిరణుడు. దేవతలకమృత భాండము. కాని ఆతని కాంతియగు వెన్నెల అమృతమును అనగా మోక్షమును కలిగించును. చంద్రబింబము శివుని యష్టమూర్తులలో నొకటి. కావున వెన్నెల శివుని యష్టమూర్తుల నాశ్రయించి యుండును. అమ్మవారి చూపులును శివుని శరీరము నాశ్రయించి యుండును. వెన్నెలలో కలువలు వికసించుచుండుటచే నది వానితో స్నేహ మొనరించు నట్లు అమ్మవారి కడగంటి చూపులుత్పలముల స్నేహము జేయును. అనగా వానితో పోలి యుండును. శివుడష్టమూర్తి. పంచభూతములు సూర్య చంద్ర ద్వయము (మనోబుద్ధులు) యజ మానత్వము (అహంకారము)లు. అనునవి శివుని యష్టమూర్తులు. సూర్యుడు బుద్ధికి, చంద్రుడు మనస్సునకు బ్రతీకలు. బ్రహ్మాండ శరీరమున సూర్యచంద్ర యజమాన సహిత మహాభూతములు పిండాండ శరీరమున మనోబుద్ధ్యహంకార సహిత పంచ భూతములుండుటచే నా రెంటికి అష్టమూర్తి అను పేరేర్పడియున్నది. ఇట్లు జీవరూపమున పిండాండ శరీరము నష్టమూర్తి సహితమును, ఈశ్వరరూపమున బ్రహ్మాండ

శరీరమునష్టమూర్తి సహితమును గలవాడగుటచే శివుడష్టమూర్తి యనబడుచున్నాడు. అమ్మవారి కటాక్షమునకు పాత్రుడయినట్టి వారి సహస్రార చంద్ర మండలము నుండి జాలు వారిన యమృత వర్షముచే నాడీ మండలమంతయు నాప్లావితమై యుండుటచే వారు ఆనందమును జిలుకుచు ఇతరుల పరితాపమపహరించు చల్లదనము కలవారై యుందురు. పీయూష వర్ష శిశిరత్వమనగా నట్టిది. అమ్మవారి శిరమున చంద్రుడుండుటచే నామె శరీరమంతయు జల్లగా నుండి యితరుల పరితాపమును బోగొట్టు చల్లదనము కలిగి యుండును. ఇక ఆమె కన్నులు పీయూషమును వర్షించుటలో సందేహమేమి? అమ్మవారి కన్నులలో నొకటి చంద్రుడే కావున నది వెన్నెల వంటి చూపు కలదగుట సముచితము. పంచభూతములలో అగ్ని యున్నది. శివుని శరీరములో నది భాగము కావున ఫాలము నందది ధరింపబడినది కావునను శివుని శరీరము వేడెక్కియుండగా అమ్మవారి యపాంగమాల వెన్నెల వలె శివుని శరీరమును చల్ల బరచుచున్నది. అట్లే తాపత్రయముచే తపించి యున్న భక్తుల మనస్సునందాయపాంగమాల శీతలదయారసము వర్షించి చల్లబఱచగలదు. వాస్తవమునకు శివుని శరీరమున చంద్రుడున్నాడు. గావున ఆయన శరీరమును చల్లబఱచు వ్యాపారమున కంటె భక్తమానసమును తాపరహితముగా జేయు వెన్నెల వలె చల్లబఱచు వ్యాపారమే యవసరము. జీవునిలోని జీవత్వాగ్ని తాపము హరించి శివత్వమను వెన్నెలలో చల్లబఱచుట అవసరము అను భక్తుల యాశలను జ్యోత్స్నాయతే, అష్టమూర్తేఃయను పదములు వ్యంజింపజేయు చున్నవి.

22. అమ్బ! స్మరప్రతిభటస్య వపు ర్మనోజ్ఞ
మమ్భోజ కానన మివాంచిత కంటకాభమ్
భృంగీవ చుంబతి సదైవ సపక్షపాతా
కామాక్షి! కోమలరుచి స్త్వదపాంగమాలా

అ|| అంబ- అమ్మా, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, కోమల రుచిః - మృదుత యందభిలాషగల, సదా +ఏవ - ఎల్లప్పుడు, సపక్షపాతా - పక్షపాతముతో కూడిన, త్వదపాంగమాలా - నీ క్రీగంటి చూపుల

వరుస, అంచిత కంటకాభమ్ - పొందిన పులకాంకురముల కాంతిగల లేక పొందిన ముండ్లకాంతి గల, అమ్భోజకాననమ్ + ఇవ - కమల వనమును వలె, స్మరప్రతిభటస్య - మన్మథ విరోధి (శివుని) యొక్క, మనోజ్ఞమ్ - అందమైన, వపుః - శరీరమును, భృంగీ + ఇవ - ఆడు తుమ్మెద వలె, చుంబతి - స్పృశించు చున్నది.

తా|| అమ్మా! కామాక్షీ దేవీ! నీ కడగంటి చూపుల వరుస భక్తుల యందు బక్షపాతము కలది. దాని కాంతి కోమలమైనది. మృదువైన కమల వనము వంటి శివుని యందమైన శరీరము నాడుతుమ్మెద వలె నెడతెగక స్పృశించు చున్నది. ఆరోమాంచము కమల వనము నందలి కంటకముల (ముండ్ల) కాంతిగలదై యున్నది.

వి|| కమలము స్త్రీ ముఖముతో తుమ్మెదను పురుషులతో కవులు పోల్చుట సాధారణము. ఈ శ్లోకమున శివుని యవయవములన్నియు కమలములుగా పోల్చబడినవి. శివుని శరీరము కమలవనముగా పోల్చబడినది. అమ్మవారి అపాంగమాల ఆడుతుమ్మెదగా పోల్చబడినది. నాయకుడు ముద్దిడుకొన బోవునపుడు నాయికకు, నాయిక ముద్దిడుకొన బోవునపుడు నాయకునకు రోమాంచము కలుగును. ఈ శ్లోకమున నాయికయే నాయకుని చుంబించినదను వ్యవహారము స్ఫురించుటచే ఉపమాన ప్రాణిత సమాసోక్త్యలంకారము గలదు. అమ్మవారి యపాంగమాల స్వయముగా కోమలమైన కాంతి గలది. కావున రుచి కోమలమైన యంభోజము నందాసక్తి గలది కావునను కోమలరుచి కమలానన మందలి కంటకములా కోమలతకు భంజకములు కావు. కోమలతకు రక్షకములు. శివుడు స్మర ప్రతిభటుడైనను అమ్మవారి చూపులకు కోమలుడుగానే కన్పించుచున్నాడు. ఆతని రోమాంచము తననమ్మవారు చూడబోవుచున్నదను నానందముతో కలిగినట్టిదే. అపాంగములను భృంగములతో కవులు పోల్చుట సాధారణమే. కాని అపాంగమాలను భృంగితో పోల్చుట అసాధారణము. అపాంగమాలను భృంగమాలతో పోల్చవలెను. కాని అమ్మవారి అపాంగమాల శివుని శరీరములోని యవయవములన్నింటి నొకేసారి చుంబించు చున్నదనుటకు అపాంగమాల యని కవి ప్రయోగించినాడు. భృంగమాల అనక భృంగి యనుటలో జాత్యేక వచనమున్నదని గ్రహింపవలెను. దాని వలన శివుని ప్రత్యవయవమును

చుంబించునమ్మ వారి కటాక్షమాల శివునియవయవము లందలి రుద్రాక్షమాల యని వ్యంగ్య మగుచున్నది. మాలా శబ్దము నందలి యేకవచనము సమూహమొకటి కావున ఉపపన్నము. అపాంగముల కుపమానములు కాదగిన భృంగములనేకము లైనను తజ్జాతి యొకటే కావున భృంగీ యని యేకవచనమున బ్రయోగింపబడినది. భృంగీ శబ్దములోని స్త్రీ లింగము గూడ జాతిగతమేగాని భృంగగతము కాదు. సదైవ అను పదములలోని 'ఏవ'ను దూరము చేసి 'చుంబతి' అను పదమునకు కలిపిన 'చుంబతి ఏవ'-ముద్దాడు కొనుచునే యున్నదను చుంబన సాతత్యము స్ఫురించును. కమల వనము వంటి శివుని వపువును ముద్దాడు కొనకుండుట అపాంగ మాలక శక్యమును చుంబనేతర వ్యవచ్ఛేదమును స్ఫురించును. భృంగము పక్షములుగల కీటకము. కన్నులకు పక్షములు సహజములే. దేవతలకు కన్నులున్నను అవి పక్షపాతరహితములే కావలయును. శివుని యందు బక్షపాతముతో నాతనినే చూచుట పత్నికి తగిన పని కావచ్చును. కాని అంబకు తగిన పని కాదు. అంబ పుత్రుల కూడ చూచు కొన వలసి యున్నది. అని అంబయను సంబోధనము స్ఫురింపజేయు చున్నది.

23. కేశ ప్రభాపటల నీల వితాన జాలే
కామాక్షి! కుండల మణిచ్ఛవిదీపశోభే
శంకే కటాక్షరుచిరంగతలే కృపాఖ్యా
శైలూషికా నటతి శంకరవల్లభే తే

అ|| శంకరవల్లభే - శివునకు ప్రియురాలవైన, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, కేశప్రభాపటల - కేశ కాంతి సమూహమనెడి, నీల వితాన జాలే - నల్లని పందిరి గల, కుండల - కుండలములందలి , మణి - రత్నముల, ఛవి - కాంతి యనెడి, దీప - దీపము యొక్క, శోభే - కాంతి గల, తే - నీ యొక్క, కటాక్ష రుచి రంగ తలే - కటాక్షకాంతియనెడి రంగస్థలమున, కృపాఖ్యా - దయయగు పేరుగల, శైలూషికా - నట్టువరాలు (నటి), నటతి - నటించు చున్నట్లు, శంకే - అనుకొనుచున్నాను.

తా|| శివప్రియవైన యో కామాక్షీ! నీ కటాక్ష కాంతి యే యొకరంగ స్థలము. దానికి పైన కేశ ప్రభ పందిరిగా నుండగా కుండలమణులకాంతి

దాని యందు దీపముల వెలిగించినది. ఆ రంగస్థలమున నీ దయ యను నటి నటించు చున్నట్లున్నది. అనగా నీ కన్నులలో దయ దోబూచులాడుచున్నది.

వి|| అమ్మ వారి శిరమున నల్లని కనులున్నవి. దాని కాంతి నల్లని పందిరి. అమ్మవారి చెవులకు కుండలములున్నవి. వానిలోని మణులు దీపములు. కటాక్షకాంతియే రంగస్థలము. దయ యనునదే నటి. ఆమెనటించు చున్నట్లున్నది. ఇట్లీ శ్లోకమున సావయవమారూపకాలంకారమును, ప్రాణితోత్ప్రేక్షాలంకారము గలదు.

24. అత్యన్తశీతల మతన్ద్రయతు క్షణార్ధ
మస్తోక విభ్రమ మనంగ విలాసకన్దమ్
అల్పస్మితాదృత మపారకృపా ప్రవాహ
మక్షిప్రరోహ మచిరా న్మయి కామకోటి

అ|| కామకోటి - కామకోటి పీఠాధిష్ఠాత్రివైన యో దేవీ!, అత్యన్త శీతలమ్ - మిక్కిలి చల్లని, అస్తోకవిభ్రమమ్ - గొప్ప కదలికగల, అనంగ విలాస కన్దమ్ - మన్మథ విలాసములకు జన్మ భూమియైన, అల్పస్మితా దృతమ్ - చిఱునవ్వు నందాదరముగల, అపారకృపా ప్రవాహమ్ - ఒడ్లు కనబడకుండ ప్రవహించు కృపా ప్రవాహముకల, అక్షిప్రరోహమ్ - చూపును, మయి - నా యందు, అచిరాత్ - వెంటనే, క్షణార్ధమ్ - అరక్షణము, అతన్ద్రయతు - జాగృత మొనర్చుగాక.

తా|| మిక్కిలి చల్లని, వేగముగా కదలు, మన్మథ విలాసముల జన్మ భూమియైన, చిఱునవ్వు చిందించు, అపారముగా ప్రవహించు కృపగల నీ చూపును అరక్షణము నా యందు వెంటనే జాగృత మొనర్చుము తల్లీ!

వి|| అక్షి ప్రరోహ విశేషణములన్నియు నకారాదులై యుండుట అక్షి ప్రరోహమను విశేష్యము కూడ అకారాది యై యుండుట ఈ శ్లోకమున మిక్కిలి శోభావహముగా నున్నది. ఇది పదా ద్యనుప్రాసమను శబ్దాలంకారము.

25. మన్దాక్షరాగ తరలీకృతి పారతంత్ర్యా
త్కామాక్షి! మన్థరతరాం త్వదపాంగదోలామ్

ఆరుహ్యా మన్ద మతికౌతుక శాలి చక్షు
రానన్ద మేత ముహురర్ధ శశాంక మౌలేః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, మన్దాక్ష - సిగ్గుయొక్క, రాగ - ప్రేమ యొక్క, తరలీకృతి - చంచలీ కరణమనెడి, పారతంత్ర్యాత్ - పరాధీనత వలన, మన్దరతరాం - మిక్కిలి మెల్లిగా నూగు, త్వదపాంగదోలామ్ - నీ క్రీగన్నునెడి ఊయలను, మన్దమ్ - మెల్లిగా, ఆరుహ్యా - ఎక్కి, అతి కౌతుకశాలి - మిక్కిలి కుతూహలముతో నొప్పు, అర్ధశశాంక మౌలేః - చంద్రుని యర్థ భాగము శిరమునందుగల శివుని యొక్క, చక్షుః - కన్ను, ముహుః - మాటి మాటికి, ఆనందమ్ - ఆనందమును, ఏతి - పొందుచున్నది.

తా|| సిగ్గొకవైపు, ప్రేమ యొకవైపు లాగు చుండగా వివశమై కదలికతో వేగము తగ్గిన నీ యొక్క క్రీగన్నునెడి ఊయలను మెల్లిగా నెక్కి మిక్కిలి కుతూహలము కల శివుని యొక్క కన్ను ఆనందము నొందు చున్నది.

వి|| అమ్మవారి యొక్క శివుని యొక్క చూపుల కలయిక ఈ శ్లోకమున వర్ణింపబడినది. సిగ్గు ప్రేమయను భావముల శబలత యందు భక్తి భావము గుణీభావ మొంద ఊర్జస్వియలంకార మొప్పు చున్నదీ శ్లోకమున. అమ్మ వారి కటాక్షమిందు దోలగా రూపింపబడుటచే రూపకాలంకారము కలదు.

26. త్రైయంబకం త్రిపుర సున్దరి హర్మ్య భూమి
రంగం విహార సరసీ కరుణా ప్రవాహః
దాసశ్చ వాసవ ముఖాః పరిపాలనీయం
కామాక్షి విశ్వమపి వీక్షణ భూ భృత స్తే

అ|| త్రిపుర సున్దరి! - మూడు పురములలో సున్దరివైన, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క వీక్షణ భూ భృతః - చూపనెడి రాజునకు, త్రైయంబకం - శివునకు సంబంధించిన, అంగం - శరీరం, హర్మ్యభూమిః - నివాసస్థానము. కరుణాప్రవాహః - దయాప్రవాహమే, విహార సరసీ - విహరించు సరస్సు, వాసవముఖాః - ఇంద్రాదులు, దాసాః - సేవకులు, విశ్వమ్ - ప్రపంచమే, పరిపాలనీయమ్ - పరిపాలింపదగినది.

తా|| అమ్మవారి కటాక్షమే రాజు. రాజునకొక మేడయుండవలెను గదా! ఈ కటాక్ష రాజునకు శివుని శరీరమే మేడ. ఆతనికొక విహార సరస్సుండవలె గదా! ఈ కటాక్ష రాజునకు కరుణా ప్రవాహమే విహార సరస్సు. ఆతనికి సేవకులుండవలె గదా! ఈ కటాక్ష రాజునకు ఇంద్రాదులే సేవకులు. ఆతనికొక పరిపాలనీయముండవలెగదా! ఈ కటాక్ష రాజునకు విశ్వమే పరిపాలనీయము.

వి|| అమ్మవారీ శ్లోకమున త్రిపుర సుందరిగా సంబోధింప బడినది. త్రిపురములనగా స్థూల, సూక్ష్మ కారణ శరీరములు. వానిలోనివసించుచు వానినంటక యుండుటచే నామెయే త్రిపుర సుందరి. త్రిపురములనగా స్థూల సూక్ష్మ, కారణ శరీరములు. వానిపై దయ గలిగి రక్షించు నీశ్వరియే త్రిపుర సుందరి. త్రిపురములు వ్యష్టి, సమష్టి రూపమున ద్వివిధములు. స్థూలము నందభిమానము గల వ్యష్టి (జీవుడు) విశ్వుడు. సూక్ష్మము నందభిమానము గల జీవుడు తైజసుడు. కారణము నందభిమానము గల జీవుడు ప్రాజ్ఞుడు. స్థూలము నందభిమానము గల ఈశ్వరుడు వైశ్వానరుడు. సూక్ష్మము నందభిమానముగల ఈశ్వరుడు హిరణ్యగర్భుడు. కారణము నందభిమానము గల ఈశ్వరుడు అవ్యాకృతుడు. పై స్థూల సూక్ష్మ కారణ శరీరముల యందభిమానము గల వ్యష్టిని జీవుడని సమష్టిని ఈశ్వరుడనియు నందురు. వ్యష్టి యందు సమష్టి యందభిమానములేని కేవలాత్మ త్రిపుర సుందరి. ఈమెయే తుర్య యనబడును. వ్యష్టులన్నింటిని స్థూల సూక్ష్మ సమష్టులను తనలో నిముడ్చుకొన్న కారణము మాయమే త్రిపుర సుందరి. సృష్టి శక్తి, స్థితి శక్తి, లయశక్తి - సరస్వతి, లక్ష్మి, కాళి పై మూడింటిని కలిపి మాయ యందురు. పై మూడింటికతీతమయిన దగుటచే మహామాయ త్రిపుర సుందరి యనబడును. భూర్భువస్స్వర్లోకములు లేక స్వర్గ భూపాతాళములు త్రిపురములు వానికి నాయికయే త్రిపుర సుందరి. బ్రహ్మాండముల కావల యుండు మహాకైలాసము లేక అపరాజితము మేరుపర్వతము నందున్న మణిపురము అమృతసముద్రమందున్న మణిద్వీపములోని మహానగరము త్రిపురములు. వానిలో నివసించు నాయిక త్రిపుర సుందరి. ఓంకారములోని అకార, ఉకార, మకారములు త్రిపురములు వాని సమష్టియైన ఓంకారము త్రిపురము. దానికి నాయిక తత్ప్రతిపాద్య యగుటచే అమ్మవారు త్రిపుర సుందరి. త్రిపురాభిమాన దుఃఖములేని

యానంద రూపిణి పంచకోశాతీత పుచ్ఛ బ్రహ్మాస్వరూపిణి త్రిపుర సుందరి యనబడును. సృష్టిస్థితి లయముల నొనరించు శక్తులు మూడును కలిగిన ముగురమ్మల మూల పుటమ్మ మహాలక్ష్మి త్రిపుర సుందరి యనబడును (సప్తశతిలోని ప్రాధానిక రహస్యములో చూడదగినది). ఉన్దీ క్లేదవేయను ధాతువునకు సు అను ఉపసర్గను పూర్వము నందు జేర్చిన సుందశబ్దమేర్పడును. దానికి ఆర్ద్రీభావము దయయనియర్థము. అట్టిదయను సమస్తజీవులకు ఒసగునది సుందరి యనబడును. జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడు పట్టణములందుండి వానిని దయతో గాపాడు సుందరి త్రిపుర సందరి యనబడును. (విష్ణుసహస్రనామ శంకరభాష్యము - సుందశబ్ద వివరణను చూడదగినది). బహుళార్థ ప్రతిపాదికమైన త్రిపుర శబ్దము దూర్వాసులకిష్టమైన నామము. సౌందర్యమనగా దయయే, త్రిపురయు దయగలిగిన తల్లియునైనదేవి త్రిపుర సుందరి యనబడును. ఇట్లెన్నియేని యర్థములు చెప్పవచ్చును. గ్రంథవిస్తరణ భీతిచే నీ నామ వివరణము ముగించుచున్నాను. శివుని అంగము హర్మ్యభూమిగా కరుణా ప్రవాహము విహారసరస్సుగా పరిపాలనీయము విశ్వముగా దాసులు వాసవాదులుగా రూపించబడుట అవయవియాం కటాక్షమునకు రాజత్వము నిరూపింప బడుటచే నీ శ్లోకమున సావయవరూపకాలంకారముకలదు.

27. వాగీశ్వరీ సహచరీ నియమేన లక్ష్మీః
భ్రూవల్లరీ వశకరీ భువనాని గేహమ్
రూపం త్రిలోకనయనామృత మమ్బ తేషాం
కామాక్షి! యేషు తవ వీక్షణ పారతన్త్రీ

అ|| అమ్బ - అమ్మా, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, యేషు - ఎవరియందు, తవ - నీయొక్క, వీక్షణపారతన్త్రీ - చూపు యొక్క వివశతయో, తేషాం - వారికి, నియమేన - తప్పక, వాగీశ్వరీ - సరస్వతీ, సహచరి - కలసి తిరుగునదియై యుండును. లక్ష్మీః - లక్ష్మిదేవి, భ్రూవల్లరీవశకరీ - భ్రూలత వశముననుండి పనులనొనరించునదై యుండును, రూపమ్ - శరీరచ్ఛాయ, త్రిలోకనయనామృతమ్ - త్రిలోకములందలి జనుల కన్నుల కమృతమై యుండును, భువనాని - లోకములే గేహమ్ - ఇల్లుగా నుండును

తా|| అమ్మా! కామాక్షీ దేవీ! నీ చూపెవరి యందు వివశమై పడునో వారికి వాగీశ్వరి సహచరిగా, లక్ష్మి కనుసైగ ననుసరించి సేవ చేయునదిగా, భువనములే ఇల్లుగా, రూపము త్రిలోకనయనామృతముగా మారిపోవును.

వి|| లక్ష్మి భ్రూవల్లరీ వశకరి యగు ననగా విష్ణుత్వము సంభవించుననియు, వాగీశ్వరి సహచరి యగుననగా బ్రహ్మత్వము కలుగునని భువనములే యిల్లగుననుగా సర్వలోకముల యందు సంచరించు సామర్థ్యము కలుగుట రూపము త్రిలోక నయనామృత మగుననగా మన్మధ సమాన సౌందర్యము కలుగుననియు వ్యంగ్యార్థములు స్ఫురించును. అవి యన్నియు కలసి దేవీ కటాక్ష పాత్రుని మహిమాతిశయమును స్ఫురింపజేయు చున్నవి. కావున నిందు వస్తు ధ్వని యున్నది.

28. మాహేశ్వరం ఝటితి మానసమీన మమ్బ!
కామాక్షి ధైర్యజలధౌ నుతరాం నిమగ్నమ్
జాలేన శృంఖల యతి త్వదపాంగ నామ్నా
విస్తారితేన విషమాయుధ దాశకోఽసౌ

అ|| అమ్బ! - అమ్మా, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, ధైర్య జలధౌ - ధైర్యమను సముద్రమందు, నితరాం - మిక్కిలి, నిమగ్నమ్ - మునిగిన, మాహేశ్వరమ్ - మహేశ్వరునకు సంబంధించిన, మానస మీనమ్ - మనస్సను చేపను, ఝటితి - శీఘ్రముగా, అసౌ - ఈ, విషమాయుధ దాశకః - మన్మథుడను దాసుడు, విస్తారితేన - పఱచబడిన, త్వదపాంగ నామ్నా - నీ కడగంటి చూపను పేరుగల, జాలేన - వలతో, శృంఖలయతి - బంధించు చున్నాడు.

తా|| అమ్మా కామాక్షీ దేవీ! శివుని మనస్సను చేప ధైర్యమను సముద్రమంద మగ్నమై యుండ దానిని నీ కడగంటి చూపనెడి వలపరచి నీ దాసుడైన మన్మథుడు బంధించు చున్నాడు.

వి|| శివుడు ధీరుడు. ఆతని మనస్సు ధైర్య జలధిలో మునిగిన చేపగా రూపింపబడినది. దానిని అమ్మవారి కడగంటి చూపను వలతో అమ్మవారి సేవకుడైన మన్మథుడే బంధించివైచినాడు. అనగా శివుడధీరుడై అమ్మవారి చూపుల కోడి యామెకు వశమైనాడు. శివుని మనస్సు వలలోపడిన చేప

హైనదని రూపించుటచే నిట సావయవ రూపకాలంకారము గలదు. సాధారణముగా ధైర్యము పర్వతముతో పోల్పబడును. ధైర్యవంతుని మేరు ధీరుడందురు. అయినను ఇట ధైర్యము నందు జలధితోడి పోలిక వ్యక్తము చేయబడినది. ఇది అసాధారణము, ధీర మయిన శివ మనోఝషమును అమ్మవారి చూపనెడి వలలో బంధించిన వాడు మన్మథుడు. అమ్మవారికి దాసుడు. అనుటచే అమ్మవారి ప్రభుత్వము వ్యక్తమగును. మొదట శివుని మనస్సు ధైర్య జలధిలో స్వేచ్ఛగా దిరిగి మన్మథునికి పట్టుబడి అధీరమైనదని చెప్పుటచే అమ్మవారి సౌందర్యాతిశయము వ్యక్తము అగుచుండుటచే నిట వస్తుధ్వని కలదు.

29. ఉన్మథ్య బోధ కమలాకర మమ్బ! జాడ్య
స్తమ్భే రమం మమ మనోవిపినే భ్రమన్తమ్
కుంఠీ కురుష్వ తరసా కుటిలాగ్ర సీమ్నా
కామాక్షి! తావక కటాక్ష మహాంకుశేన

అ|| అమ్బ - అమ్మా!, కామాక్షి! - ఓ కామాక్షీ!, కుటిలాగ్రసీమ్నా - వక్రమైన చివటి భాగముగల, తావక కటాక్ష మహాంకుశేన - నీకడ గంటి చూపనెడి అంకుశము చేత, మమ - నా యొక్క, బోధకమలాకరమ్ - జ్ఞానమను సరస్సును, ఉన్మథ్య - కలచివైచి, మనోవిపినే - మనస్సను నడవి యందు, భ్రమన్తమ్ - తిరుగుచున్న, జాడ్యస్తమ్భేరమమ్ - జడత్వమనుగజమును, తరసా - శీఘ్రముగా, కుంఠీకురుష్వ - అణచివేయుము.

తా|| అమ్మా! కామాక్షీ దేవీ! వక్రమైన మొనగల నీ కటాక్షమనునంకుశముతో నా జ్ఞాన సరస్సును కలచివైచి నామనస్సను వనమున భ్రమించుచున్న నా జాడ్యమను నేనుగును అణచి వేయుము.

వి|| అమ్మ వారి కటాక్షమీ శ్లోకమున రూపింప బడినది. కటాక్షమునకు అంకుశమునకు పోలిక యిందు వ్యంగ్యమగుచున్నది. పోలిక సామాన్య ధర్మము నాశ్రయించి పుష్ప మగును. కటాక్షాంకుశములకు పోలిక యప్రసిద్ధము కావున కుటిలాగ్ర సీమ్నా అను విశేషణము కటాక్షాంకుశముల యభేద ప్రధాన సాదృశ్యము స్ఫురింప జేయుటకు మూలమైన సామాన్య

ధర్మమును చెప్పు చున్నది! ఈ విశేషణ మందర్థశ్లేష కలదు. అమ్మవారి కటాక్షము నందు వక్రత యున్నది. అంకుశము చివఱ వక్రత యున్నది. కుటిల పదము తోను భయగత మైన వక్రతయను సామాన్య ధర్మ మిందుపపాదింపబడినది. మూకకవి తన మనమును వనమునుగా రూపించినడా. వనము నందు సరస్సుండిన నుండవచ్చును. పరిణామమున వనము పెద్దది. సరస్సు చిన్నది. కాని మనస్సు పెద్దదో చిన్నదో మనకు ప్రత్యక్షము కాక పోవుటచే తెలియదు. శాస్త్రజ్ఞులు కొందఱు యంతః కరణమును పరమాణు పరిమాణమనగా, మరికొందరు మధ్యమ పరిమాణమనినారు. తక్కువ ప్రదేశము నాక్రమించునది పరమాణువు. కాని అది అల్పకాలికము కాదు. ముక్తి పర్యంతము దానికి నాశములేదు. కనుకనది పెద్దదే దాని యందొకప్పుడు వృత్తులుదయించు చుండును. నిద్రావస్థలో వృత్తి యుండదని కొందఱు, శూన్యవృత్తియని కొందరు అజ్ఞానవృత్తియని కొందరు చెప్పెదరు. వృత్తి విషయగతమైన అజ్ఞానావరణమును దొలగించి బోధము కలుగజేయును. ఇటువంటి బోధములు పెక్కులు జాగ్రదవస్థలో మనమున నుద్భవించు చుండును. కావున మనమున కంటె బోధములు కాలికముగా చిన్నవి. బోధము ద్విక్షణావ స్థాయియని కొందఱు చెప్పెదరు. మనస్సు అనాది కాలము నుండి ముక్తి పర్యంత ముండునది. కావున కాలికముగా బెద్దది. బోధము కాలికముగ చిన్నది. పెద్ద వనములో చిన్న సరస్సుతో మనములో నొకప్పుడు జనించు బోధము రూపింప బడినది. ఏనుగు మందగమనమునకు బ్రసిద్ధము. మాంద్యము జాడ్యమునకు సహభవము. కావున జాడ్యమేనుగుతో రూపింపబడినది. కావున నీ శ్లోకమున రూపకాలంకారము కలదు. జాడ్యము భ్రమ హేతువు. కావున జాడ్యగజము భ్రమించు చున్నదని 'భ్రమన్తమ్' అను పదమిచ్చుట చాల నుచితముగా నున్నది. భ్రమణము వట్టి తిరుగుట కాదు. అది భ్రమించుట యను నర్థమును కూడ నొసగును. జాడ్యము బోధమును హరించి భ్రమను కలిగింప జేయునని ఆ జాడ్యమును నీ కటాక్షముతో నణచివేయుమని మూకకవి కోరుచున్నాడు.

30. ఉద్వేల్లిత స్తబకితై ర్లలితై ర్విలాసై
రుత్థాయ దేవి తవ గాఢ కటాక్షకుంజాత్
దూరమ్ పలాయ యతు మోహ మృగీకులమ్మే
కామాక్షి! సత్వర మనుగ్రహ కేసరీన్ద్రః

అ|| కామాక్షీ! - ఓకామాక్షీ!, దేవి - దేవీ!, ఉద్వేల్లిత స్తబకితైః - తీగలుగా పైకి పాకి గుత్తులు కట్టిన, లలితైః - అందములైన, విలాసైః - విలాసములతో, తవ - నీ యొక్క, గాఢ కటాక్షకుంజాత్ - తీవ్రమైన కడగంటి పొద నుండి, ఉత్థాయ - లేచి, సత్వరం - వేగముగా, అనుగ్రహ కేసరీన్ద్రః - దయయనెడి మృగరాజ రాజు, మే - నాయొక్క, మోహమృగీకులమ్ - మోహమనెడి లేళ్ళ గుంపును, దూరమ్ - దూరముగా, పలాయయతు - పారద్రోలుగాక!

తా|| ఓ కామాక్షీ దేవీ! నీ కటాక్ష మొక పొదరిల్లు దానిలో దయయను మృగ చక్రవర్తియున్నది. తద్విలాసములు ఉద్వేల్లితస్తబకిత లలితములై యున్నవి. ఆ పొదరింటి నుండి యా సింహము త్వరగా లేవవలెను. నా మోహ మనెడి లేళ్ళ గుంపును దూరముగా బారద్రోలవలెను.

వి|| ప్రథమ పాదములోని ఉద్వేల్లిత సభకిత లలిత విలాసకులు అనుగ్రహ సింహ గతములని కొందఱు కటాక్ష కుంజగతములని కొందఱు భావించుట కవకాశమున్నది. ఉద్వేల్లితత్వము స్తబకి తత్వము కటాక్ష కుంజమున నుచితములై యున్నట్లు అనుగ్రహ సింహము కటాక్షకుంజస్థితము కావున కటాక్ష కుంజగత ధర్మములు కటాక్ష కుంజస్థిత మైన యనుగ్రహ సింహము నందును వర్తింప జేయుట పెద్ద విరోధము కాదు. ఈ శ్లోకమున కటాక్షము కుంజముగా మోహము మృగీకులముగా అనుగ్రహము సింహముగా రూపింపబడినవి. కావున నిందు రూపకాలంకారము కలదు. కటాక్ష కుంజగతానుగ్రహ సింహము తన మోహమృగమును బారద్రోలగోరు చున్నాడు.

31. స్నేహార్ద్రితాం విదలితోత్పలకాన్తి చోరాం
జేతారమేవ జగదీశ్వరి జేతుకామః
మానోద్ధతో మకరకేతు రసౌ ధునీతే
కామాక్షి తావకకటాక్షకృపాణవల్లీమ్||

అ|| జగదీశ్వరి! - లోకమాతకు ప్రభ్వివైన, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, స్నేహర్ద్రితాం - స్నేహము (నూనె)తో తడిసిన, విదలితోత్పలకాన్తి చోరామ్ - వికసించిన కలువల కాంతిని దొంగిలించు, తావక కటాక్ష కృపాణ వల్లీమ్ - నీకడగంటి చూపనెడి ఖడ్గవల్లిని, మానొద్ధతః - అభిమానముతో

గర్వించి యున్న, జేతారమేవ - జయించిన వానినే (శివునే) జేతుకామః - జయింప గోరిన , అసౌ - ఈ, మకరకేతుః - మొసలి ధ్వజచిహ్నముగాగల మన్మథుడు, ధునీతే - జళిపించు చున్నాడు.

తా॥ జగదీశ్వరి వైన యో కామాక్షీ దేవీ! నీ కటాక్షమను కత్తిని ధరించి ఒకప్పుడు శివుని చే నోడి పోయియు మరల నాతనిపైకి ఝుళిపించు చున్నాడు. నీ కటాక్ష కృపాణము వికసించిన కలువల నల్లని కాంతిని విరజిమ్ము చున్నది. అది త్రుప్పు పట్టకుండుట కై స్నేహముచే తడుపబడి యున్నది.

వి॥ ఒకడు తన స్నేహితునితో కలసి యిష్టము లేక పోయినను స్నేహితుని బలవంతముతో దొంగతనము చేయుట లోకమునం దెడ నెడ కన్పించును. కాని యొక స్నేహితుడు తన స్నేహితుని యింటనే దొంగతనము చేయడు. అమ్మవారి కటాక్షకృపాణవల్లికి రెండు విశేషణములున్నవి. ఒకటి స్నేహార్ద్రితాం అని మరొకటి విదలతోత్పల కాంతి చోరాం అని. స్నేహముతో ఆర్ద్రితమైన కటాక్షకృపాణ వల్లిక విదలితోత్పలముల కాంతిని దొంగిలించుటలో నౌచిత్యము లేదనిపించును. కాని అమ్మవారి కటాక్షము కృపాణ వల్లితో స్నేహము చేసి తదభేదమును బొందినది. తత్స్నేహముననే వికసించన యుత్పలముల కాంతిని దొంగిలించినదని ఔచిత్య భంగము కలుగకుండ సమర్థింపవచ్చును. కత్తులకు త్రుప్పు పట్టకుండుటకు నూనె పూయుదురు. ఇదే యిచట స్నేహార్ద్రితత్వము. కటాక్షమునకు అమ్మవారి హృదయమున నున్న స్నేహము (మైత్రి) ప్రాప్తించినది. కావున నది స్నేహార్ద్రితమైనది. కృపాణ వల్లియని కృపాణమును వల్లితో రూపించుట కవి సమయ సిద్ధమే. ఆ వల్లి ఉత్పల వల్లియేల కాకూడదు. ఉత్పల వల్లియై ఉత్పల కాంతిని దొంగిలించుట స్వవస్తు చౌర్యమే యగును గావున నది దోషమే కాదు. ఇంతకు ఉపమాన ధరమ చౌర్యమే యగును గావుననది దోషమే కాదు. ఇంతకు ఉపమాన ధర్మ చౌర్యము ఉపమేయమున వర్ణించుట కవి సమయ సిద్ధముకావున స్నేహార్ద్రితత్వ కాంతి చౌర్యముల విరోధము పరిహరించ కొనవచ్చును కావున నట విరోధాభాసాలంకారము వ్యంగ్యమగు చున్నది. ఓడిపోయిన వారికి నూతన మైన ఆయుధ సంపత్తి లభించి నప్పుడు ఓడించిన వారి నోడించుటకు బయలుదేరుట సర్వేశ్వరులలో బహుధా కనిపించునట్టిదే అమ్మవారి కటాక్ష కృపాణ వల్లి మన్మథునకు లభించినది ఇకనేమి దాని

సాయమున శివుని మీదకే యాతని జయించుటకు బోయినాడు. విజయమును సాధించినాడు. కామ జితుడై శివుడమ్మవారిని బెండ్లి జేసికొన వలసి వచ్చినది. ఆమెను బెండ్లాడి యామె కర్ధ శరీరమునే యొసగినాడు. తానే యామె యధీనుడైనాడు. అమ్మవారు స్వాధీన పతిక యైనది. మకరము జలములో నివసించు తనకన్న బలహీనములైన జంతువులను బెదరించును. భూ చరములైన ప్రాణుల జలములోనికి దిగినప్పుడు వానిని జంపి దినును. మకర కేతు వైనంత మాత్రమున కైలాస వాసియగు శివునకేమి భయము. పైగా మకరము భూమిపైకి వచ్చిన మిక్కిలి బలహీనమగును. కుక్కచే గూడ జంపబడును. మకరమును జెండా యందు ధరించిన మన్మథుడు శివునిచే మొదట నోడి పోయినాడు. ఇప్పుడమ్మ వారి కటాక్ష కృపాణ వల్లి లభించగా మరల విజృంభించి శివునోడించినాడు. విధి బలీయము. ఓడిపోయిన వాడే మరల యుద్ధము చేసి గెలువ వచ్చును. మన్మథుడు శివుని స్వదేహ బలముచే నోడింపజాలలేదు. అమ్మవారి కటాక్షము యొక్క సాయమున (ఆయుధబలమున) నోడించినాడు. ఘనత అమ్మవారి కటాక్షమునకే చెందును గాని మన్మథునకు చెందదు. మన్మథునిచే శివుడోడింపబడినాడనుట ఆయుధ మహత్త్వ మెఱుగక పోవుట యే అయ్యును ఆయుధ సంపాదనము తత్ప్రయోగ నైపుణ్యము మన్మథుని కొప్పుకొని మన్మథుడే గెలిచినాడందము. జగదిదమ్యంగో విజయతే యని సౌందర్యలహరిలో శ్రీ శంకరులే యన్నారు గదా! మన్మథునకు నీలోత్పలము బాణము. అది శివునిపై పనిచేయలేదు. అయినను అది బాణముగా పెక్కేండ్లు మన్మథుని కడ నున్నది. దానిని విడువలేక పోయినను తత్కాంతిగల అమ్మవారి కటాక్షము నాశ్రయించి శివుని గెలుచుట యతనికి తన బాణమైన నీలోత్పలము చేతనే గెలుచుటగా భావించి మిక్కిలి సంతోషము కలిగినది.

అవ|| పై శ్లోకమున కటాక్షము నందుత్పల కాంతి చౌర్యము ప్రసక్తమైనది. ఈ శ్లోకమున పంకజరుక్చౌర్యము ప్రస్తావింపబడు చున్నది.

32. శ్రౌతీంవ్రజన్నపి సదా సరణిం మునీనాం
కామాక్షి! సంతతమపి స్మృతి మార్గగామీ
కౌటిల్య మంబ కథ మస్థిరతాం చ ధత్తే
చౌర్యంచ పంకజరుచాం త్వదపాంగపాతః

అ|| అంబ! - అమ్మా, కామాక్షి ! - ఓ కామాక్షీ దేవీ!, సదా - ఎల్లప్పుడు, శ్రౌతీం - శ్రుతికి సంబంధించిన, సరణిమ్ - మార్గమును, వ్రజన్నపి - పొందు చున్నను, సంతతమ్ - ఎల్లప్పుడు, స్మృతి మార్గగామి అపి - స్మృతి మార్గమున బోవునదైనను, త్వదపాంగపాతః - నీ క్రీగంటి ప్రసారము, కౌటిల్యమ్ - వక్రతను, అస్థిరతాంచ - చంచలత్వమును, పంకజ రుచాం - కమలకాంతుల యొక్క, చౌర్యంచ - దొంగతనమును, కథమ్ - ఎట్లు, ధత్తే - ధరించు చున్నది.

తా|| అమ్మా! కామాక్షీ దేవీ! నీ క్రీగంటి ప్రసారము శ్రుతి మార్గమును బొందు చున్నది. మునుల యొక్క స్మృతి మార్గమును గూడా బొందు చున్నది. ఇట్లు శ్రుతి స్మృత్యనుసారి యైనను వక్రత్వ చంచలత్వములను కమల కాంతి చౌర్యము నెట్లు ధరించు చున్నది. అమ్మవారి కటాక్ష ప్రసారము చెవిని దాకునంత దీర్ఘమైనదని మునుల స్మృతులందు మెలగునదని వక్రత్వ చంచలత్వములను కలిగి యుండి కమల కాంతుల గూడ కలిగి యున్నదని యర్థాంతరము. ఇట్లు శ్రుతి స్మృతి మార్గగామి త్వములను సద్గుణములు, కౌటిల్య వక్రత్వ చౌర్యములను దుర్గుణములు, నీ కటాక్షమున సహవాసము చేయుట వింత కదా!

వి|| ఆశ్చర్యకరములైన సుగుణ దుర్గుణములు కలసి యుండుటయను అపి శబ్దోక్తవిరోధము చెవి, జ్ఞప్తి అను అర్థాంతరములు కల శ్రౌతీస్మృతి శబ్దముల శ్లేష వలన పరిహరింపబడుటచే నీ శ్లోకమున విరోధాభాసాలంకారము వాచ్యమై యున్నది.

అవ|| పై శ్లోకమున శ్రౌత మార్గము ప్రస్తావింపబడినది. ఇందా శ్రుతి పరిచయముచే సిద్ధించు కాలిమా సంప్రదాయాధ్యయనము ప్రస్తావింపబడు చున్నది.

33. నిత్యం శ్రుతేః పరిచితౌ యతమానమేవ
నీలోత్పలం నిజసమీప నివాసలోలమ్
ప్రీత్యైవ పాఠయతి వీక్షణ దేశికేంద్రః
కామాక్షి! కిం ను తవ కాలిమ సంప్రదాయమ్

అ|| కామాక్షి ! - ఓ కామాక్షీ దేవీ!, నిత్యమ్ - ఎల్లప్పుడు, శ్రుతేః - చెవి (వేదము) యొక్క, పరిచితౌ - పరిచయమునందు, యతమానమేవ - యత్నించుచున్నదేయయ్యె, నిజసమీప నివాసలోలమ్ - తన దగ్గఱ నుండు, నీలోత్పలమ్ - నల్లకలువను, వీక్షణదేశికేన్ద్రః - చూపనెడి, గురుస్వామి - ప్రీత్యా - ప్రీతితో, తవ - నీ యొక్క, కాలిమ సంప్రదాయమ్ - నలుపు యొక్క రీతిని, (శిక్షయతీవ - నేర్పుచున్నదో యన్నట్లున్నది).

తా|| వేదము యొక్క (చెవి యొక్క) పరిచయము నందు తనకడనే యుండి యత్నించు చుండుట జూచి నీలోత్పలమునకు నీ చూపనెడి గురుస్వామి ప్రేమతో నలుపుదనమును నేర్పు చున్నట్లున్నది.

వి|| అమ్మవారి వీక్షణమునందు గురుస్వామిత్వ మారోపింపబడి యుండుట నీలోత్పలము నందు శిష్యత్వారోపణమును వ్యక్తీకరించు చున్నది. పరంపరిత రూపకాలంకార మిందుగలదు. శిష్యుడు నిత్యము శ్రుతి పరిచయమునకు యత్నించుచు గురువుకడ నివసింప వలెనను శిష్య ధర్మము నీలోత్పలము నందు శ్రుతి శబ్దశ్లేష చే సమీప నివాసలోలం అను పదము నందలి అర్థశ్లేష చేతను స్ఫురించు చున్నది. తనకడ నుండి వేదాధ్యయనము నొనరించు వానికి ప్రీతితో గురువు తనకు సంప్రదాయాగతమైన విద్యను బోధించును. ఇచట వీక్షణము నందు పరంపరాగతమైన కాలిమ సంప్రదాయమున్నది. దానిని తనకడ నుండ గోరిన నీలోత్పలమునకు బోధించుచున్నట్లున్నదా? యనుభావన ఇవ శబ్దవ్యాచ్యమగుటచే నీశ్లోకమున నుత్ప్రేక్షాలంకారమున్నది. రూపకాలంకారము త్ప్రేక్షాలంకారము నకంగము గా నుండుటచే నిచటి యత్ప్రేక్షాలంకారము రూపకానుప్రాణితమై యున్నది. అమ్మవారు శ్రుతికి (చెవికి) ఆభరణముగా నీలోత్పలమును ధరించినది. అందువలన నానీలోత్పలము శ్రుతి పరిచయమునకు యత్నించుచున్నట్లున్నది. రూపరహితమైన బ్రహ్మమును కొందఱు నల్లని పురుషునిగా కొందఱు నల్లని స్త్రీగా భావించి యుపాసించెదరు. ఈ సంప్రదాయమే కాలిమ సంప్రదాయము. కొందఱెఱ్ఱగా నున్నట్లుపాసించెదరు, వారిది శోణిమ సంప్రదాయము. కొందరు తెల్లగా నున్నట్లుపాసించెదరు. వారిది ధవళిమసంప్రదాయము. ఈ మూడు మాయా శబలిత బ్రహ్మోపాసనా సంప్రదాయములును శ్రుతి సిద్ధములు. కావున వాని యధ్యయనమునకు

శ్రుతి పరిచయ మావశ్యకము. వేదము మొత్తమధ్యేయమే యైనను శక్తి చాలని వారొక సంప్రదాయమునే యభ్యసించి తదుపాసన మాచరించెదరు. గురువులును వారికి కావలసిన సంప్రదాయమునే నేర్పుదురు. కాలిమ సంప్రదాయములోని భేదములు శ్రీ విష్ణూపాసనము కాలీదేవ్యుపాసనము ఇత్యాదులు. శోణిమసమ్ప్రదాయములో లక్ష్మి లలితోపాసనాదులు చేరును. ధవలిమ సంప్రదాయములో సరస్వతీ శివోపాసనాదులు చేరును. కామాక్షీ దేవి నల్లనిది, ఆమెను మూకకవి యుపాసించుటచే నీతనిది కాలిమ సంప్రదాయము, ఇది యీతని కమ్మవారి కృపా వీక్షణము చేతనే లభించి యుండవచ్చును. లేనిచో మూగ వానికే గురువు నేర్పనుత్సహించునా.

34. భ్రాంత్వాముహుః స్తబకిత స్మితఫేనరాశౌ
కామాక్షి! వక్త్రరుచి సంచయవారిరాశౌ
ఆనన్దతి త్రిపురమర్దన నేత్రలక్ష్మీ
రాలభ్య దేవి తవ మన్ద మపాంగసేతుమ్

అ|| కామాక్షి దేవి! - ఓ కామాక్షీ దేవీ!, స్తబకితస్మిత ఫేనరాశౌ - గుత్తులు కట్టిన చిఱు నవ్వు అనెడి నుఱుగులు గుంపుగల, తవ - నీ యొక్క, వక్త్రరుచి సంచయ వారి రాశౌ - ముఖ కాంతి సమూహమనెడి సముద్రము నందు, ముహుః - మాటిమాటికి, భ్రాన్త్వా - భ్రమించి, మన్దమ్ - మెల్లనైన, అపాంగసేతుమ్ - క్రీగంటి చూపనెడి ఒడ్డును, ఆలభ్య - పొంది, త్రిపురమర్దన నేత్ర లక్ష్మీః - త్రిపుర సంహారియైన శివుని కన్నుల కాంతి, ఆనన్దతి - ఆనందించు చున్నది.

తా|| కామాక్షీ దేవీ ! శివుని కన్నుల కాంతి నీ చిఱునవ్వుతో నిండిన వక్త్రకాంతి యనెడి సముద్రమునందు తిరిగి తిరిగి క్రీగంటి చూపనెడి ఒడ్డును పొంది ఆనందించు చున్నది.

వి|| సముద్రములో ఒడ్డుగానక భ్రమించు వ్యక్తి కొడ్డును చూచిన సంతసము కల్గును. శివుని నేత్ర లక్ష్మి అమ్మవారి వక్త్ర కాంతి సముద్రమున తిరిగి తిరిగి చివరి క్రీగంటి చూపను ఒడ్డును చూచి యానందిచుచున్నది. ఒడ్డెక్కక పోయినను ఒడ్డును చూడగనే యానందించు చున్నది. ఆనందించుచునే యుండుటచే నొడ్డెక్కు యత్నమునే

చేయలేదేమో? వర్తమాన క్రియ ఈ యంశమును వ్యంగ్యమొనరించు చున్నది. స్త్రీ లింగమైన లక్ష్మి శబ్దము పుంలింగమైన సేతు శబ్దము లక్ష్మి సేతువులందు నాయికా నాయక వ్యవహారమును స్ఫురించును జేయుటచే నీ శ్లోకమున సమాసోక్త్యాలంకారము కలదు. నాయిక నాయకుని బొంది యానందించును గదా! లక్ష్మి సముద్రుని కూతురగుటచే సముద్రము నందుండుటకే యిష్టపడును. సముద్రపు టొడ్డునుబొంద యత్నింప లేదు. శివుని నేత్రలక్ష్మి యట్టిదికాదు. ఆమెకు ముఖ కాంతి సముద్రము యొక అంచును చూడ వలెనను కోరిక కలదు. ఆమె చూపను చెలియలికట్టను పొంది యానందించినది. కాని దాని దాటలేదు. అది మర్యాదాతిక్రమణము. శివనేత్ర లక్ష్మికి అమ్మవారి చూపను ఒడ్డే భర్తకావున పతిని పొంది యానందించినది. ఆ లక్ష్మి చంచల. ఈ లక్ష్మి స్థిర. కావుననే అమ్మవారి నేత్రసేతువును పొంది యిప్పటికిని ఆనందించుచునే యున్నది. ఆయానందమనంతము. సముద్రమున శోభావహములైన రత్నములెన్నో కలవు. ముఖకాంతి సముద్రము నందు భ్రూయుగము లలాటము, కపోలములు, ఇత్యాదులు రత్నములు. కాని వాని యన్నిటిని చెప్పక స్మిత మొక్కటే ఈ శ్లోకమున చెప్పబడినది. కారణమేమి? స్మితము ఫేనము. అది శివనేత్ర లక్ష్మిని యొడ్డునకు చేర్చినదా? యన్నట్లు శివుని నేత్రలక్ష్మి కపాంగసేతువు కనబడినది. అది ముఖ కాంతి సముద్రము యొక్క పరమావధి. ఇతర రత్నములకన్న స్మితము దాని కన్న అపాంగమే శివున కానంద దాయకమైనది. ఆ చూపు మందముగా నున్నది. అమ్మవారేదో పారవశ్యముననున్నట్లున్నది. అది శివనేత్ర దర్శనముచేత కాబోలు. ఆ శివనేత్రమీమె యపాంగమును స్పృశించినది. కన్నులు కన్నులు కలసినవి. ఇక శివుడన్య మాలోచింపక యానందించు చున్నాడు. శివుడు త్రిపుర మర్దన మొనరించి వచ్చినాడు. దేవతల కమృతోద్భవ మైనప్పుడు కలిగిన యానందము కన్న ఎక్కుడానందమైనది. ఆ ఆనందము శివుని నేత్రలక్ష్మి కమ్మవారి యపాంగ సేతుస్పర్శ వలన కలిగినది. అమ్మవారి చూపు శివుని నేత్రములందలి యానందము నోరగా చూచి పారవశ్యమొందినది. శివుని కన్నులలోనికి సూటిగా చూచుట కమ్మవారి హృదయములోని లజ్జయడ్డు వచ్చినట్లున్నది. పారవశ్య లజ్జాతి శయము

లమ్మ చూపునకు మాంద్యమును ఘటింపజేసినవి. అప్పుడు అమ్మవారి ముఖ్య సౌందర్య సముద్ర పార దర్శనముచే శివుని యానందమపారమైనది. అందుకే శివ నేత్రలక్ష్మి నిశ్చలమైనది. మగవాడైన శివుని నేత్రములందలి లక్ష్మి యాడుదియై, ఆడుదైన కామాక్షీ దేవి యపాంగ సేతువు పురుషుడై ఉభయుల శరీరము దృశ్యమని ఉభయుల యాత్మ దృగ్రూపుడని, దృగ్దృశ్యసంయోగమును సూచించు చున్నది.

అవ|| పై శ్లోకమున శివనేత్ర లక్ష్మి చెప్పబడినది. ఈ క్రింది శ్లోకమున అమ్మవారి లోచనశ్రీ వర్ణింప బడుచున్నది.

35. శ్యామా తవ త్రిపుర సున్దరి లోచనశ్రీః
కామాక్షి! కందలితమేదుర తార కాన్తిః
జ్యోత్స్నా వతీ స్మితరుచాపి కథం తనోతి
స్పర్ధా మహో కువలయై శ్చ తథా చకోరైః

అ|| త్రిపుర సున్దరి - త్రిపురములలో సుందరివైన, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, లోచనశ్రీః - కంటి కాంతి, శ్యామా - నల్లని దై (యౌవనమధ్యస్థురాలై), కందలిత మేదురతార కాంతిః - మొగ్గతొడిగిన దట్టమైన కనుపాపల తళుకు (నక్షత్రముల కాంతి) గలదై, స్మితరుచా - చిఱునవ్వు కాంతిచే, జ్యోత్స్నావతీ - వెన్నెల కలదై (రాత్రియయ్యును), కువలయై - కలువలతో, తథాచకోరైఃచ - చకోరములతోడను, కథమ్ - ఎట్లు, స్పర్ధామ్ - పోటీని, తనోతి - పెంచు చున్నది. అహో - ఆహా!,

తా|| త్రిపుర సున్దరి వైన యో కామాక్షీ దేవీ! నల్లని కనుపాపల తళుకు అనెడి నక్షత్ర కాంతి గల నీనయన శోభ చిఱునవ్వు వెన్నెలగలదై వెన్నెలరాత్రి యగుటచే కలువలతో చకోరములతో స్నేహము చేయవలసి యుండగా వానితో పోటీ పడుచుండుట విచిత్రముగదా!

వి|| అమ్మవారి నయన శోభ యందు రాత్రిత్వ మపహ్నుతమై అమ్మ వారి రెప్పల కాంతి యందు నక్షత్ర కాంతి యారోపమును "కందలిత మేదురతారకాంతిః" అను శ్లిష్ట శబ్ద విశేషణము స్మితరుచ యందు వెన్నెల యారోపమును స్మిత రుచా జ్యోత్స్నావతీ అను అశ్లిష్టవిశేషణము

చెప్పుటచే నిదిరూపకాతిశయోక్త్యలంకారమగు చున్నది. చకోరములతో కువలయములతో అసహజమైన విరోధము అపి శబ్దముచే వాచ్యమగుట చే నిట విరోధాభాసాలంకారము కూడ నున్నది. ఈ లోచనశ్రీ రాత్రి చీకటి రాత్రి యా? వెన్నెల రాత్రియా? శ్యామయు, కందలితమేదుర తారకాంతి యునగుటచే చీకటి రాత్రి యని చెప్పవచ్చును. కాని చిఱునవ్వు వెన్నెల కలదై చకోరములతో కలువలతో స్పర్థించు చుండుటచే వెన్నెల రాత్రియని తెలియుచున్నది. శ్యామయను శబ్దమునకు యౌవన మధ్యస్థురాలని యర్థము చెప్పినను ఆమె నల్లనిది కాదనుటకు వీలు లేదు. వెన్నెల రాత్రి నల్లనిదెట్లగును?. ఇంతకు లోచనశ్రీ నల్లనిది. కావున చీకటి రాత్రియే యనవలెను. చీకటి రాత్రిలోనే మేదురతార కాంతి కందలిత మగుచుండును. స్మితరుచి లోచనశ్రీ కాగంతుకము. ఆగంతుకమైన దీనితోనే లోచనశ్రీ కలువలతో, చకోరములతో స్పర్థించుట న్యాయము కాదు. అట్లు స్పర్థించు చుండుట తాను కలువల కన్న, చకోరములకన్న నధిక సౌందర్యము కల దానని చెప్పుటకే కావున నిందు ప్రతీపాలంకార ధ్వని యున్నది. లోచనశ్రీ స్పర్థించుట సద్వలయములతో కాదు. కువలయములతోనే కావున నా స్పర్థ యుచితమే, యన వచ్చును. అను చమత్కారమును కువలయ శబ్ద ప్రయోగమందించు చున్నది. శివుడు తెల్లనివాడు. అమ్మవారి లోచనశ్రీ స్మిత జ్యోత్స్నవతి. అందుచే అమ్మవారి లోచనశ్రీ శివుని శరీరముతో స్పర్థించుచున్నను శివ చకోరము మాత్రమా స్మిత జ్యోత్స్నను గ్రోలుచు నానందించుచునే యున్నది. పతి యనురక్తితో పతి వలె తెల్లని వారైన శివ భక్తులు భక్తితో నాస్మిత జ్యోత్స్నను గ్రోలు చుందురని చకోర శబ్దగత బహు వచనము వ్యంజింప జేయు చున్నది.

అవ॥ పై శ్లోకమున అమ్మవారి లోచన శ్రీ శ్యామ యని చెప్పబడినది. ఈ క్రింది శ్లోకము నందమ్మవారి చూపునకు కాలాంజనాతుల్య నైల్యము తద్వైషమ్యమును చెప్పబడుచున్నది.

36. కాలాంజనం చ తవ దేవి నిరీక్షణం చ

కామాక్షి! సామ్య సరణిం సముపైతి కాన్త్యా

నిశ్శేషనేత్ర సులభం జగతీషు పూర్వ
మన్య త్త్రి నేత్ర సులభం తుహినాద్రి కన్యే

అ|| తుహినాద్రికన్యే! - మంచుకొండకు బిడ్డవైన, కామాక్షి + దేవి - ఓ కామాక్షీ దేవీ!, కాలాంజనంచ - నల్లని కాటుకయు, తవ - నీ యొక్క, నిరీక్షణంచ - (ఎదురు) చూపున్ను, కాన్త్యా - కాన్తితో, సామ్యసరణిం - పోలిక దారిని, సముపైతి - పొందు చున్నది. పూర్వమ్ - మొదటిది (కాలాంజనము) జగతీషు - లోకముల యందు, నిశ్శేష నేత్ర సులభమ్ - సర్వుల నెత్రములకు లభించునది, అన్యత్ - మఱొకటి (నీ నిరీక్షణము), త్రినేత్ర సులభమ్ - త్రినేత్రుడైన శివునకే లభించు నట్టిది.

తా|| కామాక్షీ దేవి నిరీక్షణము కాలాంజనము నల్లనివే. రెండును కాంతితో సమములే. కాని కాలాంజనము ఎవరి నేత్రములకైన లభించును. కాని అమ్మవారి నిరీక్షణము త్రినేత్రుడైన శివునకు మాత్రమే లభించును.

వి|| నేత్రశోభను పెంపొందించుటకు సహజమైన నల్లదనము తక్కువగా నున్నవారు కాలాంజనము (కాటుక)ను ధరించెదరు. అమ్మవారి నేత్రము సహజముగా నల్లనిదే కనుక కాలాంజనమునది ధఱింప నక్కఱ లేదు. అయినను దానిని ధరించినది. దాని వలన ఆమె కంటి శోభ పెరుగను లేదు. తరగను లేదు. ఇది ఈ శ్లోకమున వ్యంగ్యమగు అర్థము. ప్రసిద్ధోప మానోపమేయ భావము నేత్రాంజనములకు లేదు. కాంతితోను సమములని వాని యుపమానోపమేయభావము కవి వ్యంజింపజేసినాడు. నేత్రాంజనములకు భూషణ భూష్య భావమున్నది. వాని యందు సామ్యమును చెప్పుటచే నేత్రాంజనములకు కవి కల్పితోప మానోప మేయ భావమున్నది. అయినను కాలాంజనము నిశ్శేష నేత్ర సులభము. ఎవరైనను కన్నులకు కాటుకను ధరింప వచ్చును. లేదా కన్నుల కలంకరించు కొన్న కాటుకను చూడ వచ్చును. అమ్మవారి చూపును నిరీక్షణమనుట మిక్కిలి యందముగా నున్నది. సాధారణ దృష్టితో జూచినప్పుడు అది చూపే. మూడవ కంటితో జూచినప్పుడది యెదురు చూపు. అది యెదురు చూపని గ్రహించుట త్రినేత్రునకు సులభము. ఇతరులకది చూపు మాత్రమే. కాటుక ధరించినను ధరించక పోయినను దాని

యందు నలుపు శోభించుచునే యుండును. ఉపమానోపమేయ భావమును కల్గించి తిరిగి ఆ రెంటిలోని విశేషమును బేర్కొనుటచే నిట వ్యతిరేకాలంకారము కలదు. కవి తానే ఈ శ్లోమును కల్పించి యారెంటిలో విశేషము చెప్పుట ఈ వ్యతిరేకాలంకారము లోని ప్రత్యేకత. ప్రత్యేక విశేషము. తుహినాద్రి కన్యే అను సంబోధనము అమ్మవారి చూపులొని చల్లదనమును వ్యంజింప జేయు చున్నది. శివుని యవయవములలో కంఠ మొక్కటి కాలాంజనాభము. కాని శరీరమంతయు నల్లనైన అమ్మవారి నిరీక్షణముచే శివుని శరీరమంతయు నల్లబడి పోయినది. శివుడు సమీపించెను. సమీపము నుండి చూచు వారికా యిరువురు నల్లగా యద్వైత స్థితినందినట్లు కనపడుదురు. భిన్నులై యుంద సామ్యసరణి యభేదము స్ఫూర్తికి హేతువగును. అమ్మవారి కన్నులలోని యా నీలిమ సహజమో? కాలాంజన జన్యమో? యెవ్వఱెఱుగుదురు? ఆ త్రినేత్రుడే చెప్పవలెను. అమ్మవారి కొఱకు దేవేంద్రాదులు నిరీక్షించెదరు. అమ్మవారు శివుని కొఱకు నిరీక్షించును.

అవ|| అమ్మవారి కన్నులు కాంతితో కాలాంజన సమములనిపై శ్లోకమున చెప్పబడినది. ఆ నీలిమచాతురి యా క్రింది శ్లోకమున వర్ణింపబడుచున్నది.

37. ధూమాంకురో మకరకేతన పావకస్య
కామాక్షి! నేత్ర రుచి నీలిమ చాతురీ తే
అత్యంత మద్భుత మిదం నయన త్రయస్య
హర్షోదయం జనయతే హరిణాంకమౌలేః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, నేత్ర రుచి నీలిమ చాతురీ - నేత్ర కాంతిలోని నీలిమ యొక్క నిపుణత, మకరకేతన పావకస్య - మన్మథాగ్ని యొక్క, ధూమాంకురః - పొగమొలక, ఇదమ్ - ఇది, అత్యంతమ్ - మిక్కిలి, అద్భుతమ్ - వింత, హరిణాంకమౌలేః - చంద్రుని శిరమందు దాల్చిన శివుని యొక్క, నయనత్రయస్య - మూడు కన్నులకు, హర్షోదయమ్ - ఆనందావిర్భావమును, జనయతే - కలిగించు చున్నది.

తా॥ అమ్మ వారి కంటిలోని నీలిమ ఆమెలో మన్మథాగ్ని కలదని తెలియజేయు పొగ వలెగనపడు చున్నను శివుని మూడు కన్నులలో హర్షోదయమునే కలిగించుట మిక్కిలి యద్భుతముకదా.

వి॥ కనబడని యగ్ని యున్నదనుటకు కనబడు ధూమము హేతువు. అగ్ని లేనిదే పొగ యుండదుగదా! అమ్మవారి హృదయములో కామాగ్ని యున్నదనుటకు ఆమె కన్నులలో నీలిమ యను పొగ హేతువుగా చెప్పబడినది. కావున పూర్వార్థములోననుమానాలంకారము వ్యక్తమగు చున్నది. హిమగిరి సానువు నందు దపము జేయు శివునకమ్మ వారు మన్మథ తాపము తోడనే పరిచరించినది. ఆమెలోని మన్మథుడే దేవతల ప్రేరణము వలన బయటికి కుసుమబాణుడై వచ్చి శివునిపై బూబాణముల ప్రయోగించెను. శివుడది గ్రహించి తన మూడవ కంటిలోని యగ్నిచే వానిని గాల్చివైచెను. అమ్మవారి హృదయములోని కామాగ్ని జల్లార్చుట కదియే హిమవర్షమయ్యెను. మన్మథాగ్ని జల్లారునపుడు పైకెగసిన పొగ అమ్మవారి కన్నుల నీలిమగ రూపు ధరించెనా! అది చూచి శివునకు సంతోషమయ్యెనా? లేక మన్మథుని బాణముచే శివుడమ్మవారి పై కలిగిన కామాగ్నికి లోబడెనా?. కాని అమ్మవారక్కడ నుండి వెడలి తపము చేయు చుండెను. ఆమె హృదయములో కామాగ్ని యున్నదో లేదో చూచుటకు శివుడు వచ్చెను. తపో నియమమున కాటుక లేకున్నను అమ్మవారి కన్నులలో ౹లిమ కన్పడెను. అమ్మవారి హృదయములో కామాగ్ని నుండి ౹యలుదేరిన ధూమమున్నదని నిశ్చయించుకొని సంతోషించెనా? మొదటి ౹క్షమంగీకరించిన శివుడమ్మవారితో కలసి యుండడు. శివుడమ్మ వారితో కలసి యున్నాడు గదా! రెండవ పక్షమే సరియైనది. మన్మథుడు చావలేదని అమ్మవారి యెదలో అగ్ని రూపమున నున్నాడని తెలిసి శివుని సూర్య చంద్రులనెడి క్రింది కన్నులు సహచరుడు బ్రతికి యున్నందు కానందించినవి. మూడవ కన్నుతాను స్వయముగా గాల్చినను బూడిద గాక అమ్మవారి హృదయములో చేరి ఇంకను మండుచునే యున్నాడని తనవలెశాశ్వతముగా నుండు చున్నాడని సంతసించినది. ఈ విధముగా మూడు కన్నులును హర్షించుట యెంతో వింతగా నున్నది. ఇది పూర్వోత్తరార్థములచే వ్యక్తమయిన వింత. సహచరుని

దుఃఖముతో నానందించు వారు కొందఱుందురు. అందుకే సూర్యుడు దయించి నప్పుడు మిత్రోదయమయ్యెనని యేడ్చుచు చంద్రుడస్తాద్రి గుహలో తల దాచుకొనును. అట్లే చంద్రోదయవేళలో మిత్రుడైన సూర్యుడేడ్చుచు సప్తగిరి గుహలో తలదాచుకొనును. అగ్నికుభయోదయ కాల రూప దర్శ పూర్ణ మాసలలో నా హుతులు లభించుటచే నానందము కల్గును. అదిగాక సాయంకాలమున దనతేజమును సూర్యుడగ్ని యందుంచును. సూర్యుడగ్ని యందు మైత్రి బ్రకటించగా నగ్ని బాగుగా వెలుగు రాత్రులందే చంద్రుడు ప్రకాశించుచు అగ్నితోమైత్రీ భావమునే పొంది యున్నాడు. కావున సూర్య చంద్రులిరువురెడ మొగము పెడమొగముగా నుందురు. వారిరువురకు పై నుండి అగ్ని యా యిరువురితో మైత్రి పాటించును. మొత్తము మీద మన్మథాగ్ని సత్తా నిర్ణాయక ధూమమును జూచి శివుని మూడు కన్నులకును హర్షము కలిగెను. ఇది యెంతో వింతగా నున్నది. ఇది పూర్వోత్తరార్థముల రెంటిలో వ్యాపించి వ్యక్తమయిన వింత. ఏమైనను చంద్రాగ్నులు రాత్రి యందు వెలిగినంతగా సూర్యుడు ప్రకాశించు దినవేళ నంతగా ప్రకాశంచరు. చంద్రాగ్నులే మిక్కిలి మిత్రులుగా నుందురు. తన మిత్రుడగ్ని మన్మథాగ్ని రూపమున నమ్మవారి హృదయములో నున్నాడని నేత్రకాంతిధూమ దర్శనమున నిశ్చయించుకొన్న చంద్రుడు శివుని శిరముపై నెక్కి నాట్య మాడెనని హరిణాంకమౌలేః అను శివ వాచక పదము ప్రయోగించుటచే వ్యక్త మగును. అగ్ని ప్రకాశము సంతోషమును, అగ్ని పొగ చూరి యుండుట దుఃఖ మును సూచించు చిహ్నములు. అమ్మవారి కన్నుల నీలిమ యొక్క చాతురి యేమనగా నది ధూమ రూపమైనను శివుని మూడు కన్నుల కానందమునే కల్గించినది. అగ్నిలో నుండి అంకురము జనించదు. కాని అమ్మవారి హృదయములో నున్న కామాగ్నిలో నుండి ధూమాంకురముదయించినది. ఇది యన్నింటి కంటె నత్యంత మైన యద్భుతము. పూర్వార్థము నందలి పావకమునకు ధూమాంకురోద్భవ మొక వింత. ఉత్తరార్ధము నందలి నయనత్రయమున కొకే సారి హర్షముదయించుట యొక వింత యని చెప్పుటకు ఉత్తరార్థారంభమున అత్యంత మద్భుతమిద మను వాక్యము దెహలీదత్త దీపన్యాయమున రెండు వింతలను ప్రకాశింప జెయుచున్నది. ఉత్తరార్థమున

శివునకు అనితర సాధారణముగానయన త్రయ ముండుటయు వింతయే. ధూమము నయనములకు బాధనే కలిగించును. కాని అమ్మవారి కన్నుల నీలిమ యను ధూమము మాత్రము శివనయన త్రయమునకు హర్షమును గలిగించుట అద్భుతము కాకుండుట యెట్లు. ఇన్ని వింతలొక శ్లోకమున ప్రకాశించునట్లు శ్లోకమును రచించి మూకకవి తన ప్రతిభయే అత్యద్భుతమైన వింతగా బేర్కొను చున్నట్లనిపించు చున్నది. లేక మూకుడైన తన కాయత్యద్భుత ప్రతిభ నీయగల్గుటయే అమ్మవారొనర్చిన యద్భుత మని చెప్పుచున్నట్లనిపించు చున్నది.

అవ|| అమ్మ వారి లోచన చాతుర్యమత్యద్భుతముల నొనర్పగల దని పై శ్లోకమున జెప్పబడినది. అది చేయు మరొక యద్భుతము నీ క్రింది శ్లోకము ప్రస్తావించు చున్నది.

38. ఆరంభ లేశసమయే తవ వీక్షణస్య
కామాక్షి! మూకమపి వీక్షణ మాత్రనమ్రమ్
సర్వజ్ఞతా సకలలోక సమక్షమేవ
కీర్తిః స్వయంవరణ మాల్యవతీ వృణీతే

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, వీక్షణస్య - చూపు యొక్క, ఆరమ్భలేశ సమయే - వ్యాపార లేశకాలమునందు, క్షణ మాత్ర నమ్రమ్ - చూపుచేతనే నమ్రత నొందిన, మూక మపి - మూగను గూడ, సకలలోక సమక్షమేవ - సమస్త దేహులయెదురుగనే, సర్వజ్ఞతా - సర్వమెఱుగు శక్తి (అనుకన్య), కీర్తి - కీర్తి (యనుకన్య), స్వయంవరణ మాల్యవతీ - స్వయముగా వరించుటకై మాల గలదై, వృణీతే - వరించును.

తా|| అమ్మవారి చూపు ప్రసరించినదో లేదో వినమ్రుడయిన మూగను కూడ సర్వజ్ఞతా కన్య, కీర్తి కన్యయు స్వయంవరమాలల ధరించి వరించెదరు.

వి|| కనులు దెరచు చున్నప్పుడే పూర్తిగా దెఱవక మునుపే నిన్ను చూచి వినమ్రుడయిన మూగను సర్వజ్ఞతా కీర్తి కన్యలు వరించునని కారణ ప్రవృత్తి. సమకాలముననే కార్యప్రవృత్తి జరిగినట్లు లీశ్లోకమున చెప్పబడినది. కీర్తి

సర్వజ్ఞతలను జెప్పుటకు స్త్రీ లింగ శబ్దముల బ్రయోగించుటచే కన్యకాత్వారూపము స్ఫురించు`చున్నది. కావున నిందు సాపహ్నా వాతిశయోక్త్యలంకారమున్నది. తెల్లవాఋజామున నమ్మవారిని నిద్రనుండి మేల్కొల్పుటకు అమ్మవారి దేవాలయమునకు బలువురు వచ్చిరి. వారిలో నొక మూగ యున్నాడు. మూగ యనగా వినికిడి శక్తి కూడలేని వాడు. ఏ మాటను వినలేక పోవుటచే బలుకుటకును జేతగాని వాడు జదువురాదని వైదిక విజ్ఞాన మెఋంగని వాడని వేరుగా జెప్పబనిలేదు. అమ్మవారికి నమస్కరించుట కూడ యెఋుగడు. అట్టి వాని నమ్మవారు చూచినట్లున్నది. కాదు అట్టివాడమ్మవారిని జూచినాడు. వెంటనే వాడు సర్వజ్ఞతను బ్రకటించుచు మాట్లాడినాడు. ఆతని వాక్కులు వాగ్దేవీ విలాసములు గానున్నవి. ఈ విషయము వెంటనే జగత్ప్రసిద్ధ మాయెను. ఇది యంతయు మూకకవి స్వానుభవమును వలె జెప్పుచున్నాడని లేక యట్టి మరొక సంఘటనము నాతడు జూచి స్వానుభవమును జ్ఞప్తికి దెచ్చు కొన్నాడని సకల లోక సమక్షమేవ అనుటచే (దెలియుచున్నది. ఆ వచ్చిన పెక్కుఋ లోకులలో నొక మూకయున్నాడని మూక-లోక శబ్ద ప్రయోగముచే స్ఫురించు చున్నది.

39. కాలామ్బువాహా ఇవ తే పరితాపహారీ
కామాక్షి! పుష్కర మధః కురుతే కటాక్షః
పూర్వః పరం క్షణరుచా సముపైతి మైత్రీ
మన్యస్తు సంతతరుచిం ప్రకటీకరోతి

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, పరితాపహారీ - సంతాపమును హరించు, తే - నీ యొక్క, కటాక్షః - క్రీగంటి చూపు, కాలాంబువాహా ఇవ - వర్షాకాల మేఘము వలె, అథఃకురుతే - ముకుళింపజేయు చున్నది, పుష్కరమ్ - కమలమును, పూర్వః పరం - మొదటిది (కాలామ్బువాహము) మాత్రము, క్షణ రుచా - క్షణకాలము వెలుగు (విద్యుత్తు) తో మైత్రీం - స్నేహమును, సముపైతి - పొందు చున్నది, అన్యః తు - మఱొకటి (కటాక్షము) మాత్రము, సన్తత రుచిమ్ - ఎడతెగని కాన్తిని, ప్రకటీకరోతి - ప్రకటించు చున్నది.

తా॥ అమ్మవారి చూపు వర్షాకాలమేఘము వంటిది. అమ్మవారి చూపును వర్షాకాల మేఘమును పరితాపమును హరించు నట్టివే. కాని భేదమేమనగా వర్షాకాల మేఘము క్షణకాలము మెఱసి నశించు మెఱుపుతో స్నేహమొనర్చు చుండగా అమ్మవారి కటాక్షము మాత్రము నిరంతర కాంతిని ప్రకటించు చుండును.

వి॥ కాలామ్బువాహ కటాక్షములకు పరితాప హరణము అను సామాన్య ధర్మము నాశ్రయించి యుపమానోపమేయ భావము చెప్పబడి పిమ్మట వానిలో కాలామ్బువాహమున క్షణకాంతి సంబంధము కటాక్షమునకు సంతతకాంతి సంబంధము అను వైషమ్యము అనగా విశేషము చెప్పుటచే నీ శ్లోకమున వ్యతిరేకాలంకారము గలదు. కాలామ్బువాహ కటాక్షములకు పుష్కరాధః కరణ రూప సమాన ధర్మము కూడ కలదు. కాలామ్బువాహ మంతరిక్షమున నుండుటచే సరోవరము నందలి పుష్కరము వికసించియుండినను అధః కృతమైనట్లే, సూర్యున కాచ్ఛాదకరమై కాలామ్బువాహము తనకు తన హితునకు మధ్య యవనికగా నుండుటచే కమలము తన ప్రియుడు కనబడక పోవుటచే తల వంచుకొనియే దిగులు పడుచుండును. స్వాధీన వికాసము కల అమ్మ వారి కటాక్షము పరాధీన వికాసము కల కమలమునధః నదః కరించుట యుచితముగనే యున్నది. కాలామ్బువాహము జల వర్షము కురిపించునట్లు అమ్మవారి కటాక్షము కరుణా వర్షము కురిపించి భక్తులను శాశ్వతైశ్వర్య సంపన్నుల నొనర్చును. కాలామ్బు వాహము జనుల తాత్కాలికైశ్వర్య సంపన్నుల మాత్రమే యొనర్చును. ఈ విశేషము అమ్బువాహమునకు విశేషణమగు కాల శబ్దముచే క్షణరుచా యందలి క్షణ శబ్దము చేతను సంతతరుచిం యందలి సంతత శబ్దము చేతనే స్ఫురింప జేయబడు చున్నది.

40. సూక్ష్మేఽపి దుర్గమత రేఽపి గురుప్రసాద
సాహాయ్యకేన విచర న్నపవర్గమార్గే
సంసార పఙ్కనిచయే న పతత్యమూంతే
కామాక్షి! గాఢ మవలమ్బ్య కటాక్షయష్టిమ్

అ॥ కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, సూక్ష్మేపి - సన్నగానున్నను,

దుర్గమతరేపి - నడచిపోవుటకు మిక్కిలి కష్టమైన దైనను, అపవర్గమార్గే - మోక్షమార్గమున, గురుప్రసాద సహాయ్యకేన - గుర్వను గ్రహము యొక్క తోడ్పాటుతో, విచరన్ - నడచూచు, తే - నీ యొక్క, అమూం - ఈ, కటాక్షయష్టిమ్ - చూపనెడి కఱ్ఱను, గాఢం - గట్టిగా, అవలమ్బ్య - పట్టుకొని, సంసారపఙ్క నిచయే - సంసారమనెడి బురదల సమూహమున, న పతతి - పడడు.

తా|| మోక్షమార్గమిఱుకుగా నుండును. నడుచుటకు గష్టముగా నుండును. అయినను గుర్వనుగ్రహముతో అమ్మవారి కటాక్షమనెడి యూత కఱ్ఱను గట్టిగా పట్టుకొని నడుచువాడు ఆ మార్గమున నిటునటు నున్న బురదగుంటలలో పడకుండ గైవాల్యానంద ధామము జేరుకొనును.

వి|| మోక్షము లభింపవలెనన్న ఈశ్వరానుగ్రమున నద్వైత వాసన ముందు లభింపవలెను. ఆ యీశ్వరానుగ్రహము గురూపదిష్టమార్గమున నీశ్వరోపాసన చేసిన పిమ్మటనే లభించును. గురువుగారికడ అమ్మవారి కటాక్షమను ఊతకఱ్ఱ యున్నది. ఆ మార్గమున గైవల్యమును బ్రదికి యుండగానే చేరికొన్న జీవన్ముక్తుడైన గురువు తనకింక ప్రేమతో దేవీ కటాక్షమను యష్టిని యవసరము లేక పోవుటచే శిష్యునకొసగును. ఇది యే గుర్వనుగ్రహము. దానిని పట్టుకొని పదిలముగా నెంతటి దుర్గమ మార్గమున నైనను బ్రయాణించ వచ్చును. అది గాక గురువు తన ముందుండి మార్గము జూపుచున్నాడు గదా. కటాక్షము నందు యష్ట్యారోపముండుటచే నిట రూపకాలంకారము గలదు.

41. కామాక్షి! సంతత మసౌ హరి నీలరత్న
స్తంభే కటాక్ష రుచి పుంజమయే భవత్యాః
బద్ధోఽపి భక్తి నిగలై ర్మమ చిత్త హస్తి
స్తంభం చ బన్ధమపి ముంచతి హన్తచిత్రమ్

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, సంతతమ్ - ఎల్లప్పుడు, భవత్యాః నీ యొక్క, అసౌ - ఈ, కటాక్షరుచి పుంజమయే - క్రీగంటి

చూపుల కాంతుల సమూహమనెడి, హరినీల రత్నస్తంభే - ఇంద్రనీల మణిస్తంభమందు, భక్తి నిగలైః - భక్తి శృంఖలల చేత, బద్ధోపి - బంధింప బడి యున్నను, మమ - నా యొక్క, చిత్త హస్తి - చిత్తమను నేనుగు, స్తంభం చ - స్తంభమును, బంధం చ - బంధమును, ముంచతి - విడచు చున్నది, హన్త - ఆహా, చిత్రమ్ - విచిత్రము.

తా|| అమ్మవారి కటాక్ష కాంతి పుంజమనెడి స్తంభము నందు భక్తి శృంఖలలచే నా మనస్సనెడి ఏనుగు బంధించబడి యున్నను అది స్తంభించి పోవుటను మాను కొన్నది. అట్లే బంధమును కూడ విడచి వేయు చున్నది.

వి|| స్తంభమునకు కట్టివేయబడిన వారి బంధమును వేరొకరు విడువవలెను. కాని అమ్మవారి కటాక్ష కాంతి సమూహస్తంభమున కట్టి వేయబడిన నా చిత్త హస్తి తనకు తానే సంసార బంధమును విడచి వేయు చున్నది. తమోగుణమువలన కలుగు స్తంభించిపోవుట యను గుణమును విడచివైచినది. కటాక్ష కాంతి పుంజమందు స్తంభత్వ మారోపించుటచే పూర్వార్థమున రూపకాలంకారము. ఇది ఉత్తరార్థమున స్తంభ బంధ మోచనము చిత్త హస్తి తానే చేయుట విచిత్రమని చెప్పబడినది. పూర్వార్థమున భక్తి శృంఖలాబంధము చెప్పబడినది. ఉత్తరార్థమున సంసార బంధమోచనము చెప్పబడినది. ఏ బంధము యొక్క మోచనమో చెప్పబడక పోవుటచే నేర్పడిన విరోధము సంసారమును ఆక్షిప్తార్థముగ చెప్పుకొనుట చే పరిహృత మగు చున్నది. అట్లే పూర్వార్థమున కటాక్ష రుచి పుంజము నందు స్తంభత్వారోపమున్నది. ఉత్తరార్థమున స్తంభమను తమోగుణ విశేషము యొక్క మోచనమని శ్లేష వలన లభించిన యర్థాంతరముచే అది ఏ స్తంభమో తెలియక ముందు కలిగిన విరోధము పరిహరింపబడుటచే నీశ్లోకమున రూపకాను ప్రాణిత విరోధాభాసాలంకారమున్నది. అపి హంత చిత్రమ్ అను పదములచే విరోదాభాసాలంకారము వాచ్యమైనది. ఇంద్ర నీలమును చెప్పుటకు బదులు హరినీలమనుటచే అమ్మవారి కటాక్ష పుంజ స్తంభమున సింహత్వము స్ఫురించు చున్నది. సింహము అను స్తంభమునకు ఏనుగు కట్టివేయబడుట యను విరోధమే కాక

అమ్మవారి కటాక్ష రుచి పుంజము నందు విష్ణ్వభేదాపత్తి విష్ణువు గజేంద్ర బంధమోచన వృత్తాంతము శబ్దశక్తి మూలమున స్ఫురించు చున్న వస్తు ధ్వనులుగా నీ శ్లోకమున నున్నవి.

అవ|| పై శ్లోకమున విరోధాభాస మున్నది. అటువంటిదే మరొక విరోధ మీశ్లోకమున ప్రస్తావించ బడుచున్నది.

43. కామాక్షి! కార్ష్ణ్య మపి సంతత మంజనం చ
బిభ్ర న్నిసర్గతరలోఽపి భవత్కటాక్షః
వైమల్యమన్వహ మనంజనతాం చ భూయః
స్థైర్యం చ భక్త హృదయాయ కథం దదాతి

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, కార్ష్ణ్యం చ - నల్లదనమును, సంతతమ్ - ఎల్లప్పుడు, అంజనం చ - కాటుకను, బిభ్రన్ - ధరించు చున్న, నిసర్గతరలః అపి - సహజ చంచలమైనను, భవత్కటాక్షః - నీ కడగంటి చూపు, అన్వహం - ఎల్లప్పుడు, వైమల్యమ్ - నిర్మలత్వమును, అనంజనతాం చ - అకలంకత్వమును, భూయః - మాటి మాటికి, భక్తహృదయాయ - భక్తుని యెదకు, స్థైర్యం చ - స్థిరత్వమును కూడ, కథమ్ - ఎట్లు, దదాతి - ఇచ్చు చున్నది.

తా|| అమ్మవారి కటాక్షము నల్లని దయ్యు స్వచ్ఛతను, సాంజన మయ్యు నిరంజనత్వమును, చంచలమయ్యు స్థైర్యమును భక్త హృదయమునకు నెట్లు గూర్చు చున్నది.

వి|| మాహాత్మ్యతిశయముచే విరోధముపరిహరింప బడుటచే విరోభాసాలంకారము కలదు.

43. మన్దస్మిత స్తబకితమ్మణి కుండలాంశు
స్తోమ ప్రవాలరుచిరం శిశిరీకృతాశమ్
కామాక్షి! రాజతి కటాక్షరుచేః కదమ్బ
ముద్యాన మమ్బ కరుణా హరిణేక్షణాయాః

అ|| అమ్బ! - అమ్మా, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, మన్దస్మిత స్తబకితమ్ - చిఱునవ్వే పూల గుత్తులుగా గల, మణి కుణ్డలాం - మణి కుండలముల యొక్క, అంశుస్తోమ - కాంతి సమూహ మనెడి, ప్రవాల - చిగుళ్ళతో, రుచిరమ్ - అందమైన, శిశిరీకృతాశమ్ - చల్లబఱచిన దిక్కులు గల కటాక్షరుచామ్ - కడగంటికాంతుల యొక్క, కదమ్బమ్ - సమూహము, కరుణా హరిణేక్షణాయాః - కరుణయను సుందరికి, ఉద్యానమ్ - తోటగా, రాజతి - ప్రకాశించు చున్నది.

తా చిఱునవ్వులే పూలగుత్తులుగా, మణికుండల కాంతులే చిగుళ్ళుగా దిక్కుల జల్లబఱచునట్టి అమ్మవారి కటాక్ష కాంతి కదంబము కరుణా సుందరి విహరించు తోటగా ప్రకాశించుచున్నది.

వి|| అమ్మవారి కటాక్ష కాంతి కదమ్బ మీ శ్లోకమున నుద్యానముగా రూపింపబడు చున్నది. విషయము కటాక్ష కాంతి కదమ్బము. విషయి ఉద్యానము. విషయ ధర్మములైన మందస్మితములు. మణి కుండలాంశు స్తోమములు విషయి ధర్మములైన పూలగుత్తులుగా చిగుళ్ళుగా రూపించబడినవి. కరుణయే యా యుద్యానమున విహరించు సుందరిగా రూపింప బడినది. కావున నిందు సావయవరూపకాలంకారము కలదు.

44. కామాక్షి! తావక కటాక్ష మహేన్ద్రనీల
సింహాసనం శ్రితవతో మకరధ్వజస్య
సామ్రాజ్య మంగల విధౌ మణికుణ్డలశ్రీ
ర్నీరాజ నోత్సవ తరంగిత దీపమాలా

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తావక కటాక్ష మహేన్ద్ర నీల సింహాసనమ్ - నీ కటాక్ష మనెడి యింద్ర నీలమణి సింహాసనమును, శ్రిత వతః - ఆశ్రయించిన, మకరధ్వజస్య - మన్మథుని యొక్క, సామ్రాజ్య మఙ్గల విధౌ - సామ్రాజ్య పట్టాభిషేక కర్మయందు, మణికుండల శ్రీః - మణికుండల కాంతి, నీరాజనోత్సవ తరఙ్గిత దీపమాలా - నీరాజనోత్సవమున బొంగిన దీపమాలగా, రాజతి - ప్రకాశించు చున్నది.

తా|| అమ్మవారి కటాక్షము మహేన్ద్రనీలమణి నిర్మిత సింహాసనము.

దానిని మన్మథుడెక్కెను. అప్పుడు వానికి పట్టాభిషేక కర్మ జరిగెను. ఆ కర్మ చివఱ నీరాజన దీపమాలగా అమ్మవారి మణి కుండల కాంతి రూపొందెను.

వి|| సంభావనా వాచకములైన ఇవాది పదములే వియు లేకుండ అమ్మవారి కటాక్ష సింహాసన మెక్కిన మన్మథుని పట్టాభిషేక కర్మ యందు మణి కుండల కాంతి నీరాజనోత్సవ దీపమాలగా నుత్ప్రేక్షింపబడుటచే నీ శ్లోకమున రూపకానుప్రాణిత గమ్యోత్ప్రేక్షాలంకారము గలదు.

45. మాతః క్షణం స్నపయ మాంతవ వీక్షితేన
మన్దాక్షితేన సుజనైరపరోక్షితేన
కామాక్షి! కర్మతిమిరోత్కర భాస్కరేణ
శ్రేయస్కరేణ మదుపద్యుతి తస్కరేణ

అ|| మాతః - అమ్మా, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, మధుపద్యుతి తస్కరేణ - తుమ్మెదల కాంతిని దొలగించు, శ్రేయస్కరేణ - శుభముల గలిగించు, కర్మతిమిరోత్కరభాస్కరేణ - కర్మలనెడి చీకట్ల గుంపునకు సూర్యుడైన, మన్దాక్షితేన - సిగ్గిలిన, సుజనైః - మంచివారిచేత, అపరోక్షితేన - సాక్షాత్కరింప జేసి కొనబడిన, తవ - నీ యొక్క, వీక్షితేన - చూపు చేత, క్షణం - కొంచెము సేపు, మాం - నన్ను, స్నపయ - తడుపుము.

తా|| ఓ కామాక్షీదేవీ! నీ చూపు కర్మాంధకారము బాపుటలో సూర్యుడు తుమ్మెదల కాంతి నపహరించు దొంగయునైనట్టిది. అది శ్రేయస్సుల కలిగించునది. సిగ్గుతొణికిసలాడు నట్టిది. సుజనులెప్పుడు దానిని సాక్షాత్కరించు కొను చుందురు. అట్టి చూపుచేత నో తల్లీ! నన్ను క్షణకాలము స్నానమాడింపుము.

వి|| తుమ్మెద మధువు ద్రాగును. మధువు త్రాగువారి దగ్గఱనున్న దానిని అపహరించుట సులభము. మధుపాయి దగ్గరనున్న దానిని దొంగిలించిన వాడిక మధువు ద్రాగలేడు. వాని దురభ్యాసము మానుట కిది యొక మార్గము. మధువనగా విషయ సుఖము. స్త్రీ రూపము కూడ మధువే. దానిని ద్రావు జీవుని చూపు నపహరించినచో వాడిక స్త్రీ రూప మధువు గ్రోలడు. తుమ్మెద

కాంతిని అమ్మవారి కన్ను అపహరించు దొంగ యని అమ్మవారి చూపునందు దొంగతనమారోపింపబడినది. తుమ్మెద యనుటకు మధుపశబ్దమును ప్రయోగించుటచే బై యర్థము స్ఫురించు చున్నది. మధు పద్యుతి తస్కరేణ యను సమాసమున కిది వివరణము. అమ్మవారి చూపు కర్మతిమిరోత్కర భాస్కరము. కర్మమార్గము గహనము *గహనా కర్మణోగతిః* అని భగవద్గీత చెప్పు.చున్నది. భక్తి మార్గము నందు శ్రవణాది కర్మలున్నను ప్రత్యవాయము లింతగా నుండవు. యజ్ఞాది కర్మలు ప్రత్యావాయబహులములు వాని ఫలముగా లభించు స్వర్గాది లోకము లనిత్యములు. కర్మమార్గముతో బోల్చినప్పుడు భక్తి మార్గము సులభతరము కర్మ మార్గము శుభకరమే అయినను భక్తి మార్గము శ్రేయస్కరము. భక్తి మార్గమున లభించు వైకుంఠాది లోకములు నిత్యములు, కాకపోయినను కైవల్య రూపములు కాక పోయినను అటకు జేరిన వారు కూడ వెనుకకు మాత్రము రారు. ఆలోకముల యంతమందు లోకాధిపతి తనలోకమునకు వచ్చిన వారికి తత్త్వమసియను వాక్యమునుపదేశించును. అప్పుడు కైవల్యము కలుగును. కావున భక్తి మార్గమందు పునరావృత్తి లేదు. కర్మ మార్గమందట్లు కాదు. *గతాగతం కామ కామాలభంతే* అని సకామకర్మ మార్గమును భగవద్గీత నిందించినది. అందుచేత నిది తిమిరముగా రూపింపబడినది. దానికి భాస్కరుడుగా నమ్మవారి చూపు రూపింప బడినది. నిష్కామ కర్మ మార్గము చిత్తశుద్ధి జననము అది యక్కడ తిమిరముగా చెప్పబడలేదు. సకాలకర్మ మార్గమే తిమిరోత్కరము. దానికమ్మవారి చూపు భాస్కరుడు. అమ్మవారి యొక కన్నొటైనను ఆరోపణము లేకున్నను అది సూర్యుడే. కాని సూర్యుడుగా కన్పడక విగ్రహము నందు కన్నుగా గన్పడుటచేత అది యట సూర్యుడుగా రూపింప బడినది. కావున వీ సమాసమున రూపకాలంకారమున్నది. అమ్మవారి వీక్షితము దృగ్రూపము. జగమంతయు దృశ్యము. ఆత్మను దృగ్రూపమందురు. సుజనులు అమ్మవారి చూపున పరోక్ష మొనరించు కొని నారనగా స్వాత్మ బ్రహ్మైక్య జ్ఞానముపొందినారన్నట్లే అపరోక్షిత శబ్ద ప్రయోగము మిక్కిలి చమత్కారజనకము. సాధారణముగా ప్రత్యక్షము అపరోక్షము అను శబ్దములనే కార్థముగా వాడెదరు. ప్రత్యక్ష మనగా ఇంద్రియము లేక ఇంద్రియ జన్యజ్ఞానము. అపరోక్షమనగా స్వయం ప్రకాశ జ్ఞానము. అది ప్రత్యక్షమను ఇంద్రియమునే కాదు మరి యే అను మానా దీతర ప్రమాణమును అపేక్షింపదు.

కావున అపరోక్షిత మనగా స్వయం ప్రకాశమైన యాత్మజ్ఞానమే. బ్రహ్మాత్మైక్య విజ్ఞానస్వరూపమే బ్రహ్మాత్మైక్య విజ్ఞానము తత్త్వమస్యాది వాక్య జన్య జ్ఞానము కదా. అది యపరోక్షిత మెట్లను ప్రశ్న జనించును. సమాధానమే మనగా నా జ్ఞానము వృత్తి వ్యాప్యత్వాంశము నందే వాక్య జన్యము. ఫలవ్యాప్యత్వాంశమున నది వాక్య జన్యముగాదు. కావున నది యపరోక్షితమే. సుజనులకు మాత్రమే బహు జన్మాంతమున నీజ్ఞానము కలుగును. సుజనై రపరోక్షితేన అను మాటచే నా యర్థమంతయు స్ఫురింప జేయబడినది. అన్ని జ్ఞానముల వలె మహావాక్యజన్య బ్రహ్మాత్మైక్యజ్ఞానము కూడ క్షణికమే. అన్ని యితర జ్ఞానములు అనాది తూలా విద్యను నివారించినట్లు ఇది మూలా విద్య నివారింప జేయును. కావుననే యిట మూకకవి క్షణం స్నపయ క్షణకాలము నీ చూపును నా మీద వర్షింపుము. అను చున్నాడు. అమ్మవారి చూపు మందాక్షితము. శివుని సాన్నిధ్యమున నది సిగ్గిల్లుట చేనిట నది మందాక్షితేన అని పేర్కొనబడినది. అమ్మవారి చూపు శ్రేయస్కరేణ అని విశేషింప బడినది. శ్రేయస్సనగా నిత్యసుఖము. అనిత్య సుఖము ప్రేయస్సనబడును. కఠోపనిషత్తునందు శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః అని చెప్పబడినది. శ్రేయస్సు ప్రేయస్సు ఈ రెంటిలో సుజనులే శ్రేయస్సునెన్నుకొందురు. అందుకై సుజనులమ్మవారి చూపు నవలంబించి శ్రేయస్సు నందుదురు. ఇతర దేవతా కటాక్షము ప్రేయస్సు నొసంగునే కాని శ్రేయస్సు నొసంగదు. పరదేవతా కటాక్ష మందుచే శ్రే యస్కరము. శ్రేయస్సనగా నిత్య సుఖమైన మోక్షమే. అది బ్రహ్మాత్మైక్య జ్ఞాన రూపమే. అది అనాది దుఃఖము నివారించి నిత్యము కైవల్య రూపము నైన మహానందము నొసంగును. పరదేవతా కటాక్షమ పరోక్షితము కానిదే ఈ మహానందము లభించదు. అందుచే సుజనులమ్మవారి కటాక్షమున పరోక్షిత మొనరించు కొనగోరుదురు. సుజనుల కోర్కె నమ్మవారి కటాక్షము తీర్చును. అది వారి కపరోక్షిత మగును. అది యే చరమ పురుషార్థము. అనాది సంసార మహా దుఃఖ నివృత్తి రూపము భాస్కరేణ శ్రేయస్కరేణ తస్కరేణ" అను పదాన్తము లందను ప్రాస రూప శబ్దాలంకారము కలదు.

46. ప్రేమాపగాపయసి మజ్జన మారచయ్య
యుక్త స్మితాంశు కృత భస్మ విలేపనశ్రీః

కామాక్షి! కుణ్డల మణి ద్యుతిభి ర్జటాలః
శ్రీకణ్ఠమేవ భజతే తవ దృష్టి పాతః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, దృష్టిపాతః - చూపు, ప్రేమాపగాపయసి - ప్రేమయను నది నీటిలో, మజ్జనం - స్నానమును, ఆరచయ్య - చేసి, యుక్త - కూడిన, స్మిత - చిఱునవ్వు యొక్క, అంశు - కాంతి చే, కృత - చేయబడిన, భస్మవిలేపన - బూడిద పూత యొక్క, శ్రీః - కాంతి కలదై, కుణ్డల మణి ద్యుతిభిః - కుండల మణి కాంతులచే, జటాలః - జడల దాల్చినదై, శ్రీకణ్ఠమ్ ఏవ - శివునే, భజతే - సేవించు చున్నది.

తా||ప్రేమయను నది నీట స్నాన మొనరించి చిఱునవ్వు కాంతి యనెడి బూడిద పూతతో ప్రకాశించు చున్నదై కుండల మణి కాంతులనెడి జడల దాల్చి నీ చూపు శివునే సేవించు చున్నదో కామాక్షీ దేవీ!

అవ|| పై శ్లోకమున శివైక్యరూపమైన శ్రేయస్సు ప్రస్తావించబడినది. ఈ శ్లోకమున శ్రేయస్సాధనమైన శ్రీ కన్ఠభజనము ప్రస్తావింపబడు చున్నది.

వి|| నారుద్రోరుద్ర మర్చ్ఛయేత్ అనునది శాసనము. రుద్రుడు కాని వాడు రుద్రునర్చింప గూడదని యర్థము. అందుచేతనే శివభక్తులు శివుని వలె భస్మము, జడల ధరించెదరు. అమ్మ వారి చూపు కూడ శివ దీక్ష గైకొన్నట్లు నదిలో స్నానమొనరించినది. ఆనది యేనది? ప్రేమాపగ భస్మ మేది? చిఱునవ్వు కాంతినే భస్మముగా ధరించినది. జడలేవి? కుండల కాంతులనే జడలుగా ధరించినది. వీని వలన నమ్మవారి చూపునకు రుద్రత్వము వచ్చినట్లే. అనగా రుద్రవేష ధారణము పూర్తి యైనది. ఆపైన శివుని సేవించు చున్నది. పై శాసనము పాటించి శివదీక్ష గైకొని శివుని వలె భస్మజటా ధారియై అమ్మవారి దృష్టి శివుని చూచినది. అట్లు కాకుండ జూచినచో ఆ చూపును శివుడంగీకరించ డేమో. అందుకే యామె చూపట్లు చేసినది. కటాక్షము నందు లేని శివదీక్షయున్నట్లు వర్ణింప బడుటచే నీ శ్లోకమున నతిశయోక్త్య లంకారము కలదు.

అవ|| శ్రీ కంఠుని భజించు నమ్మవారి చూపే స్వయముగా కైవల్యము

నొసగు నట్టిదని ఈ శ్లోకమున జెప్పబడుచున్నది.

47. కైవల్యదాయ కరుణారస కింకరాయ
కామాక్షి! కన్దలిత విభ్రమ శంకరాయ
ఆలోకనాయ తవ భక్త వశంకరాయ
మాతర్నమోఽస్తు పరతన్త్రిత శంకరాయ

అ॥మాతః - అమ్మా, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, కైవల్యదాయ - కైవల్యమునొసగునట్టి, కరుణా రసకింకరాయ - కరుణారసము సేవకముగా గలిగిన, కన్దలిత విభ్రమ శంకరాయ - అంకురించిన విలాసములచే సుఖమును గలిగించు, భక్తవ శంకరాయ - భక్తులు వశంకరులుగా గలిగిన, పరతన్త్రిత శంకరాయ - పరతన్త్రుడుగా మార్చబడిన శంకరుడు గల, తవ - నీ యొక్క, ఆలోకనాయ - చూపుకొఱకు, నమః - నమస్సు, అస్తు - అగుగాక.

తా॥ కైవల్యము నొసగునట్టి, ఏమిచేయు మనిన నదియే చేయునట్టి కరుణా రసముగల అంకురించిన విలాసములచే సుఖమును కలిగించు భక్తులకు వశమైన శంకరుని తనకు వశమొనరించు కొనిన నీ కటాక్షమునకో కామాక్షీ దేవీ! నేను నమస్కరించు చున్నాను.

వి॥ నాలుగు పాదముల చివఱ కరాయ అను శబ్దముండుటచే నీ శ్లోకమున పాదాంతాను ప్రాసము కలదు.

48. సామ్రాజ్య మఙ్గల విధౌ మకరధ్వజస్య
లోలాలకాలికృత తోరణ మాల్య శోభే
కామేశ్వరి! ప్రచల దుత్పల వైజయన్తీ
చాతుర్యమేతి తవ చంచల దృష్టిపాతః

అ॥ కామేశ్వరి! - ఓ కామేశ్వరీ దేవీ!, లోల - చంచలములైన, అలక - ముంగురుల, అలి - వరుస చేత, కృత - చేయబడిన, తోరణ మాల్య - తోరణ రూపమాలల యొక్క, శోభే - కాంతి గల, మకరధ్వజస్య - మన్మధుని యొక్క, సామ్రాజ్య మంగల విధౌ - సామ్రాజ్యార్పణ శుభ కర్మ యందు, తవ - నీ యొక్క, చంచల దృష్టి పాతః - చంచలమైన దృక్ప్రసారము,

ప్రచలత్ - కదలు చున్న ఉత్పల - కలువల, వైజయంతి - పతాక యొక్క, చాతుర్యమ్ - నైపుణ్యమును. ఏతి - పొందు చున్నది.

తా|| ముంగురులే తోరణ మాలలైన మన్మథుని సామ్రాజ్యార్పణోత్సవము నందమ్మ వారి చంచల దృక్ప్రసారమే కదలుచున్న కలువల పతాక వలె ప్రకాశించు చున్నది.

వి|| అమ్మ వారి చంచల కటాక్షము నందు మన్మథుని సామ్రాజ్యార్పణోత్సవమున బతాక ధర్మ మారోపింప బడుటచే పదార్థ వృత్తి నిదర్శనాలంకార మున్నది.

49. మార్గేణ మంజు కచకాన్తి తమో వృతేన
మన్దాయ మాన గమనా మదనాతురాసౌ
కామాక్షి దృష్టి రయతే తవ శంకరాయ
సంకేత భూమి మచిరా దభిసారికేవ

అ|| కామాక్షి! - ఓ కామాక్షి దేవీ!, మంజు - అందమైన, కచ - కురుల యొక్క, కాన్తి - కాంతి యనెడి, తమః - చీకటితో, వృతేన - కూడిన, మార్గేణ - దారిలో, మన్దాయమాన గమనా - మెల్లనగుచున్న నడక గలదై, మదనాతురా - కామాధిక్యముచే పీడితురాలై, తవ - నీ యొక్క, దృష్టిః - చూపు, శంకరాయ - శంకరునికొఱకై, అచిరాత్ - వేగముగా, అభిసారిక ఇవ - అభిసారికవలె, సంకేత భూమిమ్ - ఏర్పఱచుకొన్న సంగమ ప్రదేశమును గూర్చి, అయతే - పోవు చున్నది.

తా|| ముంగురుల చీకటి ముసిరిన దారిలో కామాక్షి యైన అమ్మ వారి చూపు శంకరుని సంగమునకై తమోభిసారిక వలె సంకేతభూమికి పోవు చున్నట్లున్నది.

వి|| అమ్మవారి చూపు నందు దమోభిసారికాత్వముత్ప్రేక్షింప బడుటచే నీ శ్లోకమున నుత్ప్రేక్షాలంకారము ఇవ శబ్దముచే వాచ్యమైయున్నదు.

50. వ్రీడాను వృత్తి రమణీ కృత సాహచర్యా
శైవాలితాం గలరుచా శశి శేఖరస్య

కామాక్షి! కాన్తి సరసీం త్వదపాఙ్గలక్ష్మీ
ర్మన్దం సమాశ్రయతి మజ్జన ఖేలనాయ

అ॥కామాక్షి! - ఓ కామాక్షీ దేవి!, వ్రీడాను వృత్తి రమణీ - లజ్జా యనెడి దాసిచేత, కృత - చేయబడిన, సాహచర్యా - సహచరణము గల, త్వద పాంగలక్ష్మీః - నీ కడగంటి లక్ష్మి, శశిశేఖరస్య - చంద్రా వతంసుని (శివుని) యొక్క, గలరుచా - కణ్ఠకాన్తి చేత, శైవాలితామ్-నాచేర్పడిన, కాన్తిసరసీమ్- కాన్తి యనెడి సరస్సును, మజ్జన ఖేలనాయ - జలక్రీడ కొఱకు, మన్దమ్ - మెల్లగా, సమాశ్రయతి - ఆశ్రయించు చున్నది.

తా॥ లజ్జయను దాసితో కలసినడుచునట్టి యమ్మవారి కడగంటి కాంతి యనెడి రాణి శివుని కంఠకాన్తి యనెడి నాచు గల కాన్తి యనెడి సరస్సును స్నానమాడి వినోదించుటకొఱకు జేరు చున్నది.

వి॥ అమ్మవారి కటాక్ష లక్ష్మి రాజ్ఞీత్వము స్ఫురింపజేయుటకై లజ్జ యందు అనుచరీత్వ మారోపింపబడినది. శివుని కంఠకాన్తి యందు శైవాలత్వము శివుని దేహకాంతి యందు సరసీత్వ మారోపింపబడినది. అందుచేత నీశ్లోకమున రూపకాతిశయోక్త్యలంకారము కలదు.

51. కాషాయ మంశుక మివ ప్రకటం దధానో
మాణిక్య కుణ్డల రుచిమ్మమతా విరోధీ
శ్రుత్యంత సీమని రతః సుతరాం చకాస్తి
కామాక్షి! తావక కటాక్ష యతీశ్వరోఽసౌ

అ॥ కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, కాషాయమ్ అంశుకమ్ ఇవ - కాషాయ వస్త్రము వంటి, మాణిక్య కుండల రుచిమ్ - మణి కుండల కాంతిని, ప్రకటమ్ - బహిరంగముగా, దధానః - ధరించుచు, మమతా విరోధీ - మమకారమును విరోధించు, శ్రుత్యంత సీమని - చెవి చివఱి ప్రదేశమున (వేదాంతసీమ యందు), రతః - ఆసక్తికల, అసౌ - ఈ, తావక కటాక్ష యతీశ్వరః - నీ కటాక్షమను యతీశ్వరుడు, సుతరామ్ - మిక్కిలి, చకాస్తి - ప్రకాశించు చున్నాడు.

తా॥ అమ్మవారి కటాక్షమను యతీశ్వరుడు మాణిక్య కుండల కాంతి నే కాషాయాంబరముగా ధరించి మమకారము లేని వాడై వేదాంత సీమలో నాసక్తుడై మిక్కిలి ప్రకాశించు చున్నాడు.

వి॥ మాణిక్య కుండల కాంతి యందు కాషాయాంబర త్వము కటాక్షమందు యతీశ్వరత్వము త్ప్రేక్షింపబడుటచే నీ శ్లోకమున నుత్ప్రేక్షాలంకారమున్నది. కాషాయాంబరము ధరించుట, మమకారమును విరోధించుట, వేదాంతమునం దాసక్తి వహించుట యతీశ్వర లక్షణములు. కటాక్షయతికి మాణిక్య కుండలకాంతి కాషాయాంబరమైనది. చెవి చివఱి ప్రదేశమే వేదాంత సీమ యైనది. వేదాంతములనగా ఉపనిషత్తులు. వేదముల యొక్క చివఱి భాగములు లేక వేదాంతముల సిద్ధాంతములున్న భాగములు వేదము ఋక్సా మయజురధర్వ రూపము ఋగ్వేదమునకు, యజుర్వేదమునకు, సామవేదమునకు, అధర్వ వేదమునకు బెక్కు శాఖలున్నవి. అవియన్నియు వేయికి మించి యున్నవి. వానిలో నేడు కొన్నియే మిగిలియున్నవి. ఒక్కొక్క శాఖ సంహిత, బ్రహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తు అను నాలుగు భాగములుగా నుండును. నేడు మిగిలి యున్న యుపనిషత్తులు రెండు వందలకు మించవు. బ్రహ్మ చర్యాశ్రమమున సమగ్రముగా వేదమునభ్యసింపవలెను. గృహస్థాశ్రమమున యజ్ఞాది కర్మములొనర్పవలెను. వాన ప్రస్థాశ్రమమున నుపాసనముల నొనర్ప వలెను సన్యాసాశ్రమమున లేక యత్యాశ్రమమున బ్రహ్మ విచారము పనిషద్వాక్యముల ద్వారమున మున జేయవలెను. అందుకే శ్రుత్యంత సీమనిరతః అని చెప్పబడినది. సర్వసంగ పరిత్యాగి యగు సన్యాసికి ఎవరి యందును మమకారముండరాదు. అందుకే మమతా విరోధీ యని పేర్కొనబడినది. సన్యాసాశ్రమ బహిరంగ చిహ్నము కాషాయాంబరధారణ మని వివరింప నవసరము లేదనుకొందును. కాషాయ దండ మాత్రేణ యం పూజ్యోసంశయః (అన్ని యాశ్రమముల వారికి, కాషాయాంబర దండములు గల సన్యాసి పూజ్యుడు) అని చెప్పబడినది.

52. పాషాణ ఏవ హరినీలమణిర్దినేషు
ప్రమ్లానతాం కువలయమ్ ప్రకటీకరోతి
నైమిత్తికో జలదమేచకిమా తత స్తే
కామాక్షి! శూన్యముపమాన మపాంగలక్ష్మ్యాః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, హరినీలమణి - ఇంద్ర నీల మణి, పాషాణః ఏవ - రాయియే, దినేషు - పగళ్ళయందు, కువలయమ్ - కలువ, ప్రమ్లానతామ్ - వాడి యుండుటను, ప్రకటీకరోతి - బయట పెట్టును, జలదమేచకిమా - మేఘము యొక్క నలుపు, నైమిత్తికః - (కాలము) నిమిత్తమున నేర్పడినది, తతః - అందువలన, తే - నీ యొక్క, అపాంగ లక్ష్మ్యాః - కడగంటి కాంతికి, ఉపమానము - ఉపమానము, శూన్యమ్ - లేదు.

తా|| అమ్మవారి కడగంటి కాంతికి హరినీలమణియుపమానము కాలేదు. అది ఱాయి మాత్రమే. కలువ ఉపమానము కాజాలదు అది పగలు ముకుళించు కొని పోవును. మేఘము కూడ ఉపమానము కాజాలదు. అది వర్షా కాలమందే నల్లగా నుండును. అందుచే అమ్మవారి కడగంటి కాంతి కుపమానము లేదు.

వి|| లోకమున కంటి కింద్ర నీల మణియు సమానముగా భావింపబడును. అది ఱాయి కావున దానికి దయయుండదు. అమ్మవారి కడ గన్ను దయగలిగినది. కావున దయ యెఱుగని ఇంద్రనీలమణి దాని కుపమానము కాజాలదు. అట్లే కలువను కడ కంటి కుపమానముగా జెప్పెదరు. కాని అది పగలు ముడుచుకొని యుండును. అమ్మవారి యపాంగము పగలు రాత్రి వికసించియే యుండును. కావున దానికి కలువ యుపమానము కాజాలదు. అట్లే మేఘము కూడ ఉపమానముగా కొందఱిచే భావింపబడినను అదియు అమ్మవారి యపాంగమునకుపమానము కాజాలదు. ఎందుకనగా మేఘమునకు నలుపు నైమిత్తికముగా అనగా వర్షాకాలము వచ్చినప్పుడే యేర్పడును. అమ్మవారి యపాంగమునకు నలుపు తాత్కాలిక మయినది కాదు. ఇట్లు లోకమునకు సమానముల బరిశీలించి నమ్మవారి యపాంగమునకు సమానముగా నుండ దగిన యోగ్యత దేనికిని లేదు. అన్నిటికి యేదో లోపమున్నది. వాస్తవమునకు ఉపమానమధిక గుణములు కలదిగా నుండవలెను. అధికత యట్లుంచి సమత్వము కూడ వానికి లేదు. కావున అమ్మవారి యపాంగమునకు సమానమే లేదని యెప్పుకొని ఉపమానాన్వేషణము మానకొనవలెను. అమ్మవారి యపాంగమునకు సమానమే లేదని చెప్పుటచే రెండవ వస్తువేదియు అమ్మవారి యపాంగమునకు లేదని దాని కదియే సాటి యని శూన్య శబ్దముచే ద్వితీయ సదృశ వ్యవచ్ఛేదము చెప్పబడుట

చే నిట ననన్య యాలంకారము కలదు. ఇంద్రనీల మణి సువర్లోకస్థము, మేఘము భువర్లోకస్థము, కువలయము భూలోకస్థము - మూడు లోకములలో నమ్మవారి యపాంగమునకు సాటి లేదని రెండవ పాదమందలి కు(భూ) వలయ శబ్దముచే వ్యంగ్యమగు చున్నది. అమ్మవారి సువలయమను నపాంగమునకు జాలనందుననే తనను కు (చెడ్డ) వలయముగా నిందించు కొను చున్నది. కు శబ్ద శక్తి మూలమున లభించిన వస్తు ధ్వని యిది. కువలయము (కలువ) పగలు సరే రాత్రి పూట కూడ చంద్రుడు లేనప్పుడు ప్రమ్లానమే. చంద్రుడున్నప్పుడు కూడ వృద్ధి క్షయములు కలవాడగుటచే నది చంద్రుని సంపూర్ణత లేనప్పుడు కొంత మ్లానముగానే యుండును. పగలు అది ప్రమ్లానము. రాత్రి చంద్రుని పంసూర్ణత లేనప్పుడు కొంత మ్లానము పూర్ణిమ నాడు కూడ చంద్రునకు సాఖ్య కళ లేకుండుటచే షోడశ కలాపరిపూర్ణుడు కాజాలడు. అందుచే కించిన్మానము గానే కువలయ ముండును. కావున నెప్పుడును కలువ అమ్మవారి యపాంగమునకు సాటి కాజాలదని ప్రమ్లాన శబ్దమందలి ప్ర యను ఉపసర్గము వ్యక్త మొనరించుటచే నిది ప్రశబ్ద శక్తిమూల వస్తు ధ్వని. వర్షా కాలమున జలదము వర్షించిన పిమ్మట జల దత్వమును దానితో పాటు మేచకి మను కోల్పోవును. అమ్మవారి యుపాంగ మెల్లప్పుడు కరుణా వర్షమును కురిపించుచు నల్లగానే యుండును. కావున మేఘము వర్షా కాలమున కూడ అమ్మవారి యపాంగమునకు సాటి రాజాలదని జలద శబ్దము వ్యక్త మొనర్చుటచే నిది జలద శబ్ద శక్తి మూలధ్వని. అమ్మవారి యొక కన్ను సూర్యుడు. అతడు సువర్లోకస్థుడు. మరొక కన్ను చంద్రుడు. ఆతడు పితృలోకము అనబడు భువర్లోకమున నుండువాడు. సువర్లోకమున నుండు సూర్యుడు భూర్భో వస్సువర్లోకములకు మూడింటికి తన కాంతితో సంతోషము కలిగించును. భువర్లోకస్థుడైన చంద్రుడు కువల యానందకరుడను పేరు గలవాడైనన్ను భూర్భువర్లోకముల కానందము గలిగించును. భువర్లోకమున నుండు చంద్రుడు దేవతలకాహారమైన సుధ కరములందు గలవాడగుటచే సువర్లోకమునకు నానందము కలిగించును. మహర్లోకస్థ చంద్రుడు అమ్మవారి లలాటమునలంకరించువాడు.

53. శృంగార విభ్రమవతీ సుతరాం సలజ్జా
నాసాగ్ర మౌక్తిక రుచా కృత మన్దహాసా

శ్యామా కటాక్ష సుషమా తవ యుక్తమేత
త్కామాక్షి! చుమ్బతి దిగమ్బర వక్త్ర బిమ్బమ్

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, శృంగార విభ్రమవతీ - శృంగారవిలాసములుగల, సుతరాం - మిక్కిలి, సలజ్జా - సిగ్గుతో కూడిన, నాసాగ్రమౌక్తిక రుచా - ముక్కుకొన ముత్తెపు కాంతి చేత, కృత మన్దహాసా - చిందించిన చిఱు నవ్వుగల, శ్యామా - నల్లనిదైన (యౌవన మధ్యస్థురాలైన), తవ - నీ యొక్క, కటాక్ష సుషమా - కడంగంటి కాంతి, దిగమ్బర వక్త్ర బిమ్బమ్ - దిక్కులే వస్త్రములుగా గల శివుని యొక్క ముఖ బిమ్బమును, చుమ్బతి - చుమ్బించు చున్నది.

తా||| శృంగార విలాసము లనొకవైపు సిగ్గుగా నొకవైపు ప్రదర్శించు ముక్కు కొన ముత్తెపు కాంతినే చిఱునవ్వుగా చేసి కొన్న నల్లనిదై యౌవన మధ్యస్థురాలై యున్న నీ కటాక్ష కాంతి దిగంబరుడైన శివుని ముఖ బింబమును చుంబించు చున్నది.

వి|| శృంగార విభ్రమము ప్రౌఢ యొక్క లక్షణము. అధిక లజ్జ ముగ్ధాలక్షణము. ఇవి కలసి యమ్మవారి కటాక్ష కాంతి యనెడి స్త్రీలో నున్నవనగా నామె యౌవన మధ్యస్థురాలే కావలెను. నవ్వు పెదవిని దాటకుండుట ముగ్ధా లక్షణము. స్పష్టమైన నవ్వు ప్రౌఢ లక్షణము ముక్కు కొన ముత్తెపు కాంతి చిఱునవ్వుగా నుండుటచే నా కటాక్ష సుషమ యౌవన మధ్యస్థయే. శివుని ముఖమందు చూపు నిలుపుటయే. ఇట చుమ్బనము దిగమ్బర దర్శనముచే నుద్దీప్తిమైన కామము కటాక్ష సుషమయను కాంత ప్రౌఢ వలె, చుంబించుటకు కారణమైనదని గ్రహింప వలెను.. కటాక్షసుషమ యందు నాయికా వ్యవహారము స్ఫురించుటచే నీ శ్లోకమున సమాసోక్త్యలంకార మొప్పుచున్నది.

54. నీలోత్పలేన మధుపేన చ దృష్టి పాతః
కామాక్షి! తుల్య ఇతి తే కథ మామనన్తి
శైత్యేన నిన్దతి యదన్వహ మిన్దు పాదా
న్పాథోరుహేణ యదసౌ కలహాయతే చ

అ॥ కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, దృష్టిపాతః - చూపు, నీలోత్పలేన - నల్ల కలువతో, మధుపేన - తుమ్మెదతోడను, తుల్యః - సమానము, ఇతి - అని, కథమ్ - ఎట్లు, ఆమనన్తి - చెప్పెదరు, యత్ - ఏదైతే, అసౌ - ఇది (చూపు), శైత్యేన - చల్లదనముతో, అన్వహమ్ - ఎల్లప్పుడు, ఇన్దుపాదాన్ - చన్ద్ర కిరణములను, నిన్దతి - నిందించునో, యత్ - ఎందు వలన నైతే, పాథోరుహేణ - కమలముతో, కలహాయతే, చ - కలహించుచు గూడ నుండునో.

తా॥ అమ్మవారి చూపు చంద్ర కిరణముల నిందించుటచే నల్లకలువతో సమానమని చెప్పరాదు. కమలములతో కలహించుటచే తుమ్మెదతో సమానమని చెప్పరాదు.దానితో సమానమని చెప్పుట యెట్లుకుదురును వాని కన్న గొప్పది కదా!

వి॥ నీలోత్పలము చంద్ర కిరణముల సవవికాసహేతువైనందున చంద్ర కిరణముల బ్రశంసించునే కాని నిందించదు. అమ్మవారి చూపు చంద్ర కిరణముల నిందించు చున్నది. కనుక నీలోత్పలముతో సమానమని చెప్పరాదు మధుపము కమలముతో కలహింపదు. కమలము తనకు మధువునొసగు చున్నది. అట్లుపకారము చేయు కమలముతో మధుపము ఎట్లు కలహింపగలదు. అమ్మవారి చూపు కమలముతో సౌందర్యమున బోటీ పడుచు కలహించును. కావున అమ్మవారి చూపు మధుపముతో సమానమని చెప్పరాదు. ఇట్లు నీలోత్పల మధుపములతో నైల్యహేతువున ప్రసిద్ధముగా బ్రాప్తమైన సామ్యము శ్లోకము యొక్క పూర్వోత్తర పాదములచే నిషేధింపబడినది. అమ్మవారి చూపు నందు నీలోత్పల సామ్యము నిషేధింపబడుటకు కమలముతో కలహించుటను కారణముగా చెప్పుట జరిగినది. కావున నిందు బ్రతీపాలంకారమొప్పు చున్నది. ఉపమానములందు సమానత్వము నిషేధింప బడుటచే నిట నుపమాన తిరస్కారము చెప్ప బడినట్లైనది. ఉపమాన తిరస్కారమే ప్రతీపాలంకార లక్షణము.

55. ఓష్ఠ ప్రభాపటల విద్రుమ ముద్రితే తే
భ్రూవల్లి వీచి సుభగే ముఖ కాన్తి సిన్ధౌ
కామాక్షి! వారిభర పూరణ లమ్బమాన
కాలామ్బువాహ సరణిం లభతే కటాక్షః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, ఓష్ఠ ప్రభాపటల విద్రుమముద్రితే - పెదవుల కాంతుల సమూహమనెడి పగడముల చిన్నెలు కల, భ్రూవల్లీవీచి సుభగే - తీగవంటి కనుబొమలను తరంగములు గల, ముఖకాన్తి సిన్ధౌ - ముఖము యొక్క కాన్తి యనెడి సముద్రము నందు, కటాక్షః - కడగంటి చూపు, వారిభర - జలసమూహమును, పూరణ - నింపు కొనుటకై, లమ్బమాన - వ్రేలాడుచున్న, కాలామ్బువాహ - వర్షాకాల మేఘము యొక్క, సరణిమ్ - రీతిని, లభతే - పొందు చున్నది.

తా|| పెదవులు పగడములుగా కనుబొమలు తరంగములుగా నొప్పు నమ్మవారి ముఖ కాంతి యనెడి సముద్రము నందు కటాక్షము నీరు నింపుకొనుటకై వ్రేలాడు వర్షాకాల మేఘమా యన్నట్లున్నది.

వి|| నీరు నింపు కొనుటకై వ్రేలాడు మేఘంవముతో నమ్మవారి కటాక్షముత్రేక్షింప బడుటచే నుత్ప్రేక్షాలంకారమున్నది. ముఖ కాంతి సముద్రముగా రూపింపబడి యున్నది. తన అవయవములైన ఓష్ఠ విద్రుమములకు భ్రూ తరంగములకు నారోపము కూడ నుండుటచే పై యుత్ప్రేక్షాలంకారము సావయవ రూపకాను ప్రాణితమై యున్నది.

56. మన్దస్మితై ర్ధవలితా మణి కుణ్డలాంశు
సంపర్కలోహిత రుచి స్త్వదపాంగధారా
కామాక్షి! మల్లి కుసుమై ర్నవ పల్లవైశ్చ
నీలోత్పలైశ్చ రచితేవ విభాతి మాలా

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, త్వదపాంగ ధారా - నీకడగంటి చూపులవరుస, మన్దస్మితైః - చిఱు నవ్వులచే, ధవలితా - తెల్లనిదై, మణికుండలాంశు సంపర్కలోహిత రుచిః - మణి కుండల కాంతుల సంబంధముచే నెఱ్ఱని కాంతి గలదై, మల్లికుసుమైః - మల్లె పూల చేత, నవ పల్లవైః చ - క్రొత్త చిగుళ్ళ చేతను, రచితా - కూర్చబడిన, మాలా ఇవ - హారమువలె, విభాతి - ప్రకాశించు చున్నది.

తా|| నల్లనైన అమ్మవారి క్రీగంటి చూపుల వరుస చిఱునవ్వుల చే తెల్లనిదై మణి కుండల కాంతులచే నెఱ్ఱనిదై మల్లెలతో చిగుళ్ళతో కలువలతో

కూర్చబడిన హారమో యను నట్లున్నది.

వి|| మందస్మితములు మల్లెలు. మణికుండలకాంతులు చిగుళ్ళు, అమ్మవారి చూపులు నల్ల కలువలు అను ఆరోపము లిందు వ్యక్తములై కటాక్ష ధారయందు మాలాత్వోత్ప్రేక్షణ మిందు వాచ్యమై యుండుటచే రూపకాను ప్రాణితోత్ప్రేక్షాలంకార మిందు శోభించు చున్నది.

అవ|| పూర్వ శ్లోకమున అపాంగాధార యందు మాలాత్వము త్ప్రేక్షింపబడినది. ఈ శ్లోకమున నపాంగమాల యందు దూర్వాత్వ ముత్ప్రేక్షింపబడు చున్నది.

57. కామాక్షి! శీతలకృపారస నిర్ఝరాంభ
స్సంపర్క పక్ష్మల రుచి స్త్వదపాంగమాలా
గోభి స్సదా పురరిపో రభిలక్ష్యమాణా
దూర్వా కదంబక విడమ్బన మాతనోతి

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, శీతల - చల్లనైన, కృపారస - దయారసము అనెడి, నిర్ఝరాంభః - ప్రవాహ జలము యొక్క, సంపర్క - సంబంధము కల, పక్ష్మల - ఱెప్పల యొక్క, రుచిః - కాంతిగల, త్వదపాంగ మాలా - నీ చూపుల వరుస, పురరిపోః - త్రిపురములకు శత్రువైన శివుని యొక్క, గోభిః - ఇంద్రియములను గోవుల చేత, అభిలక్ష్యమాణా - చూడబడుచున్నదై, దూర్వాకదమ్బకవిడమ్బనమ్ - గఱిక కాంతి యొక్క అనుకరణమును, ఆతనోతి - చేయు చున్నది.

తా|| అమ్మ వారి చూపుల వరుస యందు కరుణా రస ప్రవాహజలము చే దడిసిన ఱెప్పల కాంతి యున్నది. అందుచే శివునింద్రియము లనెడి గోవులచే గఱికగా చూడబడు చున్నట్లున్నది.

వి|| అమ్మవారి చూపుల వరుస యందు దూర్వాకదంబక విడంబనము త్ప్రేక్షింప బడుటచే నీ శ్లోకమున నుత్ప్రేక్షాలంకార మున్నది. దూర్వ పశువులచే తిన బడ వలెనను నాశచే చూడబడు చుండును. అట్లే శివుని యంత్రము (కన్ను)లను గోవులచే నాశచే చూడబడు చున్నందున నపాంగముల

యందు దూర్వ-త్ప్రేక్షముచిత మగుచున్నది. శివుని యింద్రియములకు గోవులకు ఆరోపము శ్లేషచే స్ఫురించు చుండుటచే నీ యుత్ప్రేక్ష రూపకాను ప్రాణితమగు చున్నది. పురాధిపతికి పశువులుండుట సహజము. కాని శివుడు పురశత్రువు. కాని ఆయన ఇంద్రియములనే గోవులే యనుట విచిత్రము. దూర్వ సాధారణముగా ప్రవాహపు టొడ్డ యందు మొలచును. అమ్మవారి కన్నులలో కృపారస ప్రవాహములున్నవి. ఱెప్పలు వాని కొడ్ల వలెనున్నవి. వాని చివఱలలో వెండ్రుకలున్నవి. అవి గఱక పోచలవలె కృపారాసాంబు బిందువులు కలిగి యున్నవి. • శివుని కన్నులను గోవులు నిరంతరమూ గఱకవైపు చూచు చున్నవనగా అమ్మవారి చూపుల యందాయన చూపులు లగ్నమై యున్నవను నంశము వ్యక్తమగు చున్నది.

58. హృత్పఙ్కజమ్మమ వికాసయతు ప్రముష్ణ
న్నుల్లాస ముత్పలరుచే స్తమసాం నిరోద్ధా
దోషానుషంగ జడతాం జగతాం ధునానః
కామాక్షి! వీక్షణ విలాస దినోదయ స్తే

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, వీక్షణ విలాస దినోదయః - కంటి విలాసమనెడు ప్రాతఃకాలము, ఉత్పల రుచేః - కలువలకాంతికి, ఉల్లాసమ్ - వికాసమును, ప్రముష్ణన్ - దొంగిలించుచున్నదే, తమసామ్ - చీకట్లయొక్క (తమోగుణ వికారముల యొక్క) నిరోద్ధా - నిరోధించునదై, జగతాం - లోకముల యొక్క, దోషానుషంగ జడతామ్ - దోషమునకు (రాత్రికి) సంబంధించిన జాడ్యమును, ధునానః - తొలగించునట్టిదై, మమ - నా యొక్క, హృత్పఙ్కజమ్ - హృదయ కమలమును, వికాసయతు - వికసింపజేయు గాక.

తా|| కలువల కాంతిని దొంగిలించునట్టి తమో వికారములనెడి చీకట్ల నణచు నట్టి దోషమనెడి రాత్రికి సంబంధించిన జాడ్యమును దొలగించునట్టి అమ్మవారి కంటి విలాసమనెడి ప్రాతఃకాలము నా హృదయ పఙ్కజమును వికసింప జేయుగాక.

వి|| కలువ కాంతిని మించుట నా కలువల కాంతి యుల్లాసమును

దొలగించుటయే. తమో వికారముల నణచుట చీకట్లను అణచుటయే. దోషవుల సంబంధమునను దొలగించుట రాత్రి సంబంధమునను దొంగిలించుటయే అను మూడు ఆరోపములు అవయవులైన అమ్మవారి వీక్షణ విలాసమునకు దినోదయమునకు ఆరోపముండుటచే నీ శ్లోకమున సావయవ రూపకాలంకారమున్నది. మొదటి ఆరోపము అర్థ శ్లేషము మీద, రెండవ ఆరోపము తమః శబ్దము యొక్క శ్లేషమీద, మూడవ ఆరోపము దోష + అనుషంగ: దోషా + అనుషంగ) దోషానుషంగ శబ్దము యొక్క శ్లేష మీద ఆధారపడి యున్నవి. అమ్మవారి యొక నేత్రము సూర్యుడే కావున ఆనేత్రము యొక్క విలాసము సహజముగనే దినోదయ మగుటచే పై రూపకాలంకారముచే స్వభావోక్త్యాలంకారము వ్యంగ్యమగు చున్నది.

అవ|| పై శ్లోకమున అమ్మవారి చూపు యొక్క విలాసము దినోదయముగా రూపింపబడినది. దినోదయ శబ్దముచే తద్విరుద్ధమైన తమః ప్రరోహ స్ఫురణము జరుగుటచే నీ శ్లోకమున అమ్మవారి చూపు తమః ప్రరోహముగా రూపింప బడు చున్నది.

59. చక్షు ర్విమోహయతి చన్ద్ర విభూషణస్య
కామాక్షి! తావకకటాక్ష తమః ప్రరోహః
ప్రత్యఙ్ముఖం తు నయనం స్తిమితం మునీనాం
ప్రాకాశ్యమేవ నయతీతి పరం విచిత్రమ్

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తావకకటాక్ష తమః ప్రరోహః - నీకడ కన్నునెడి చీకటి మొలక, చన్ద్ర విభూషణస్య - చంద్రుని అలంకారముగా ధరించిన శివుని యొక్క, చక్షుః - కంటిని, విమోహయతి - మోహింప జేయుచున్నది. స్తిమితమ్ - నిశ్చలమైన, ప్రతఙ్ముఖమ్ - అంతర్ముఖమైన, మునీనామ్ - మునుల యొక్క, నయనమ్ - కంటిని, ప్రాకాశ్యమ్ ఏవ - వెలుగునే, నయతి + ఇతి - పొందించు చున్నదనుట, పరమ్ - మిక్కిలి, విచిత్రమ్ - వింత.

తా|| అమ్మవారి కడగంటి చీకటి మొలక శివుని కంటిని మోహింపజేయుచున్నను నిశ్చలమైన అంతర్ముఖమైన మునుల యొక్క కంటిని మాత్రము వెలిగించు చున్నది.

వి|| చీకటికి మోహింపజేయుట సహజము. కాని శివుడు చంద్ర విభూషణుడు గదా! ఆ భూషణము చీకటిని దొలగింపదా? తొలగించ గలదే. కాని అమ్మవారి చూపు మొలకగా నున్నను దాని శక్తి యధికము. చన్ద్రుడమ్మవారికంటి చీకటి మొలకగా నున్నను దానిని వారింప లేక పోయెను. శివుని కన్నొకటి సూర్యుడు మరొకటి చంద్రుడు. ఇరువురు తమోనివారణమున సమర్థులే కాని వారిరువురు కలసి యొక్కటై అనగా అమావాస్యారూపము ధరించుటచే అమ్మవారి కటాక్ష తమః ప్రరోహమును వారింప లేక పోయినారు. అని చన్ద్ర విభూషణ శబ్దము నయన శబ్దగతైక వచనము వ్యక్తమొనర్చు చున్నవి. రెండు కన్నులొకటై అమ్మవారి చూపు యొక్క సౌందర్యమునకు మోహింపు చున్నవని భావము. శివుని కంటి కమ్మవారి కటాక్ష మెదురుగా నున్నదికావున శివుడామె కటాక్షమును జూచుటకై, కనులు తెఱచి బహిర్ముఖుడు కావలెను. శివుని కన్ను తెఱవ బడి యున్నను అమ్మవారి కటాక్ష తమస్సే కాన్పించు చున్నది. కాని ప్రత్యఙ్ముఖ మైన మునుల యొక్క మూసిన కంటి కమ్మవారు కటాక్షతమస్సు మొలకగానే యుండి దాని వెలుగునే ప్రసరింప జేయు చున్నది. అమ్మవారి కన్నులు కూడ సూర్య చంద్రులైనను జీకటిలోను నల్లని చీకటి మొలకలైనవి. ఆత్మ జ్యోతిర్దర్శన భాగ్యము నమ్మవారి కటాక్షమను గ్రహించు చునే యున్నది. శివుని జీవునిగా చేయుట జీవుని శివునిగా చేయుట, అమ్మవారి కటాక్షము యొక్క కృత్యములే. ఇట్లు (కటాక్ష) తమః ప్రరోహము మునుల కంటికి వెలుగును ప్రసరింప జేయుట యను విరోధము పరిహరింప బడుటచే నిందు విరోదాభాసా లంకారమున్నది. చన్ద్ర విభూషణుడైన శివుని కన్ను కూడ చంద్ర రూపమే. చంద్రుడు తమో గర్భుడు. అమ్మవారి కటాక్షతమఃప్రరోహ సౌందర్యమును జూచి శివుని కంటిలోని తమస్సు పైకి బ్రసరించినదేమో మోహమును బొందినది. తమ వారి జూచినప్పుడు త్సాహముతో పొంగి పోవుట విరోధి దర్శనముచే క్రుంగి పోవుటయు సహజములే. అందును లేత మనస్సులోని తమస్సు యొక్క మొలకను జూచి సజాతీయు లానంద పడకుండ నెట్లుందురు? మరియు నమ్మవారి కటాక్ష తమః ప్రరోహమును జూచి శివుని కన్ను చెదరినది. కన్ను చంచలమైనప్పుడు మోహమును పొందుట మరియు సహజము. మునుల మనస్సు కటాక్షతమః ప్రరోహమున కభిముఖముగాక ప్రత్యఙ్ముఖత్వమును స్థిమితత్వమును అనగా మూసికొనిపోయి

నిశ్చలత్వమును పొందుటచే లోని పరంజ్యోతి దర్శన మిచ్చినది. అది అమ్మవారి కటాక్ష ప్రసాదానుగ్రహ ఫలము.

60. కామాక్షి! వీక్షణరుచా యుధి నిర్జితం తే
నీలోత్పలం నిరవశేష గతాభిమానమ్
ఆగత్య తత్పరిసరం శ్రవణావతంస
వ్యాజేన నూన మభయార్థన మాతనోతి

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, తీక్షణరుచా - కంటి కాంతి తెత, యుధి - యుద్ధమునందు, నిర్జితం - ఓడింపబడిన, నీలోత్పలమ్ - నల్ల కలువ, నిరవశేషగతాభిమానమ్ - పూర్తిగా పోయిన అభిమానము కలదై, తత్పరిసరమ్ - దాని (వీక్షణము యొక్క) సమీపమును, ఆగత్య - చేరి, శ్రవణావతంస వ్యాజేన - శ్రవణాలంకారమును, నూనమ్ - నిశ్చయముగా, అభయార్థనమ్ - అభయయాచనమును, ఆతనోతి - చేయయుచున్నది.

తా|| ఓ కామాక్షీ దేవీ! నీ కంటి కాంతితో యుద్ధము చేసి యోడి పోయిన నీలోత్పలము అభిమానము వీడి ఆ కంటికి సమీపమునకు వచ్చి చెవి కలంకారముగా నుండి యా నెపమున దనకభయము నీయుమని వీక్షణమును నిశ్చయముగా వేడు కొనుచున్నదేమో యన్నట్లున్నది.

వి|| నీలోత్పలము యుద్ధమున నమ్మవారి కంటిచే నోడిపోయి యున్నదట. ఇంకను బీడింపకుండ శ్రవణావతంస రూపమున వీక్షణ పరిసరమున నున్న. చెవి నాశ్రయించి వీక్షణముతో తన కభయము నీయగోరినట్లు త్ప్రేక్షణ ముండుటచే నీ శ్లోకమున నుత్ప్రేక్షాలంకారము "నూనమ్" అను పదముండుటచే వాచ్యమైయున్నది.

61. ఆశ్చర్య మమ్బ మదనాభ్యుదయావలమ్బః
కామాక్షి చంచల నిరీక్షణ విభ్రమ స్తే
ధైర్యం విధూయ తనుతే హృదిరాగబన్ధమ్
శంభోస్తదేవ విపరీతతయామునీ నామ్

తా|| అమ్బ! - అమ్మా, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, మదనాభ్యు

దయావలమ్బ - మన్మథుని (యిహపరలోకములలోని) అభివృద్ధికి ఆధారమైన, తే - నీ యొక్క, చంచల నిరీక్షణ విభ్రమః - చంచలమైన చూపు యొక్క విలాసము, శమ్భోః - శివునియొక్క, హృది - హృదయము నందు, ధైర్యమ్ - ధీరతను, విధూయ - తొలగించి, రాగబన్ధమ్ - అనురాగ బన్ధమును, తనుతే - చేయుచున్నది, మునీనామ్ - మునుల యొక్క, హృది - హృదయము నందు, తదేవ - దానినే (ధైర్యమును దొలగించుట రాగబన్ధమును కలిగించుట) విపరీత తయా - వ్యతిరేకముగా ధైర్యమును గలిగించుట, రాగబన్ధమును దొలగించుట), తనుతే - చేయుచున్నది. ఆశ్చర్యమ్ - వింతగదా!

తా|| అమ్మవారి చంచల వీక్షణ విలాసము మన్మథుని అభివృద్ధికి ఆధారమైన శివుని హృదయమున ధైర్యము దొలగించి అనురాగమును కలిగించు చున్నను మునుల హృదయము నందు మాత్రము ధైర్యమును గలిగించి రాగమును దొలగించు చున్నది.

వి|| మన్మథుడు శివుని గెలిచి ఈ లోకమున అప్రతిహత వీరుడను కీర్తిని శివ ఫాలాక్ష దగ్ధమైన శరీరమును మరల పొందుట అను రెండు శుభములమ్మ వారి వీక్షణ విలాసఫలములే. అవి రెండు ఇహలోకమునకు సంబంధించిన అభివృద్ధులు. మన్మథుడు అమ్మవారి పంచదశీ విద్యలలో నొకటైనకాది విద్య - మన్మథ దృష్టము మన్మథోపాసితము. గురుపరమ్పరా లబ్ధమై నేటికి నుపాసింపబడు చున్నది. మన్మథునకమ్మవారి సారూప్యము పాసనా కాలమందున్న దని, మన్మథుని జగద్విజయము శివ విజయముతో సహా అమ్మవారి కటాక్షాను గ్రహ లబ్ధమని శంకరులు చెప్పి యున్నారు. ఉపాసనా ఫలముగా తత్క్రతు న్యాయము ననుసరించి అమ్మవారిలోక మందు మన్మథునకు సారూప్యముక్తి లాభము సందేహ్యమె కాదు. ఈ విధముగా అమ్మవారి కటాక్షము మన్మథుని యిహ పరలోకములలోని యభివృద్ధి రూపమైన అభ్యుదయమునకు అవలమ్బమై యున్నది. అమ్మవారి కటాక్ష విభ్రమము శివుని హృదయమునరాగ బన్ధమును మునుల హృదయమున వైరాగ్య బన్ధమును శివుని హృదయమున నధైర్యమును మునుల హృదయమున ధైర్యమును ఒకే కాలమున నొకే కటాక్ష విభ్రమమున విరుద్ధములైన రెండు కార్యములనొనర్చుట విచిత్రము గదా. 59వ శ్లోకమున వలె నీ శ్లోకమునను అమ్మవారి కటాక్ష వైచిత్రి వర్ణింపబడినది.

62. జన్తో స్సకృత్ప్రణమతో జగదీడ్యతాం చ
తేజస్వితాం చ నిశితాం చ మతిం సభాయామ్
కామాక్షి! మాక్షిక ఝరీమివ వైఖరీంచ
లక్ష్మీంచ పక్ష్మలయతి క్షణ మీక్షణం తే

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, క్షణమ్ - అల్పకాలపు, ఈక్షణమ్ - చూపు, సకృత్ - ఒకసారి, ప్రణమతః - నమస్కరించు వానికి, జగదీడ్యతాం చ - లోకస్తుత్యతను, తేజస్వితాం చ - ప్రకాశ వత్త్వమును, సభాయామ్ - సభయందు, నిశితామ్ - తీక్షణమైన, మతిం చ - బుద్ధిని మాక్షిక ఝరీమ్ ఇవ - తేనె వాక వంటి, వైఖరీమ్ - ఇతరుల చెవులకు వినబడు వాక్కును, లక్ష్మీం చ - సంపదను కూడ, పక్ష్మలయతి - కలిగించు చున్నది.

తా|| అమ్మా! కామాక్షీ దేవీ! నీ కొకపరి నమస్కరించు వానికి నీ వొకింత సేపు చూచిన వెంటనే జగన్నుత్యత్వము, తేజస్విత, సభారంజకమైన సూక్ష్మ బుద్ధి, తేనెల గార్చు వాక్కు నింటి యందు లక్ష్మియు గలుగును.

వి|| ఒక సారి నమస్కరించిన వాని నొకపరి చూడగానే వీనికి లభించు లోకస్తుత్యత తేజస్విత సభా రంజకము లైన ప్రతిభ తేనెలూరు ప్రసంగమును జేయుశక్తి ఇంటి యందు సంపదయు లభించుచున్న నిరంతరము పెక్కుసార్లు నమస్కరించు వానిని నీ వెక్కువ సేపు దయతో చూచిన వానికి లభించు సౌఖ్యముల సంగతి యేమని చెప్పవచ్చును. మూలాధారమున నున్నట్టిది పరావా గ్బీజము. ఇది పరమాత్మాభిన్నము. అది స్వాధిష్ఠానము నను చ్ఛూనమై (ఉబ్బి) మణి పూరము నందు ద్విదళితాంకురముగ రూపొందును. అనగా శబ్దము అర్థము అని రెండుగా చీలిన యంకురము వలె యుండి దర్శనీయమై పశ్యంత యను పేరునొందును. ఇది విషయ జ్ఞానైకరూపము. ఆ తరువాత అనాహతమున దాని కనాహతమై నాదము చేరును. అప్పుడు దానికి మధ్యమ యను పేరు కల్గును. అయినను అది ఇతరుల చెవులకు వినబడదు. విశుద్ధమున కందాద్యవయవముల యాహతిచే ఇతరులచెవి జేరునదై వైఖరీ వాక్కని పిలువ బడును. పరావాక్కు మన యనుభవమునకు రాకున్నను విషయ జ్ఞాన రూపమైన పశ్యంతీ వాక్కు మన యనుభవమున గోచరమగును. ఒక

యర్థమును గూర్చిన జ్ఞానమున ఆ యర్థమును బోధించు శబ్దము కూడ గోచరించును. కావున పశ్యంతి, మధ్యమ, వైఖరి అను మూడు వాక్కులే మన జ్ఞానమున కందు నట్టివి. కావుననే వేరే పేరు పెట్టక పశ్యంతికి వైఖరికి మధ్య నున్న దానికి మధ్యమ వాక్కనియే పేరు పెట్టబడినది. వైఖరి యనగ చతుర్థమైన వాక్కు. ఈ చతుర్విధ వాక్కు సరస్వతీ దేవియే తదర్థములైన అర్థాదులు లక్ష్మీ రూపములు. సాధారణముగా సరస్వతి లక్ష్మి లొకరికడ నుండవు. కాని యమ్మవారి కటాక్షమునకు బాత్రుడైన వానికి రెండును వశములై యుండును. యని లక్ష్మీంచ. అనుచోటి చకారము తెలుపుచున్నది. ప్రణామ మనగా ఆత్మ నివేదనము లేక శరణాగతి. అది యొకసారి చేసిన చాలును. సకృదేవ ప్రసన్నాయ త వాస్మీతిచ యాచతే అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతమ్మమ అని శ్రీ మద్రామాయణ మున శ్రీ రాముడు చెప్పినాడు. మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాంత రంతితే అని భగవద్గీతయు దీనిని పేర్కొన్నది. ప్రణామమనగా నాదేమియు లేదని ఈ స్థూల సూక్ష్మ కారణ దేహములు నీవేయని భగవానునిపై వాని భారముంచుట దీనినే భరన్యాస మనియు నందురు. ఏకోపి కృష్ణస్యకృతః ప్రణామః దశాశ్వమేధా వబృధేన తుల్యః దశాశ్వమేధీపునరేతి జన్మకృష్ణ ప్రణామీన పునర్భవాయ (ఒక సారి చేసిన ప్రణామము దశాశ్వమేధా వాభృధ తుల్యము. కాదు కాదు. అంతకంటెను గొప్పది. దశాశ్వమేధి పునర్జన్మ నొందును. ప్రణామి మరల జన్మనొందదు) అను శ్లోకము కూడనిట నను సన్ధేయము. సకృత్ప్రణమతః - అనుటలోని విశేషమిది. కామాక్షి మాక్షిక అనుచోట మాక్షి అను వర్ణములు అవ్యవధానముగా పునరావృత్తములగుట చే ఛేకాను ప్రాసమను శబ్దాలంకారమున్నది. క్షణమీక్షణమ్ అను చోట క్షణ శబ్దమీ యొక్క పునరావృత్తి యుండుటచే యమకాలంకారము అను శబ్దాలంకారమున్నది.

63. కాదమ్బినీ కి మయతే న జలానుషఙ్గమ్
భృఙ్గావళీ కి మురరీకురుతే న పద్మమ్
కింవా కలిన్దతనయా సహతే న గఙ్గామ్
కామాక్షి! నిశ్చయ పదం న తవాక్షిలక్ష్మీః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, అక్షిలక్ష్మీః - కంటికాంతి, కాదమ్బినీ కిమ్ - మేఘ మాలయా, జలాను షఙ్గమ్ - నీటి యొక్క సంబంధమును, న అయతే - పొందదు, భృఙ్గావళీ కిమ్ - తుమ్మెదల వరుసయా, పద్మమ్ - కమలమును, న ఉరరీకురుతే - అంగీకరించదు, వా - లేక, కళిన్ద తనయా కిమ్ - యమునయా, గంగామ్ - గంగను, న సహతే - సహించదు, నిశ్చయ పదమ్ - నిశ్చయస్థానమును, న అయతే - పొందుట లేదు.

తా|| అమ్మవారి కంటి కాంతి మేఘమాల యను కొందమా? మేఘమాలకు జలాను షంగమున్నది. అమ్మవారి కంటి కాంతికి జలానుషంగము లేదు. లేక యది తుమ్మెదల వరుస యనుకొందమా? తుమ్మెదల వరుస పద్మమునంగీకరించును. కాని అమ్మవారి కంటి కాంతి దాని నంగీకరించదు. పోని యమున యనుకొందమా, యమునగంగను సహించును. అమ్మవారి కంటి చూపు గంగను సహించదు. కావున మేఘ మాల యని భృంగావలియని, యమున యని నిశ్చయించ లేక మూక కవి సందేహము లోనే మునుగు చున్నాడు.

వి|| మేఘమాల యని కాని, భృంగావలి యని కాని, యమున యని కాని నిశ్చయించలేక పోవుటచే నీశ్లోకమున సందేహాలంకారమున్నది. జల సంబంధము కలగి యుండుట కాదంబిని యందున్నది. పద్మము ంగీకరించుట తుమ్మెద యందున్నది. గంగను సహించుట యమున నుందున్నది. పై మూటిలో నే యొకటియు నమ్మవారి కంటి కాంతి యందు ేదు. నిజమే కాని అక్షి లక్ష్మి కుపమాన మేదైన కలదా లేదా యను సందేహము మాత్రము తప్పుట లేదు. పై యొక్కొక్క వైషమ్యము తప్ప మిగిలిన ధర్మముల విషయమున అమ్మవారి కంటి కాంతి మేఘములతో భృంగావలితో యమునతో పోలిక కలిగి యున్నదని ఆ యొక్క ధర్మము లేదని చెప్పుటచే మిగిలిన ధర్మము లుండుటచే నమ్మవారి కంటి కాంతి కాదంబినియని యొప్పుకొనవలసి వచ్చుట యొక కోటి ధర్మములు లేకపోవుటచే నొప్పుకొన నక్కఱ లేక పోవుట మరొక కోటి సమానములుగా నుండుట చే నీశ్లోకమున నొప్పుకొన వలసి యున్న సందేహాలంకారముచే వానిలోని వైషమ్యము చెప్ప బడుట హేతువుగా విశేషాలంకారము స్ఫురించు

చున్నది. మూడు నకారములు ధర్మ నిషేధమునకుపయోగింపబడుట ఈ స్ఫురణమునకు హేతువు.

64. కాకోలపావక తృణీకరణేఽపి దక్షమ్
కామాక్షి! బాలక సుధాకర శేఖరస్య
అత్యన్త శీతల తమోఽప్యనుపారతం తే
చిత్తం విమోహయతి చిత్రమయం కటాక్షః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, అయం కటాక్షః - చూపు, అత్యన్త శీతల తమః క అపి - మిక్కిలి చల్లనిదైనను, కాకోల పావక తృణీకరణే అపి - విషాగ్నులను గడ్డి పోచగా చేయుట యందైనను, దక్షమ్ - సమర్థమైన, బాలక సుధాకర శేఖరస్య - చిన్ని చంద్రుడు శిరోభూషణముగా గల శివుని యొక్క, చిత్తమ్ - మనస్సును, అనుపారతమ్ - ఎడతెగకుండ, విమోహయతి - విశేషముగా మోహింప జేయు చున్నది. చిత్రమ్ - వింతకదా!

తా|| విషాగ్నులను లెక్క చేయని చిన్ని చంద్రుని శిరోభూషణముగా ధరించు శివుని చిత్తమును గూడ అమ్మవారి చూపు చల్లనిదయ్యు మోహింప జేయుట చిత్రము గదా!

వి|| తృణము నగ్ని దహింప గలదు. అగ్నిదాహకము. తృణము దాహ్యము. అగ్నిని తృణీకరించినది శివుని చిత్తము. అగ్నిని దాహ్యముగా జేసికొని దాహక దాహకమైనది శివుని చిత్తము. అంతకంటె ఘోరమైన విషమో, అగ్నియో శివుని చిత్తమును మోహింప జేయవలెను. కాని అమ్మవారి చూపు శీతలమును సైతము శీతలీకరింప గలది. అని అత్యన్త శీతల తమః అను పదమందలి శీతల విశేషణము "తమ" అను ప్రత్యయము వ్యంజింప జేయు చున్నవి.

65. కార్పణ్య పూరరస వర్ధిత మమ్బ మోహ
కన్దోద్గతం భవమయం విషపాదపమ్మే
తుంగం ఛినత్తు తుహినాద్రి సుతే భవత్యాః
కాంచీపురేశ్వరీ! కటాక్ష కుఠారధారా

అ|| అమ్బ - అమ్మా, తుహినాద్రిసుతే - హిమపర్వతకుమారివైన, కాంచీపురేశ్వరి - ఓ కాంచీపురనాయికా!, భవత్యాః - నీ యొక్క, కటాక్ష కుఠార ధారా - కంటికొన యనెడి గండ్ర గొడ్డలి యంచు, కార్పణ్యపూర రసవర్ధితమ్ - అహంకార ప్రవాహము నందలి రసముచే పెరిగి, మోహ కన్దోద్గతమ్ - మోహమను దుంపనుండి మొలచిన, తుంగమ్ - ఎత్తయిన, మే - నా యొక్క, భవ మయం - సంసార రూపమైన, విష పాదపం - విషవృక్షమును, ఛినత్తు - ఛేదించుగాక!

తా|| హిమవత్పర్వత కుమారివైన, జగదీశ్వరివైన, కాంచీపుర నాయికవైన యో కామాక్షీ దేవీ! నీ కటాక్ష మనెడి గండ్ర గొడ్డలి యంచు, మోహమనుదుంప నుండి మొలచిన అహంకార జలముచే పెరిగిన ఎత్తయిన నా సంసార మనెడి విషవృక్షమును ఛేదింప జేయుగాక!

వి|| అమ్మవారి చూపు నందు సంసారమనెడి విషవృక్షమును ఛేదించు గండ్రగొడ్డలిగా రూపింప బడుట నిందు రూపకాలంకార మున్నది. ఆ విషవృక్షము మోహ మనెడి దుంప నుండి పుట్టి అహంకార మనెడి జలముచే పెఱిగినదని అవయవముల రూపణ మక్కడ నిందుండటచే నిది సావయవము.

అవ|| పై శ్లోకమున సంసారము విష వృక్షముగా రూపింప బడినది. ఈ క్రింది శ్లోకమున నది రోగముగా రూపింప బడు చున్నది.

66. కామాక్షి! ఘోర భవరోగ చికిత్స నార్థ
మభ్యర్థ్య దేశిక కటాక్ష భిషక్ప్రసాదాత్
తత్రాపి దేవి లభతే సుకృతీ కదాచి
దత్యన్త దుర్లభ మపాంగ మహౌషధం తే

అ|| దేవి, కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, ఘోర భవరోగ చికిత్స నార్థమ్ - ఘోరమైన సంసారమనెడి రోగము యొక్క చికిత్స కొఱకు, అభ్యర్థ్య - అడిగి, దేశిక కటాక్ష భిషక్ప్రసాదాత్ - గురువు చూపనెడి వైద్యుని యనుగ్రహము వలన, తత్ర అపి - అందును, కదాచిత్ - ఒకప్పుడు, సుకృతీ - పుణ్యాత్ముడు, అత్యన్త దుర్లభమ్ - మిక్కిలి దుర్లభమైన, తే - నీ యొక్క, అపాంగమహౌషధమ్ - కటాక్ష మనెడి గొప్ప మందును, లభతే

- పొందును.

తా|| ఓ కామాక్షీ దేవీ! నీ కటాక్షము ఘోరమైన సంసార మనెడి రోగమును కుదుర్చుటలో గొప్ప మందు. అది లభింప వలెనన్న ముందుగా గురువనెడి వైద్యుడు లభింప వలెను. అతడు దయతో చూచి రోగిననుగ్రహింప వలెను. మాటి మాటి కడిగిన పిమ్మట నా దేశికుడను వైద్యుడు నీకటాక్షమను గొప్ప మందు నొసగును. దానిని పొందుట కా రోగి బహు జన్మార్జిత సుకృతము కలవాడై యుండ వలెను. ఇన్ని యున్నను ఆ మందు లభించుట నియతము కాదు. ముఖ్యముగా గుర్వనుగ్రహమును పొంది యుండవలెను. అమ్మవారి కటాక్షము గురు కటాక్షాధీనము.

వి|| భవరోగ మహౌషధముగా అమ్మవారి కటాక్షము రూపింప బడినది. గురువు వైద్యుడుగా రూపింప బడినాడు. కావున నిందు రూపకాలంకారము గలదు. గురునడుగనిదే యీ భవరోగమనే ఔషధ రూప దేవీ కటాక్షము నాతడీయడు. నా పృష్టః కస్య చిద్బ్రూయాత్ - అడుగనిదే యెవనికి మోక్షోపాయము చెప్ప గూడదని పెద్దలందురు గదా! అందుకే మాటి మాటి కడుగ వలెను. తద్విద్ధి ప్రణిపాతేన పరి ప్రశ్నేన సేవయా ఉపదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞాని నస్తత్త్వ దర్శినః అని భగవద్గీత జ్ఞాన ప్రాప్తి సాధనముగా పరిప్రశ్నను బేర్కొన్నది. అది అభ్యర్థ్య అను పదముచే చెప్పబడినది. బహూనాం జన్మ నామన్తే జ్ఞానవాన్ మామ్ ప్రపద్యతే అని భగవద్గీత బహు జన్మానంతరమే జ్ఞానము కలుగునని చెప్పు చున్నది. యతతామపి సిద్ధానాం కశ్చిన్మాంవేత్తి తత్త్వతః (జ్ఞాన ప్రయత్నముచేయు వేలకొలది మనుష్యులలో నొకానొకడు మాత్రమే జ్ఞానమును బొంద గలడు) అని భగవద్గీత చెప్పు చున్నది. ఈ యంశమును కదాచిత్ అను పదము సూచించు చున్నది. సుకృతీ అను పదము పై శ్లోకములోని కశ్చిత్ అను పదమునకు వివరణము". అత్యన్త దుర్లభమ్ అను పదము పై శ్లోకము లోని "అపి" అను పదమునకు వివరణము.

అవ|| పై శ్లోకమున దేశిక కృప వైద్యానుగ్రహముగా రూపింపబడినది. ఈ శ్లోకమున దేశిక కృపా లేశమును బొందినవారు కూడ సిద్ధిని బొందుదురని చెప్ప బడు చున్నది.

67. కామాక్షి! దేశిక కృపాఙ్కుర మా(శ్రయన్తో
నానా తపోనియమ నాశిత పాశ బన్ధాః
వాసాలయం తవ కటాక్ష మముం మహాన్తో
లబ్ధ్వా సుఖం సమధియో విచరన్తి లోకే

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, దేశికకృపాఙ్కురమ్ - గురువు యొక్క యను(గ్రహ లేశమును, ఆ(శ్రయన్తః - ఆ(శయించిన, నానా తపోనియమ నాశిత పాశబన్ధాః - అనేక తపోనియమముల చేత నశింప జేయ బడిన పాశముల బన్ధములు గల, మహాన్తః - గొప్పవారు, అముం - ఈ, తవ - నీ యొక్క, కటాక్షమ్ - కటాక్షమును, వాసాలయమ్ - నివాస భవనమునుగా, లబ్ధ్వా - పొంది, సమధియః - సమబుద్ధి గలవారై, లోకే - లోకము నందు, సుఖమ్ - సుఖముగా, విచరన్తి - తిరిగెదరు.

తా|| దేశిక కృపాలేశమున నమ్మవారి కటాక్షమను నివాస భవనమును బొందిన గొప్పవారు సమబుద్ధి గలవారై సుఖముగ విహరించెదరు. ఆ భవనము లభించుటకు ముందు వారు గురు కృపాలేశము నా(శయించి వారుపదేశించిన తపోనియమముల ననుష్ఠించి పాశబన్ధములను దొలగించికొని యుండ వలెను. అట్లా భవనము వారికి లభింపగా సమబుద్ధి గలవారై వారు లోకమున సుఖముగా విహరించెదరు.

వి|| సంసారవనమున (భమించి యలసిన వారికి నివాసభవనము కావలెను. సంసారవనమున (భమించు చుండగా నదృష్టవశమున లభించిన గుర్వను గ్రహమును బొంది వారు చెప్పిన విధముగా తపోనియమ (వతాదుల ననుష్ఠించి తత్ఫలముగా పాశబన్ధములను నశింపజేసి కొన వలెను. అప్పుడమ్మవారి కటాక్షమను నివాసభవనము లభించును. దానిలో (ప్రవేశించి సుఖముగా తిరుగు చుందురు. భవనము లభించిన వారి తిరుగుట విచరణము. భవనము లభింపక వనములో తిరుగుట (భమణము. మొదటిది సుఖరూపము, రెండవది దుఃఖ రూపము. అమ్మవారి కటాక్షము లభించిన పిమ్మట సంసారము నందు (భమజనకత్వ రూప వనధర్మము నశించి వి(శ్రాంతి జనకత్వ రూప భవన ధర్మము లభించుటచే వారికి లోక విచరణము సుఖముగానే యుండును. కటాక్ష భవనమును బొంది సుఖముగా విచరించెదరు.

అనుమాట చేత నంతకు ముందు వారు వనము నందు భ్రమించి దుఃఖ పడినారను నర్థము వ్యంగ్యమగును. వనములో కంటకవృక్షములే యధికమైనను గురుకృప యనునది దివ్యాంకురముగా చెప్ప బడుటచే నది కూడ నదృష్టవశమున సంసార వనముననే లభించును. దానికై వెదకి లభింపగానే దాని నాశ్రయింప వలెనని అంకుర శబ్దముచే వ్యంగ్యమగు చున్నది.

68. సాకూత సంలపిత సంభృత ముగ్ధహాసం
వ్రీడానురాగ సహచారి విలోకనం తే
కామాక్షి కామ పరిపంథిని మారవీర
సామ్రాజ్య విభ్రమదశాం ప్రకటీకరోతి

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ! సాకూత - అభిప్రాయముతో కూడిన, సంలపిత - మాటలతో, సంభృత - పోగుపడిన, ముగ్ధ - అమాయకమైన, హాసం - నవ్వుగల, వ్రీడానురాగ సహచారి - సిగ్గుతో అనురాగముతో కూడి తిరుగు, తే - నీ యొక్క, విలోకనమ్ - చూపు, కామపరిపన్థిని - కామునికి శత్రువైన శివుని యందు, మారవీర సామ్రాజ్య విభ్రమ దశామ్ - వీరుడైన మన్మథుని, సామ్రాజ్యమునకు లోబడిన యవస్థను, ప్రకటీ కరోతి - ప్రకటించు చున్నది.

తా|| ఓ కామాక్షీ దేవీ! నీవు సాభిప్రాయముగ మాట్లాడునప్పుడు అప్రయత్నముగా నుబికిన నవ్వు సిగ్గు అనురాగము ముప్పిరిగొన్న నీ చూపు శివుని యందేర్పడిన మన్మథ వీరుని సామ్రాజ్యమునకు లోబడియున్న యవస్థను బ్రకటించు చున్నది.

వి|| కాముని దహించి శివుడు కామపరిపన్థియను ప్రసిద్ధిని బడసి యుండగా శివుని జీవితము నందమ్మవారు ప్రవేశించినది. ఆమె చూపు శివుని యందు బడినదో లేదో మన్మథుడు సమ్రాట్టగుట శివున కాయనకు లోబడి యుండు నవస్థ కలిగినది. ఈ విషయమును గూడ ఆమె కన్నులలోని హాసము తెలుపుచున్నది. ఎటు వంటి శివునకెటువంటి యవస్థ కలిగినదను పరిహాసమా కన్నులలో నుండి వ్యక్తమగు చున్నది. జయాపజయములు ఎవరి యందును నియతముగా నుండవు గావున ఒకప్పుడు గెలిచిన శివుడే మన్మథుడు సమ్రాట్టగుట చూచి యాతనికి లోబడ వలసిన వాడైనాడు. ఇది యంతయునమ్మవారి విలోకన మహిమ.

69. కామాక్షి! విభ్రమ బలైకనిధి ర్విధాయ
భ్రూవల్లి చాపకుటిలీకృతమేవ చిత్రమ్
స్వాధీనతాం తవ విధాయ శశాంకమౌలే
రఙ్గార్థ రాజ్యసుఖలాభ మపాఙ్గవీరః

అ॥ కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, అపాఙ్గవీరః - కటాక్షవీరుడు, విభ్రమ బలైక నిధిః - విలాస బలము ముఖ్యనిధిగా గలవాడై, చిత్రమ్ - వింతగా, భ్రూవల్లి చాపకుటిలీకృతమ్ + ఏవ - తీగ వంటి కనుబొమలు వంచుటను మాత్రమే, విధాయ - చేసి, శశాఙ్కమౌలేః - చంద్రుడు శిరమునందుగల శివుని యొక్క, అంగార్ధ రాజ్య సుఖలాభమ్ - శరీరములోని సగమను రాజ్యము యొక్క సుఖసంపాదనమును, స్వాధీనతామ్ - స్వ (నీ యొక్క) వశమును, నినాయ - పొందించెను.

తా॥ ఓ కామాక్షీ దేవీ! నీ కటాక్ష వీరుడు కను బొమ్మలను ధనుర్లతను వంచి విలాసబలము నిధిగా పొందిన వాడై శివుని యొక్క సగము శరీరము నందధికారమును నీకు వశ మొనర్చెను.

వి॥ అమ్మవారికి లభించినది శివుని యంగార్ధ రాజ్యము. దానిని లభింపజేసిన వాడు అపాఙ్గవీరుడు. అపాఙ్గ అనగా తొలగిన అంగము కలవాడు. అనఙ్గుడన్నమాట. అనంగుడంగార్ధ రాజ్యము నమ్మవారికి సంపాదించి పెట్టుట యను వింత ఈ శ్లోకమునందు వర్ణింప బడిన దని 'చిత్రమ్' అను పదము తెలుపు చున్నది. శివుడు శశాంకమౌలి. మన్మథునకా శశాంకుడు మామ. మన్మథుని పక్షమున నుండ వలసిన వాడు. ఆశశాంకుడు శత్రువైన మన్మథుని పక్షమునకు చెందినవాడు. అయినను శివుడు శత్రుపక్షమునకు చెందిన వానినెత్తికెక్కించు కొన్నాడు. అయినను చంద్రుడు శివునకేమియు సాయపడలేదు. చివఱకు శివుడోడింపబడినవాడు. తత్ఫలముగా తన శరీరార్ధ రాజ్యమందధికారమును గోల్పోయినాడు. ఇప్పటికి నాశశాంకుని నెత్తి మీదనే యుంచు కొన్నాడు. ఇది వింత యని "చిత్రమ్" అను పదము తెలుపు చున్నది. శివుడమ్మ వారికి తన శరీరములోని సగమప్పగించి యోటమి నంగీకరించినాడు. అప్పుడా శశాంకు డమ్మవారి శిరమున గూడ వ్యాపించినాడు. అప్పుడాతడ పాంగుడను నామాంతరముగల అనంగుని

పక్షమే వహించి నట్లైనది. అయినను శివునకు శశాంక మౌళి యను యశము వీడి పోలేదు. ఇది వింతయను విషయమును "చిత్రమ్" అను పదము తెలుపు చున్నది. శశాజ్కి శబ్దము చంద్రగత కలంకితను దోషిత్వమును చెప్పుచున్నది. అట్టి వానిని నెత్తి కెక్కించు కొన్నను వాడు శత్రువుతో యుద్ధము సంభవించి నప్పుడేమియు సాయము చేయలేదు. అయినను శివుడు వానిని శిరము నుండి తీసివేయ లేదు. ఇది వింత యను నంశమును "చిత్రమ్" అను పదము తెలుపు చున్నది.

అవ||అపాంగ వీరుడంగార్ధ రాజ్యమును సంపాదించి,యిచ్చుట యను వింత పూర్వ శ్లోకమున దేవీ కటాక్షమున నున్నట్లు చెప్పబడినది. ఈ శ్లోకమున మరొక వింత ప్రస్తావింప బడుచున్నది.

70. కామాంకురైక నిలయ స్తవ దృష్టిపాతః
కామాక్షి భక్త మనసాం ప్రదదాతి కామాన్
రాగాన్వితః స్వయమపి ప్రకటీకరోతి
వైరాగ్యమేవ కథమేష మహామునీనామ్

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, కామాఙ్కురైక నిలయః - కామమను మొలకకు ముఖ్య నివాసమైన, తవ - నీ యొక్క, దృష్టి పాతః - చూపు, భక్త మనసామ్ - భక్తుల మనస్సులకు, కామాన్ - కోరికలను, ప్రదదాతి - ఇచ్చు చున్నది. స్వయమ్ - స్వయముగా, రాగాన్వితః అపి - రాగముతో కూడిన దైనను, ఏషః - ఇది (దృష్టిపాతము), మహామునీనామ్ - గొప్ప మునులకు, వైరాగ్యమ్ ఏవ - వైరాగ్యమునే, కథమ్ - ఎట్లు, ప్రకటీకరోతి - ప్రకటించు చున్నది.

తా|| ఓ కామాక్షీ దేవీ! నీ చూపు మన్మథునికి పుట్టిల్లు. భక్తుల మనస్సులలో బుట్టిన కోరికలన్నిటిని తీర్చుచు నుండును. అది స్వయముగా రాగముతో కూడినదే యైనను మహామునులకు వైరాగ్యమునే ప్రకటించు చున్నది.

వి|| అమ్మవారి చూపు పడి కామారి యైన శివుని యెదలో సైతము శృఙ్గార సంబంధమైన కామము కలిగినది. భక్తుల మనస్సులలోనున్న శృఙ్గారేతరము లైన కామముల నెన్నిటినో ప్రసాదించు చున్నది. అమ్మవారి

చూపున శివ విషయకమైన రాగమున్నను మహామునులకు మాత్రము వైరాగ్యమునే కల్పించు చున్నది. రాగాన్వితమైనది వైరాగ్యమును కలిగించుట వింతయే, అమ్మవారి కటాక్షమహిమ అన్ని విరోధములకు నతీతమే కావున నందు విరోధాభాసాలంకారమున్నది. వైరాగ్యమనగా శృంగార, శృంగారేతర సర్వకామములు వీడిపోవుట. ఇట్టి స్థితి సామాన్య భక్తులలో నుండదు. సర్వ సఙ్గపరిత్యాగులైన మునులలో మాత్రమే యుండును. సర్వ సంగ పరిత్యాగ సూచకముగా తలగొరిగించు కొని యున్న సన్యాసి ముని యనబడును. సంకల్పములు మనస్సున మొలచు కేశములు. వానిని ఛేదించిన వాడు ముని. దానికి బహిరంగ సూచనము శిరోముండనము. శిరోముండనమను బహిరంగ చిహ్నము లేకున్నను మనస్సు నందలి సంకల్పముల త్యజించిన వాడు మునియే యగును. అట్టి మునులకు సైతము అమ్మవారి కటాక్షము వాంఛనీయమే. అది లేనిదే అద్వైత వాసనయే లభించదు. ఇక జీవైశ్వర్య ఐక్యవిజ్ఞానము ముక్తి లాభము అను నంశములు లభింపవని చెప్ప నక్కఱ లేదు కదా! ఈ యంశమంతయు ముని విశేషణమైన మహా శబ్దము వ్యంజింప జేయు చున్నది.

71. కాలామ్బువాహ నివహైః కలహాయతే తే
కామాక్షి! కాలిమ మదేన సదా కటాక్షః
చిత్రం తథాపి నితరా మముమేవ దృష్ట్వా
సోత్కణ్ఠ ఏవ రమతే కిల నీలకణ్ఠః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, కటాక్షః - చూపు, సదా - ఎల్లప్పుడు, కాలిమ మదేన - నలుపు యొక్క మదము చేత, కాలామ్బువాహ నివహైః - వర్షాకాలమేఘముల గుంపులతో, కలహాయతే - కలహించును, తథాపి - అయనను, అముమ్ ఏవ - దీని (కటాక్షము)నే, దృష్ట్వా - చూచి, నీలకణ్ఠః - నల్లని కంఠము గల శివుడను నెమలి, సోత్కణ్ఠః ఏవ - ఉత్కంఠ గల వాడయియే, నితరామ్ - ఎక్కువగా, రమతే కిల - రమించునట, చిత్రమ్ - వింతగదా!

తా|| ఓ కామాక్షీదేవీ! నీ కటాక్షము వర్షాకాలమేఘమాలతో కాలిమ మదము కారణముగా కలహించు చున్నను దీనిని చూచి యుత్కంఠగల వాడయి

శివుడను నెమలి రమించుచుండుట చిత్రముగదా!

వి|| వర్షాకాల మేఘములను చూచి యుత్కంఠ గలదై నెమలి సంతోషముతో పురి విప్పి యాడును. కావున మేఘములతో నెమలికి స్నేహమేయుండును. కాని అమ్మవారి కటాక్షము మేఘములతో కలహించు చుండును. అయినను శివుడను నెమలి మాత్రము తన మిత్రులైన కాలామ్బువాహములతో కలహించు కటాక్షమును చూచి యానందించు చునే యుండుట విచిత్రము. ఈ శ్లోకమున శివుడు నెమలిగా నీలకంఠ శబ్దశ్లేష బలమున రూపింపబడినాడు. కావున నిందు రూపకాలంకారమున్నది. చిత్రమ్, తథాపి అను శబ్దములచే చెప్పబడిన కాలామ్బువాహములతో కలహించు కటాక్షమును చూచి యానందించుట యను విరోధము శ్లేషచే పరిహరింపబడును. కావున నిందు విరోధాభాసాలంకారమున్నది. అది రూపక శ్లేషలచే నను ప్రాణితమై యున్నది.

అవ|| పై శ్లోకమున శివుడు నెమలిగా రూపింపబడినాడు ఈ శ్లోకమున అమ్మవారి యపాఙ్గము నెమలిగా రూపింప బడుచున్నది.

72. కామాక్షి! మన్మథరిపుమ్ ప్రతి మారతాప
మోహాన్ధకార జలదాగమ నేన నృత్యన్
దుష్కర్మ కంచుకి కులం కబలీ కరోతు
వ్యామిశ్రమేచక రుచి స్త్వదపాంగకేకీ

కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, మన్మథ రిపుమ్ ప్రతి - మన్మథునికి శత్రువైన శివుని గూర్చి, మారతాప మోహాన్ధకార జలదాగమనేన - మన్మథ తాప మోహాన్ధ కారమనెడి మేఘము యొక్క రాక చే, నృత్యన్- నర్తించు చున్న, వ్యమిశ్రమేచక రుచిః - బాగుగా కలసిన నల్లని కాంతిగల, త్వదపాఙ్గ కేకీ - నీ కటాక్షమనెడి నెమలి, దుష్కర్మ కంచుకి కులమ్ - చెడు పనులనెడి పాముల సమూహమును, కబలీ కరోతు - మ్రింగివేయుగాక.

తా|| అమ్మ వారి కటాక్ష మనెడి నెమలి శివునిపైకి మన్మథ మోహాన్ధకార మేఘము యొక్క రాకతో పురి విప్పి నాట్యము చేయు చున్నదై దుష్కర్మ సర్పసమూహములను మింగి వేయుగాక!

వి|| తొలకరి మేఘము యొక్క రాకతో నంతకు ముందు బాగుగా నెండిన భూమి నుండి గాలియాడక తాపము బయలు దేరును. మెల్లిగా చీకట్లు గ్రమ్ముకొనును. అట్లే శివుని పై మన్మథుడు విజయము నంద నాతనికి తాపము కలిగినది. మోహాన్ధకారము గ్రమ్ముకొన్నది. అది చూచి యమ్మవారి కటాక్షమను నెమలి సంతోషించి యాడు చున్నది. అని కటాక్ష మందు నెమలి యొక్క యారోపము దుష్కర్మలందు సర్పా రోపమును నీ శ్లోకమున నుండుటచే నీ శ్లోకమున రూపకాలంకార మున్నది. నెమలి జలదాగమనమున సంతోషించి నర్తించును. కటాక్షమను నెమలి శివునకు మారతాప మోహన్ధకార మేఘము యొక్క రాకతో నర్తించును. ఇట్లు మారతాప మోహాన్ధకార మందు జలదము యొక్క యారోపము కూడ నందుడుటచే నిది యాడునెమలి యందు బహు వర్ణమిశ్రితమైన నల్లని కాంతి యుండును. అట్లే అమ్మవారి కటాక్షము నందు నుండును. కటాక్షమునందు చేయబడు చున్న నెమలి యారోపణము మనస్సు నందు రూఢమగుటకు వ్యామిశ్రమేచక రుచి యను సమాన ధర్మము సాయపడు చున్నది.

అవ|| పై శ్లోకమున మన్మథరిపునకు మార తాపము చెప్పబడినది. ఈ క్రింది శ్లోకమునను శివుని చెప్పుటకు మన్మథరిపు శబ్దమే ప్రయోగింప బడినది.

73. కామాక్షి! మన్మథరిపో రవలోకనేషు
కాన్తమ్ పయోజమివ తావక మక్షిపాతమ్
ప్రేమాగమో దివసవ ద్వికచీకరోతి
లజ్జాభరో రజనివ న్ముకులీకరోతి

అ|| కామాక్షి! - ఓ కామాక్షీదేవీ, మన్మథరిపోః- మన్మథశత్రువైన శివుని యొక్క, అవలోకనేషు - చూపుల యందు, కాన్తమ్ - కాన్తి నొందిన, పయోజమ్ ఇవ - కమలమును వలె, తావకమ్ - నీ, అక్షిపాతమ్ - చూపును, ప్రేమాగమః - ప్రేమయొక్క రాక, దివసవద్ - పగలువలె, వికచీకరోతి - వికసింప జేయుచున్నది, లజ్జా భరః - సిగ్గు యొక్క యతిశయము, రజనివత్ ముకులీకరోతి - రాత్రివలె సంకోచింపజేయును.

తా|| ఓ కామాక్షీ దేవీ! శివుని చూపులు సోకగానే నీ కటాక్షము అందమైన కమలము వలె పగలు యొక్క ప్రేమతో వికసించుచు రాత్రి వంటి లజ్జతో ముకుళించు చున్నది.

వి|| శివుని చూపులు సోకగానే అమ్మవారి కటాక్షము కమలము వలె ప్రేమలజ్జల ఘర్షణతో వికసించియు వికసింపక, ముకులించియు ముకులింపక అరమోడ్పుతో ప్రకాశించు చున్నది. ఈ శ్లోకమున అమ్మవారి కటాక్షమునకు కమలము తోడి పోలిక ఇవ శబ్దముచే చెప్పబడుటచేనుపమాలంకారము వాచ్యమై యున్నది. పగలు వంటిది ప్రేమ యని, రాత్రి వంటిది సిగ్గని, అప్రసిద్ధములతో పోలిక చెప్పబడినది. సిద్ధమైన కమలముతో కటాక్షమునకు పోలిక చెప్పబడినది. కమలము పగలు వికసించుట రాత్రి ముకుళించుట కవి సమయ సిద్ధములే.

74. మూకో విరించతి పరమ్ పురుషః కురూపః
కందర్పతి త్రిదశరాజతి కింపచానః
కామాక్షి కేవల ముపక్రమ కాలఏవ
లీలా తరంగిత కటాక్ష రుచః క్షణం తే

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, లీలా తరంగిత కటాక్షరుచః - విలాసముతో ప్రసరించిన కటాక్ష కాంతి యెక్క, కేవలం - ఒక, ఉపక్రమకాల ఏవ - ఆరంభకాలమందే, మూకః - మూగివాడు, విరించతి - బ్రహ్మ యగు చున్నాడు, పరమ్ - మిక్కిలి, కురూపః - వికృతమైన రూపముగల, పురుషః - పురుషుడు, కందర్పతి - మన్మథుడగు చున్నాడు, కింపచానః - పేదవాడు, త్రిదశ రాజతి - ఇంద్రుడగు చున్నాడు.

తా|| అమ్మా! నీలీలా కటాక్షము పూర్తిగ ప్రసరింప కుండగనే, కొంచెము ప్రసరింపగానే, మూగ - బ్రహ్మ, వికృత రూపుడు - మన్మథుడు, పేద - ఇంద్రుడు నగు చున్నాడు.

వి|| మాట్లాడలేని వాడు మూగ. బ్రహ్మ యో సరస్వతికి భర్త నాలుగు వేదములను నాలుగు ముఖముల నుండి వెలువరించినవాడు, మాట్లాడగల

వారందఱిలో నెవడును బ్రహ్మను మించలేడు. అమ్మ కటాక్షము ప్రసరించుట తోడనే మూగ బ్రహ్మ యగును. కురూపుడనగా కంటికి వెగటు కలిగించు రూపము కలవాడు. కందర్పుడో సౌందర్య వంతులకు పమాన భూతుడు. కురూపునియం దమ్మవారి కటాక్షము ప్రసరించుట తోడనే వాడు సౌందర్య వంతుల లోనగ్ర గణ్యుడైన కందర్పుడగును. కింపచనుడనగా నేడు వండుటకేమి యున్నది, అది యెక్కడెట్లు లభించునని యాలోచించు కొను చుండువాడు. త్రిదశరాజనగా పరమైశ్వర్య వంతుడైన ఇంద్రుడు. అమ్మవారి కటాక్షము ప్రసరించుట తోడనే కింపచాను డింద్రు డగును.. పై మూడు వాక్యముల మ్మవారి కటాక్షమునకు గల అఘటిత ఘటనా సామర్థ్యమును వెల్లడించు చున్నవి. కటాక్ష ప్రసారము యొక్క ఆరంభకాలముతోనే యనగా కారణము సమగ్రము కాకుండ గానే కార్యమైనట్లు చెప్పబడుట చె నిందతిశయోక్త్యలంకార మున్నది.

75. నీలాలకా మధుకరన్తి మనోజ్ఞనాసా
ముక్తారుచః ప్రకట కన్ద బిసాఙ్కురన్తి
కారుణ్య మంబ మకరన్దతి కామకోటి
మన్యేతతః కమలమేవ విలోచనం తే

అ|| కామకోటి - కామకోటి పీఠాధీశ్వరివైన, అమ్బ - ఓ యమ్మా!, నీలాలకాః - నల్లని ముంగురులు, మధుకరన్తి - తుమ్మెదలగు చున్నవి. మనోజ్ఞనాసా ముక్తారుచః - అందమైన ముక్కు ముత్తెపు కాంతులు, ప్రకట కన్దబిసాఙ్కురంతి - స్పష్టమైన కన్దమందలి తామర తూండ్ల మొలకలగు చున్నవి. కారుణ్యమ్ - దయ, మకరన్దతి - మరన్దమగు చున్నది. తతః - అందువలన, తే - నీ యొక్క, విలోచనమ్ - కంటిని, కమలమ్ ఏవ - కమలమును గానే, మన్యే - తలచు చున్నాను.

తా|| అమ్మా! నీ కన్నుమీద వాలు ముంగురులు తుమ్మెదలుగా, ముక్కు ముత్తెపు కాంతులు కందబిసాంకురములుగా కారుణ్యము మకరన్దముగా భాసించుటచే నీ కన్నును కమలమును గానే తలచు చున్నాను.

వి|| అమ్మవారి కన్నును కమలమునుగా భావించుట మన్యే అను

పదముచేత చెప్పబడుట చే నీ శ్లోకమునందు త్ప్రేక్షాలంకారము వాచ్యముగా నున్నది.

76. ఆకాంక్ష్య మాణ ఫలదాన విచక్షణాయాః
కామాక్షి! తావక కటాక్షక కామధేనోః
సమ్పర్క ఏవ కథ మమ్బ విముక్త పాశ
బన్ధాః స్ఫుటం తను భృతః పశుతాం త్యజన్తి

అ|| అమ్బ - అమ్మా!, కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, ఆకాంక్ష్యమాణ ఫల దాన విచక్షణాయాః - కోరిన ఫలములనిచ్చుటలో సమర్థురాలైన, తావక కటాక్షకకామధేనోః - నీ కటాక్షమనెడి కామధేనువు యొక్క, సంపర్క ఏవ - సంబంధమునందే, స్ఫుటమ్ - స్పష్టముగా, తను భృతః - దేహ ధారులు, విముక్త పాశబన్ధాః - విడువ బడిన పాశముల యొక్క బన్ధములు గలవారై, కథమ్ - ఎట్లు, పశుతామ్ - పశుభావమును, త్యజన్తి - విడచు చున్నారు.

తా|| అమ్మా! కామాక్షీ దేవీ! కోరిన ఫలముల నొసగుటలో సమర్థమగుటచే నీ కటాక్షము కామధేనువే. దాని సంబంధము కలిగిన తోడనే దేహధారులు పాశ బన్ధముల నుండి విడివడుదురు. ఇది యెట్లు?

వి|| కామధేనువు కూడ పశుత్వ జాతి యుతమే కావున పశువే. పశువు బన్ధింపబడునే కాని బంధముల నుండి యితరుల విడి పింపజాలదు. అమ్మవారి కటాక్ష కామధేనువు మాత్రము తన సంపర్కము కలిగిన యందఱిని బంధముల నుండి విడిపించును. అమ్మవారి కటాక్షమను కామధేనువు పశుజాతి స్వభావ విలక్షణముగా బన్ధ విమోచన మొనరించునట్లు చెప్ప బడుటచే నేర్పడిన విరోధము అమ్మ వారి కటాక్ష మహిమాతి శయముచే పరిహరింపబడు చున్నందున నీ శ్లోకమున విరోధాభాసాలంకారమొప్పుచున్నది. కటాక్షము నందు కామధేనుత్వారోపముచే నది రూపకాను ప్రాణిత మైనది.

77. సంసార ఘర్మ పరితాప జుషాం నరాణాం
కామాక్షి! శీతలతరాణి తవేక్షితాని
చన్ద్రా తపన్తి ఘనచన్దన కర్దమన్తి
ముక్తాగుణన్తి హిమవారి నిషేచనన్తి

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, శీతలతరాణి - మిక్కిలి చల్లనైన, తవ - నీ యొక్క, ఈక్షితాని - చూపులు, సంసార ఘర్మ పరితాపజుషాం - సంసార గ్రీష్మ పరితాపము నొందిన, నరాణామ్ - మనుష్యులకు, చన్ద్రాతపన్తి - వెన్నెలలగుచున్నవి. ఘనచన్దన కర్దమన్తి - గంధపు ముద్దలగు చున్నవి. ముక్తాగుణన్తి - ముత్తెముల హారములగు చున్నవి. హిమవారినిషేచనన్తి - హిమ జలము యొక్క అభిషేకములగు చున్నవి.

తా|| అమ్మవారి చల్లని చూపులు సంసారమను గ్రీష్మము యొక్క పరితాపముచే తపించిన మనుష్యులకు వెన్నెలలు గంధపు ముద్దలు, ముత్తెముల హారములు హిమ జలాభిషేకములగు చున్నవి.

వి|| ఎండ కాలమున మనుష్యులు తాపముపశమింపజేసి కొనుటకై వెన్నెలలను చందన చర్చలను సేవించెదరు. ముత్తెముల హారముల ధరించెదరు. మంచు వేసిన నీటి నొంటిపై జల్లుకొందురు. సంసార గ్రీష్మ తాప తప్తులగు వారి కమ్మవారి కటాక్షములే వెన్నెలలవలె గంధపు బూతలవలె ముత్తెముల వలె చల్లని నీటి జల్లుల వలె నాచరించు చున్నవని చెప్పుటచే ఉపమానముల మాల యుండుటచే నీ శ్లోకమున మాలోపమాలంకారమున్నది.

78. ప్రేమామ్బురాశి సతతస్నపితాని చిత్రం
కామాక్షి! తావక కటాక్ష నిరీక్షణాని
సంధుక్షయన్తి ముహు రిన్ధనరాశిరీత్యా
మారద్రుహో మనసి మన్మథ చిత్రభానుమ్

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, ప్రేమామ్బురాశి సతతస్నపితాని - ప్రేమ సముద్రము నందు నిరంతరము మునిగిన, తావక కటాక్ష నిరీక్షణాని - నీకడగంటి చూపులు, ముహుః - మాటి మాటికి, ఇన్ధన రాశిరీత్యా - ఇన్ధన సమూహము వలె, మారద్రుహః - మన్మథునకు ద్రోహ మొనర్చిన శివుని యొక్క, మనసి - మనస్సునందు, చిత్రమ్ - వింతగా, మన్మథ చిత్రభానుమ్ - మన్మథాగ్నిని సంధుక్షయన్తి - జ్వలింపజేయు చున్నవి.

తా|| అమ్మవారి కడగంటి చూపులు ప్రేమ సముద్రములో మునిగి యుండియు నిన్ధన రాశి వలె మాటి మాటికి శివుని మనస్సు నందు మన్మ

థాగ్నిని రగులు కొల్పు చున్నవి.

వి|| ప్రేమ సముద్రములో మునిగిన అమ్మవారి చూపులు శివుని మన్మథాగ్ని రగులు కొల్పుట విరోధము. తడిసిన ఇంధనములు అగ్నిని రగుల్పలేవు గదా! ఈ విరోధము చిత్రమ్ అనుపదముతో చెప్పబడి కటాక్ష మహిమాతిశయముచే పరిహరింప బడుటచే నీ శ్లోకమున విరోధాభాసాలంకారము కలదు.

79. కాలాంజన ప్రతిభటం కమనీయ కాన్త్యా
కన్దర్ప తన్త్రకలయా కలితాను భావమ్
కాంచీ విహార రసికే కలుషార్తి చోరం
కల్లోలయస్వ మయి తే కరుణాకటాక్షమ్

అ|| కాంచీ విహార రసికే - కాంచీపట్టణము నందు విహరించుటలో రసించునో దేవీ, కమనీయ కాన్త్యా - అందమైన కాంతితో, కాలాంజనప్రతిభటమ్ - నల్లని కాటుకకు దీటైన, కన్దర్పతంత్ర కలయా - అనంగ తన్త్ర విద్య చేత, కలితాను భావమ్ - పొందిన గొప్పతనముగల, కలుషార్తిచోరమ్ - దోషముల దుఃఖముల దొంగిలించు, తే - నీ యొక్క, కరుణాకటాక్షమ్ - దయగల చూపును, మయి - నా యందు, కల్లోల యస్వ - పొంగింపజేయుము.

తా|| ఓ దేవీ! నీ చూపు కాంతి చేతనే కాలాంజనముతో బోలియున్నది మన్మథాగమముతో మరింత గొప్ప తనము నొంది యున్నది. దోషముల దుఃఖముల నపహరించు నీ కరుణా కటాక్షమును నా యందు బఱపుము.

వి|| అమ్మవారి కటాక్షము కరుణగల దొంగ కావుననే తన కలుషదోషముల నపహరింపగ వేడికొను చున్నాడు. అమ్మవారి కన్ను, కాటుక అక్కఱ లేనంత నల్లని కాంతిని గలిగి యున్నది. మరొక విధముగా తాను ధరించిన కాటుకనే యోడించ గలిగి యున్నది. దొంగను దనకడకు బంపుమని కోరుట యిందలి చిత్రము.

80. క్రాంతేన మన్మథ మదేన విమోహ్యమాన
స్వాంతేన చూత తరుమూలగతస్య పుంసః
కాంతేన కించి దవలోకయ లోచనస్య
ప్రాంతేన మాం జనని కాంచిపురీవిభూషే

అ|| కాంచిపురీవిభూషే - కాంచీ పట్టణమున కలంకారమైన, జనని - యో తల్లీ!, క్రాంతేన - విక్రమించిన, మన్మథమదేన - కాముని మదముచే, చూత తరుమూలగతస్య - మామిడి చెట్టు మూలముననున్న, పుంసః - పురుషుని యొక్క (ఏకామ్రేశ్వరుని యొక్క) విమోహ్యమాన స్వాంతేన - మోహించిన మనస్సుగల, కాంతేన - మనోహరమైన, లోచనస్య - కంటి యొక్క, ప్రాంతేన - కొన చేత, మాం - నన్ను, కించిత్ - కొంచెము, అవలోకయ - చూడుము.

తా|| ఓ తల్లీ! నీ కంటి కొన యందు మన్మథుని మదమున్నది. అది యేకామ్రేశ్వరుని మనస్సును మోహింప జేయుచున్నది. అందమైన యాకంటి కొనతో నన్ను కొంచెము చూడుము.

వి|| నిరంతరము భర్తనే చూచుచు నాతనినే మోహింప జేయుచున్న నీవు బిడ్డనైన నన్ను కొంచెము సేపైన చూడుము. అని జనని అను పదముచే వ్యంగ్యమగుచున్నది. ఈ శ్లోకమున క్రాంతేన, స్వాంతేన, కాంతేన, ప్రాంతేన అను నాల్గు పదములు నాల్గు పాదముల మొదట నుండుటచే ఆద్యను ప్రాసమను పేరు గల శబ్దాలంకారమున్నది. శివునకు అని అనుటకు బదులుగా చూత తరుమూల గతుడైన, పురుషునకు అని అనుట చేత అనగా భంగ్యంతరముగా శివుని చెప్పుటచేత పర్యాయోక్తాలంకారమను పేరు గల అర్థాలంకారమున్నది.

81. కామాక్షి! కేఽపి సుజనా స్త్వదపాంగ సంగే
కంఠేన కన్దలిత కాలిమ సంప్రదాయాః
ఉత్తంస కల్పిత చకోరకుటుమ్బపోషా
నక్తందివ ప్రసవ భూ నయనా భవంతి

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, కే అపి - ఎవరో, సుజనాః - సజ్జనులు, త్వదపాంగ సంగే - నీకడగంటి చూపుల కలయిక యందు, కంఠేన - మెడతో, కన్దలిత కాలిమ సంప్రదాయాః - గడ్డకట్టించిన నలుపు దనము యొక్క సంప్రదాయము కలవారుగా, కల్పిత - కల్పింపబడిన, ఉత్తంస - శిరోభూషణము (చంద్రుని) చేత, చకోరకుటుమ్బ - చకోరకుటుమ్బముల యొక్క, పోషాః - పోషణము గల వారుగా, నక్తందిన - రాత్రింబవళ్ళు, ప్రసవ - పుట్టుకకు, భూ - చోట్లు (సూర్యచంద్రులు), నయనాః - కన్నులుగా గల వారుగా, భవన్తి - అగుచున్నారు.

తా|| అమ్మవారి చూపు పడిన పుణ్యాత్ములు సజ్జనులైన కొందఱు మాత్రమే నల్లని మెడగల వారుగా (నీల కంఠులుగ) శిరస్సున చంద్రునలంకరించు కొనువారుగా (చంద్రశేఖరులుగ) సూర్య చంద్రులు కన్నులుగా గలవారుగా సూర్య చంద్ర నేత్రులుగా నగుదురు.

వి|| అమ్మవారి చూపు బడిన పుణ్యాత్ములు శివరూపమును పొందుదురనుటకు బదులుగా చంద్రశేఖరులుగా సూర్య చంద్రనేత్రులు గా నగుదురని భంగ్యంతరముగా చెప్పుటచే నీ శ్లోకమున బర్యాయోక్తాలంకారమున్నది.

82. నీలోత్పల ప్రసవకాన్తి నిదర్శనేన
కారుణ్య విభ్రమ జుషా తవ వీక్షణేన
కామాక్షి! కర్మ జలధేః కలశీ సుతేన
పాశత్రయా ద్వయ మమీ పరిమోచనీయాః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, నీలోత్పల ప్రసవకాన్తి నిదర్శనేన - నల్లగలువ పూవు యొక్క కాంతిని బ్రదర్శించు, కారుణ్య విభ్రమజుషా - దయ యొక్క విలాసమును బొందిన, కర్మజలధేః - కర్మయను సముద్రమునకు, కలశీసుతేన - అగస్త్యుడైన, తవ - నీ యొక్క, వీక్షణేన - చూపు చేత, అమీ - ఈ, వయమ్ - మేము, పాశత్రయాత్ - పాశముల మూడింటి నుండి, పరిమోచనీయాః - విడిపింప దగినవారము.

తా|| నీ చూపు నల్లని కాంతిని బ్రదర్శించునది. కారుణ్యమే విలాసముగా

గలిగి యున్నది. అది కర్మ సముద్రమునగస్త్యుని వలె త్రాగి వేయునట్టిది. అట్టి నీ చూపు మమ్ము పాశత్రయము నుండి విడిపింప వలెను తల్లీ!

వి|| నీలోత్పల ప్రసవకాన్తి నిదర్శనేన అను సమాసమున అన్య ధర్మమునన్యత్ర యారోపించుట (నీలోత్పల కాంతిని అమ్మవారి కన్ను ప్రదర్శించుట) చే నిదర్శనాలంకారమున్నది. కారుణ్య విభ్రమ జుషా అను సమాసమున చుట్టు భక్తులు మూగియుండుటచే వారిపై గల కరుణ తోనిటునటుతిరుగు, లేక కారుణ్యమును బొందిన అను నర్థాంతరములు కూడ చెప్పవచ్చును. కర్మజలధేః కలశీ సుతేన అను సమాసములో రూప కాలంకారమునున్నది. మూడవ పాదమున రెండు కకారములు, నాల్గవ పాదమున రెండు పకారములు - ఒకటవ తొమ్మిదవ అక్షరములుగా నుండుటచే దాక్షిణాత్య భాషా సంప్రదాయము ననుసరించి యతి అలంకారిక సంప్రదాయము ననుసరించి వృత్త్యాను ప్రాసము అను శబ్దాలంకారమును కలవు.

83. అత్యన్త చఞ్చల మకృత్రిమ మఞ్జనం కిం
ఝుంకారభంగిరహితా కిము భృఙ్గమాలా
ధూమాఙ్కురః కిము హుతాశన సఙ్గహీనః
కామాక్షి! నేత్ర రుచి నీలిమ కన్దలీ తే

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, నేత్రరుచి నీలిమకన్దలీ - కంటి కాంతి యనెడి నలుపు మొలక, అత్యన్తచంచలమ్ - మిక్కిలి చంచలమైన, అకృత్రిమమ్ - సహజమైన, అంజనమ్ కిమ్ - కాటుకయా, ఝుంకారభఙ్గిరహితా - ఝుంకారపు తీరులేని, భృఙ్గమాలా కిమ్ ఉ - తుమ్మెదల వరుసయా, హుతాశనసఙ్గహీనః - అగ్ని సమ్పర్కము లేని, ధూమాఙ్కురః - కిమ్ ఉ - పొగమొలకయా.

తా అమ్మా నీ నేత్ర కాంతి మిక్కిలి చంచలమైన సహజమైన కాటుకయా? ఝుంకారములేని తుమ్మెదల వరుసయా? అగ్ని సంపర్కము లేని పొగ మొలకయా?

వి|| అంజనమునకు చాంచల్య ముండదు. భృంగమాల ఝుంకార

రహితముగా నుండదు. పొగ మొలక అగ్ని సంపర్కము లేక యుండదు. అమ్మవారి నేత్ర రుచి యీ మూడు వస్తువులుగా నుల్లేఖింప బడుటచే నుల్లేఖాలంకార మీ శ్లోకమున నున్నది.

84. కామాక్షి! నిత్య మయ మఞ్జలి రస్తు ముక్తిః
బీజాయ విభ్రమ మదోదయ ఘూర్ణితాయ
కన్దర్పదర్ప పునరుద్భవ సిద్ధిదాయ
కల్యాణదాయ తవ దేవి దృగఞ్చలాయ

అ॥ కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, ముక్తిబీజాయ - ముక్తికి మూలమైన, విభ్రమ - విలాసము యొక్క, మద - మదము యొక్క, ఉదయ - పుట్టుక చే, ఘూర్ణితాయ - భ్రమించు, కన్దర్ప - మన్మథుని, దర్ప - గర్వము యొక్క, పునః - మరల, ఉద్భవ - పుట్టుకయను, సిద్ధి - సిద్ధిని, ద - ఇచ్చు, కల్యాణదాయ - శుభముల నొసగు, తవ - నీ యొక్క, దృగఞ్చలాయ - కంటికొన కొఱకు, నిత్యమ్ - ఎల్లప్పుడు, అయమ్ - ఈ, అఞ్జలిః - దోసిలి, అస్తు - అగుగాక.

తా॥ అమ్మా నీ కటాక్షము విభ్రమ మదముల పుట్టుకచే తిరుగుచున్నది. చచ్చిన మన్మథుని గర్వమును మరల బుట్టించు చున్నది. శుభముల నిచ్చు నట్టిది. అట్టి నీకటాక్షమునకు ఇదిగో దోసిలొగ్గు చున్నాను.

వి॥ శివుడు మొదట కాముని చంపియు మరల కామమునకు లోబడి పార్వతిని బెండ్లాడుట, యామెకర్ధదేహమిచ్చుట, ఆమె సంగమునువీడ కుండుట కాముడు మరల పుట్టినాడనుటకు నిదర్శనములు.

85. దర్పాఙ్కురో మకరకేతన విభ్రమాణాం
నిద్రాఙ్కురో విదలితోత్పల చాతురీణామ్
దీపాఙ్కురో భవ తమిస్రకదమ్బకానాం
కామాక్షి! పాలయతు మాం త్వదపాంగపాతః

అ॥ కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, మకరకేతన విభ్రమాణామ్ - మన్మథుని

విలాసముల యొక్క, దర్పాఙ్కురః - గర్వపు మొలక యైన, విదళితోత్పల చాతురీణామ్ - వికసించిన కలువల చాతుర్యము యొక్క, నిన్దాఙ్కురః - నిన్దారంభముగా నున్న, భవతమిస్ర కదమ్బ కానామ్ - సంసార మనెడి చీకటి గుంపులకు, దీపాఙ్కురః - చిన్నదీపమైన, త్వదపాఙ్గ పాతః - నీ కటాక్షము, మామ్ - నన్ను, పాలయతు - కాపాడుగాక!

తా|| అమ్మా! నీ కటాక్షము మన్మథ విలాసముల గర్వము. వికసించిన కలువల నైపుణ్యమునకు నింద . సంసారాన్ధ కారమునకు దీప కలిక. అట్టి నీ కటాక్షము నన్ను నిరంతరము కాపాడుగాక!

వి|| అమ్మవారి కటాక్షమునందు అంకుర త్రయారోప ముండుటచే మాలారూపకాలంకార మున్నది. వాని అంకుర త్రయమున మూడవ యారోపము భవమునందు తమిస్రారోపముతో సమంజసమగు చున్నందున మూడవ పాదమున పరమ్పరిత రూపకాలంకారమున్నది.

86. కైవల్య దివ్య మణి రోహణ పర్వతేభ్యః
కారుణ్య నిర్ఝర పయః కృతమజ్జనేభ్యః
కామాక్షి! కింకరిత శంకర మానసేభ్యః
తేభ్యో నమోఽస్తు తవ వీక్షణ విభ్రమేభ్యః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, కైవల్య దివ్య మణి రోహణ పర్వతేభ్యః - కైవల్యమను దివ్య మణికి రోహణ గిరులైన, కారుణ్య నిర్ఝర పయః, కృతమజ్జనేభ్యః - దయాప్రవాహ జలమున చేయబడిన, కింకరిత శంకర మానసేభ్యః - సేవకముగా చేయబడిన శివుని మనస్సుగల, తేభ్యః- ఆ, తవ - నీ యొక్క, వీక్షణ విభ్రమేభ్యః - చూపుల విలాసముల కొఱకు, నమః - నమస్సు, అస్తు - అగుగాక.

తా|| అమ్మా! నీ వీక్షణ విభ్రమములు కైవల్య దివ్యమణికి రోహణగిరులు, దయాప్రవాహ జలమున స్నాతములైనట్టివి. శివుని మనస్సును దాసముగా నొనరించు కొన్నట్టివి. అట్టి నీ వీక్షణ విభ్రమములకు నా నమస్సగుగాక.

వి|| రోహణగిరి మణి జన్మస్థానము. కైవల్యమణి కమ్మవారి వీక్షణ

విభ్రమములు రోహణ గిరులగుటచే నీ మొదటి పాదమున రూపకాలంకారము కలదు. రెండవ పాదమున అమ్మవారి వీక్షణ విభ్రమములు దయగలవని చెప్పుటకు దయాప్రవాహ జలముగా రూపింప బడి ఆ జలముననవి స్నానము చేసినట్లున్నవని చెప్పుటచే నతిశయోక్త్యా లంకారము, రూపకానుప్రాణితమై యొప్పు చున్నది. స్నాన సంబంధము లేని వీక్షణ విభ్రమముల యందు స్నాన సంబంధములు చెప్పుటచే నీ యతిశయోక్తి అసంబంధ సంబంధాతి శయోక్త్యాలంకార భేదమగుచున్నది. మూడవ పాదమున శివుని మనస్సున కింకర భావారోపణ ముండుటచే రూపకాలంకార మున్నది.

87. అల్పీయ ఏవ నవ ముత్పల మమ్బ! హీనా
మీనస్య వా సరణి రమ్బురుహాం చ కిం వా
దూరే మృగీ త దసమఞ్జస మఞ్జనం చ
కామాక్షి! వీక్షణ రుచౌ తవ తర్కయామః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, అమ్బ - అమ్మా, తవ - నీ యొక్క, వీక్షణరుచౌ - కంటి కాంతి యందు, నవమ్ - కొత్తదైన, ఉత్పలమ్ - కలువయైనను, అల్పీయ ఏవ - మిక్కిలి తక్కువయే, అమ్బురుహాం చ - కమలముల యొక్కయు, మీనస్యచ - చేప ముక్కయు, సరణిః వా - తీరైనను, హీనా - తక్కువదే, కిమ్ వా - మరియు, మృగీ - లేడి యైనను, దూరే - దూరమందున్నదే, తత్ - ఆ, అఞ్జనంచ - కాటుకయు, అసమఞ్జసమ్ - సమఞ్జసముగా నుండదు అని, తర్కయామః - ఊహించు చున్నాను.

తా|| అమ్మవారి కంటి కాంతిలో కొత్త కలువయు చిన్నదై పోవును. చేపయు తక్కువదై పోవును. లేడియో దూరమందున్నదియే యగును. ఆ కాటుకయు నయోగ్యముగానే కన్పడునని యూహించు చున్నాము.

వి|| నవోత్పల మందు అల్పీయస్త్వము. చేపయందు కమలముల యందున హీనత్వము లేడి యందు దూరస్థత్వము కాటుక యందు నసమంజసత్వవ ఊహించు చున్నామని ఉపమాన నింద చెప్పబడుటచే నీ శ్లోకము ప్రతీపాలంకార మొప్పుచున్నది.

88. మిశ్రీభవద్గరల పఙ్కిల శాఙ్కరోర
స్స్రిమాఙ్గణే కిమపి రిఙ్ఖణ మాద ధానః
హేలావధూత లలిత శ్రవణోత్పలోఽసౌ
కామాక్షి! బాల ఇవ రాజతి తే కటాక్షః

అ|| కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, అసౌ - ఈ, తే - నీ యొక్క, కటాక్షః - చూపు, మిశ్రీభవత్ - కలసిపోవు చున్న, గరల - విషము యొక్క, పఙ్కిల - బురద యైన, శాఙ్కర - శివునకు సంబంధించిన, ఉరస్స్రి మాఙ్గణే - వక్షః ప్రదేశపు వాకిట, రిఙ్ఖణ మాదధానః - అంబాడుట లేక దోగాటను చేయుచున్న, హేలా - విలాసముగా, అవధూత - విదల్చిన, లలిత - అందమైన, శ్రవణ - చెవియందలి, ఉత్పలః - కలువగల వాడై, బాలః ఇవ - బాలుని వలె, రాజతి - ప్రకాశించు చున్నది.

తా|| అమ్మా! నీ చూపు విషపు కాంతిచే బురదయైన శివుని వక్షో దేహమున చెవి యందలి కలువను విదల్చుచు బాలునివలె దోగాడు చున్నది.

వి|| పిల్లలు వాకిటిలోని బురదమట్టిలో నాడు కొందరు. చెవికున్న యలంకారమును చేతితో కదలించు కొనుచుందురు. అమ్మవారి కటాక్ష బాలకుడు శివుని రొమ్మున దోగాడుచు చెవి కలువను విదలించు చున్నాడని యుత్ప్రేక్షించుట వలన నీ శ్లోకమున నుత్ప్రేక్షాలంకారము కలదు. అమ్మవారి చూపు ఉత్పలమును మించి నల్లగా నున్నదని చెప్పుటకు చెవి యందలి యుత్పలమును విదల్చు చున్నదని చెప్పుటనే ఉపమాన నింద వ్యక్తమగు చుండుటచే ప్రతీపాలంకారము మూడవ పాదమున స్ఫురించు చున్నది. శివుని యురము తెల్లనిది. కంఠము నల్లనిది. విషముచే కంఠము నల్లనైనది. ఆ నల్లని కాంతి యురమున వ్యాపించి యున్నది. తెల్లని కాంతి నీరుగా, నలుపును మట్టిగా భావించి నప్పుడు నీటితో కలసిన మట్టి బురదగా శివుని యురమును వాకిట దోచును. శివుని యురము వాకిలిగా రూపింపబడుటచే నిట రూపకాలంకారమున్నది.

89. ప్రౌఢీకరోతి విదుషాం నవసూక్తి ధాటీ
చూతాటవీషు బుధకోకిల లాల్యమానమ్

మాధ్వీరసమ్ పరిమలం చ నిరర్గలం తే
కామాక్షి! వీక్షణ విలాస వసంత లక్ష్మీః

అ||. కామాక్షీ - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, వీక్షణ విలాస వసంతలక్ష్మీః - కంటి యొక్క విలాసమనెడి వసంతము యొక్క సంపత్తి, విదుషామ్ - విద్వాంసుల యొక్క, నవ - కొత్తవైన, సు - మంచి, ఉక్తి - మాటలయొక్క, ధాటీ - వేగములనెడి, చూతాట వీషు - మామిళ్ళ వనములందు, బుధకోకిలలాల్యమానమ్ - పండితులనెడి కోకిలలచే ఆస్వాదింప బడు, మాధ్వీరసమ్ - తేనెను, నిరర్గలమ్ - అడ్డులేని, పరిమలమ్ చ - వాసనను, ప్రౌఢీకరోతి - అధికముగా నందించు చున్నది.

తా|| అమ్మా! నీ చూపు వసంత లక్ష్మి. అది పండిత వాగ్వనములందు బండితులనెడి కోకిలలచే నాస్వాదింప దగిన తేనెను వాసనను బుష్కలముగా నందించు చున్నది. అమ్మవారి దయగల చూపులెవరి పై ప్రసరించునో వారు రసవంతమైన ఆమోద భరితమైన కవిత్వమును జెప్పి పండితుల నానందింప జేయుదురు.

వి| పండితుల సూక్తులందు చూతాటవీత్వారోపము బుధుల యందు కోకిలత్వారోపము అమ్మవారి చూపు నందు వసంత లక్ష్మి త్వారోపమును చేయబడుటచే నీ శ్లోకమున రూపకాలంకారము గలదు. వసంతర్తువున బూవులు బాగుగా పూచి వాని యందు మకరందము పుట్టును. తెనెటీగలు దాని నొకచోట చేర్చి తేనె పట్టులను సిద్ధము చేయును. మామిడి పూవులలో వాసనను తేనెను ఆస్వాదించుచు కోకిలలా నందించును. ఇతరములై చెట్లు గూడ పూచి తేనెను, మంచి పరిమలము నందించును. ఇట్టి పరిస్థితులల ముగ్ధల కన్నులలో సైతము విలాసములుదయించును. ప్రౌఢత్వమును ప్రకటించుచుందురు. అట్టి తఱి యువతులు పరిమళము వ్యాపింప జేయు చుందురు. వారిపెదవులలో తేనె లూరుచుండును. యౌవన మదముగో వారు ప్రియుల సమక్షమున సహజమైన లజ్జను కొంత విడచి ప్రౌఢత్వము ప్రదర్శించుచు తమకు తామై వారి నానందింపజేయుదురు. ఈ వస్తు వంతయు నీశ్లోకమున వ్యంగ్య మగుటచే నట అర్థశక్తి మూల వస్తుధ్వని యున్నది.

90. కూలంకషం వితనుతే కరుణామ్బువర్షీ
సారస్వతం సుకృతిన స్సులభమ్ ప్రవాహమ్
తుచ్ఛీకరోతి యమునామ్బు తరఙ్గభఙ్గీం
కామాక్షి! కిం తవ కటాక్షమహామ్బువాహః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, కరుణామ్బువర్షీ - దయాజలమును వర్షించునట్టి, తవ - నీ యొక్క, కటాక్షమహామ్బువాహః - చూపనెడి గొప్ప మేఘము, సారస్వతమ్ - భాషకు సంబంధించిన, కూలం కషం - ఒడ్లనొఱయ, ప్రవాహమ్ - ప్రవాహమును, సుకృతినః - పుణ్యాత్మునకు, సులభమ్ - సుఖముగా లభించు దానినిగా, వితనుతే - చేయు చున్నది. యమునామ్బు తరంగ భంగీమ్ - యమునా నదీజల తరంగముల తీరును, తుచ్ఛీకరోతి, కిమ్ - అల్పమునుగా నొనరించు చున్నదాయేమి?

తా|| నీ కటాక్షము దయాజలమును వర్షించుటచే మేఘమేయగుచున్నది. అది పుణాత్మునికి కూలంకష సారస్వత ప్రవాహమును సులభ మొనరించు చున్నది. యమునానదీ తరఙ్గముల తీరు నవమానించు చున్నదో యను నట్లున్నది.

వి|| మేఘము జలమును వర్షించును. అమ్మవారి చూపు దయను వర్షించును. అని దయాజలములకు, కటాక్ష మేఘముల కభేదమును చెప్పుటచే నిచట రూపకాలంకార మున్నది. ఇంతే కాదు పుణ్యాత్మునికా చూపు మేఘము కూలంకషమైన సారస్వత ప్రవాహమును సులభ మొనర్చు ననుటచే భాష యందు నద్యారోపణము వ్యక్తమగుచున్నది. యమునామ్బు తరంగ భంగి నవమానించు ననుటచే అమ్మవారి చూపు నందలి నీల్గిమాతి శయము వ్యక్తమగు చున్నది. ఉపమానముకాదగిన యమునా నదీ తరంగ భంగినవమానించు ననుటచే నుపమాన నింద యుండుటచే నుత్తరార్ధమున ప్రతీపాలంకారమొప్పుచున్నది.

91. జాగర్తి దేవి కరుణా శుక సున్దరీ తే
తాటఙ్కరత్న రుచి దాడిమఖణ్డశోణే
కామాక్షి! నిర్భర కటాక్ష మరీచి పుఞ్జ
మాహేన్ద్ర నీలమణి పఞ్జర మధ్యభాగే

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, తే - నీ యొక్క, కటాక్ష - చూపుయొక్క, మరీచి - కిరణము యొక్క, పుఞ్జ - సమూహమనెడి, మాహేన్ద్ర నీలమణి - ఇంద్ర నీలమణి నిర్మితమైన, పఞ్జర - పంజరము యొక్క, మధ్యభాగే - నడిమి ప్రదేశమున, తాటఙ్క - కమ్మల యందలి, రత్న - రత్నముల యొక్క, రుచి - కాంచి యనెడి, దాడిమ - దానిమ్మ పండు యొక్క, ఖణ్డ - ముక్క యొక్క, శోభే - కాంతిగల, కరుణా శుకసున్దరీ - దయయను యాడు చిలుక, జాగర్తి - మేలుకొని యున్నది.

తా|| అమ్మా! నీ కటాక్ష కాంతి సమూహమొక యింద్ర నీల మణి నిర్మిత పంజరము. అందులో కమ్మల కాంతి యను దానిమ్మ పండు ముక్క శోభించు చున్నది. ఆ పఞ్జరమున దయయను నాడు చిలుక మేలుకొని యున్నది.

వి|| కటాక్ష మరీచి పుంజము మహేన్ద్ర నీలమణి రత్న నిర్మిత పంజరముగా అందలి కమ్మల కాంతి దానిమ్మ పండు యొక్క ముక్కగా అందున్న కరుణ శుకసుందరిగా రూపింపబడుటచే నిందు రూపకాలంకారమున్నది. పంజరమున శుకము బంధించుట దాని కాహారముగా దానిమ్మ పండు ముక్క నుంచుట లోకసిద్ధములే. కాని దాని యందు చిలుక కొంత కాలము మేలుకొని కొంత కాలము నిద్రించి యుండును. దయ అమ్మవారి కటాక్షకాంతి యను పంజరమందు నిరంతరము మేల్కొని యుండునాడు చిలుక భక్తులకెప్పుడే యవసరము వచ్చునో వారికే యాపద మూడునో యని మేలుకొని యుండి వారి యావశ్యకతను దీర్చుచు వారి నాపదల నుండి రక్షించు చున్నది - యని జాగర్తి యను శబ్దము వ్యంజింపజేయు చున్నది మగవారి కన్న నాడువారి యందు దయ యెక్కువగా నుండును. కావున నిట శుకసున్దరి యను శబ్దము చేత నాదయ మిక్కిలి గొప్పదని వ్యంజింప జేయ బడినది.

92. కామాక్షి! సత్కువలయస్య సగోత్రభావా
దాక్రామతి శ్రుతి మసౌ తవ దృష్టిపాతః
కిం చ స్ఫుటం కుటిలతామ్ ప్రకటీకరోతి
భ్రూవల్లరీ పరిచితస్య ఫలం కి మేతత్

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, అసౌ - ఈ, దృష్టిపాతః - కటాక్షము, సత్కువలయస్య - మంచికలువయొక్క, సగోత్రభావాత్ - సోదర భావము వలన, శ్రుతిమ్ - చెవిని (వేదమును), ఆక్రామతి - ఆక్రమించు చున్నది. కిమ్ చ - మరియు, స్ఫుటమ్ - స్పష్టముగా, కుటిలతామ్ - వక్రతను (కపటమును), ప్రకటీకరోతి - ప్రకటన చేయు చున్నది, ఏవత్ - ఇది, భ్రూవల్లరీ పరిచితస్య - తీగవంటి కనుబొనుల పరిచయమునకు, ఫలమ్ కిమ్ - ఫలమా యేమి?

తా|| అమ్మా! నీ చెవిపై నల్ల కలువ యలంకరింపబడి యున్నది. అది చూచి నీ చూపు కూడ చెవినాక్రమించు చున్నది. కువలయమునకు చూపునకు సామ్యమే. సగోత్ర భావము శ్రుత్యతి క్రమణము వలననే నీ చూపు కుటిలతను గూడ ప్రకటించు చున్నది. కనుబొమలు తీగలవలెవంకరలు తిరిగి యుండుటచే నా కను బొమ్మల పరిచయము వలన చూపులకునూ వక్రత యేర్పడినదా? యేమి?

వి|| చెవిపై నలంకరించు కొనబడిన కలువ కొంచెము వంకరగానే యుండును అట్లు వక్రముగా చేయకున్నచో చెవిపై నది నిలువజాలదు ఎట్లైన నేమి కువలయము మంచిదే యైనను దానికి వక్రతయే యేర్పడినది యని సత్ అను శబ్దము వ్యంజింప జేయుచున్నది. చూపును కలువతో బోల్చుట కవి సమయ సిద్ధమే. పోలికయే యిట కువలయ కటాక్షముల సగోత్రభావకల్పనకు మూలము. సామ్యమున్నచోట సోదర భావము నూహించు కొనుట లోక సహజము. అన్న దమ్ముల పోలిక లోక సహజము. పైగా అన్నను దమ్ముడనుకరించుచునే యుండును. కలువ యొక్క శ్రుత్యతి క్రమణమును (చెవి నాక్రమించుకొని యుండుటను) చూచి చూపును (శ్రుతిని, చెవిని) ఆక్రమించు చున్నదా యేమి? యని చూపు నందు సహజ సిద్ధమైన చెవిదాక వ్యాపించుటను శ్రుత్యతిక్రమణముగా నుత్ప్రేక్షించుటచే పూర్వార్థమున నుత్ప్రేక్షాలంకారమున్నది. శ్రుత్యతిక్రమణము చేయు వారికి కుటిలత యబ్బును. అమ్మవారి చూపు నకు గూడ శ్రుత్యతిక్రమణము చేతనే కుటిలత యబ్బినదా? కనుబొమ్మల కుటిలత చూపుల కుటిలత కన్న మిక్కిలి స్పష్టము కావున భ్రూవల్లరితో పరిచయము చేయుట చేతనే కనుబొమ్మల వక్రత నీ చూపున కబ్బినదా యేమి యని కనుబొమ్మల

పరిచయమునకు ఫలముగా నేర్పడకున్నను చూపులోని వక్రత కది పరిచయ హేతువుగా నుత్ప్రేక్షించుటచే నుత్తరార్ధమున హేతూత్ప్రేక్షాలంకారమున్నది.

93. ఏషా తవాక్షి సుషమా విషమాయుధస్య
నారాచవర్ష లహరీ నగరాజ కన్యే
శఙ్కే కరోతి శతధా హృది ధైర్యముద్రాం
శ్రీకామకోటి యదసౌ శిశిరాంశు మౌలేః

అ|| నగరాజ కన్యే - పర్వత రాజ కుమారి వైన, శ్రీకామకోటి - ఓ కామకోటి పీఠాధీశ్వరీ, తవ - నీ యొక్క, ఏషా - ఈ, అక్షిసుషమా - కంటికాంతి, విషమాయుధస్య - మన్మథుని యొక్క, నారాచవర్ష లహరీ - బాణ వర్షము యొక్క పొంగు, యత్ - ఎందువలననగా, అసౌ - ఇది (కంటికాంతి), శిశిరాంశు మౌలేః - చంద్రుడు శిరమందుగల శివుని యొక్క, హృది - మనస్సునందలి, ధైర్యముద్రాం - ధైర్యలక్షణమును, శతధా - నూరు ముక్కలుగా, కరోతి - చేయు చున్న దేమోయని, శఙ్కే - అనుకొను చున్నాను.

తా|| హిమవత్పర్వత సుతవైన యో కామాక్షీ దేవీ! నీయక్షి కాంతి మన్మథుని బాణ వర్షముగా తలపోయుదును. ఏలననగా నది శివుని మనస్సులోని ధైర్యమును నూరు ముక్కలు చేయు చున్నది.

వి|| శివుని ధైర్య మాతని మనస్సులో నున్నది. బాణములు శరీరములో బయటి భాగమునే గాయ పఱచ గలవు. ఒక్క మన్మథుని బాణముల మనస్సును గాయ పఱచ గలవు. అందువలననే నీ కంటికాంతి మన్మథబాణ వర్షముగా తలపోయు చున్నాను అని అమ్మవారి కంటి కాంతి యందు మన్మథ బాణ వర్షలహరీత్వము త్ప్రేక్షింపబడుటచే నిందు త్ప్రేక్షాలంకార మొప్పు చున్నది. శివుడు విషమాంబకుడు. అనగా బేసి కన్నులు గలవాడు మన్మథుడు విషమాయుధుడు. మన్మథుని బాణములైదు. కావుననాతడు బేసి యాయుధములు కలవాడు. సములకే కలహము శోభిల్లును. కా శివునితో మన్మథుడు తలపడినాడు. అయినను మూడు కన్న ఐదు పెద్ద సంఖ్య కావున మన్మథుని బలము గొప్పది. కావుననే శివుడు

యెదలోపలిధైర్యమును నూరు ముక్కలు చేయగలిగి నాదని విషమాయుధ శబ్దమువ్యంజింపజేయు చున్నాడు. ఆరంభమున మన్మథుడు శివునితో తలపడినను ఎదలో కలవరమారంభమైనను తన యెదలో నెట్టి వికారము కలుగనట్లు గాంభీర్యమును జూపుచు తాను మన్మథుని బాణములకు కలవరపడలేదని సూచించు చుండెను. కాని పాపమా శివుడెంత కాలము మన్మథుని నారాచవర్షలహరి కోర్వగలడు. ఒకటా, రెండా, ఆ ఐదు బాణములనే మరల మరల వర్షమువోలె కురిపించెను. శివుని ధైర్యమునూరు ముక్కలయ్యెను. అమ్మవారి కోడి తన శరీరములోని సగభాగమునే యర్పించు కొని సంధి చేసికొనెను. ఇంతకు మన్మథుని యాయయిదు బాణములలో అమ్మవారి కంటికాంతితో నభేదము పొందియే మన్మథుడు విజయము నొందెను అని అమ్మవారి కంటి కాంతి యందు మన్మథు నారాచవర్ష లహర్యుత్ప్రేక్షణము వ్యంజింప జేయుచున్నది.

అవ|| పై శ్లోకమున అమ్మవారి కంటికాంతి మన్మథనారాచవర్షలహరి గానుత్ప్రేక్షింపబడినది. ఈ క్రింది శ్లోకమున అమ్మవారి కటాక్షము మన్మథుని బాణముగా రూపింపబడు చున్నది.

94. బాణేన పుష్పధనుషః, పరికల్ప్యమాన
త్రాణేన భక్త మనసాం కరుణాకరేణ
కోణేన కోమల దృశ స్తవ కామకోటి
శోణేన శోషయ శివే మమ శోకసిన్ధుమ్

అ|| కామకోటి - కామకోటి పీఠాధీశ్వరివైన, శివే - ఓ శివా! పుష్ప ధనుషః - పువ్వులు బాణములుగాగల మన్మథునియొక్క, బాణేన - బాణమైన,భక్తమనసామ్ - భక్తులమనస్సులకు, పరికల్ప్యమాన - కల్పించు చున్న, త్రాణేన - రక్షణగల, కరుణా కరేణ - దయకు గనియైన, తవ - నీ యొక్క, కోమల దృశః - మృదువైన చూపు యొక్క, కోణేన - కొనచేత, మమ - నా యొక్క, శోకసిన్ధుమ్ - దుఃఖ మనెడి సముద్రమును, శోషయ - ఇగిరిపోవు నట్లు చేయుము

తా|| అమ్మా! నీ చూపు మన్మథుని బాణము. అది భక్తులకు రక్షణమును కల్పించు చున్నది. అది దయకు గనిగా నున్నది. అది యెఱ్ఱనిది. అట్టినీ చూపు చేత నా యొక్క శోక సముద్రము నింకింప జేయుము.

వి|| అమ్మవారి చూపు శివునోడించు సమయమున మన్మథుని బాణమగును. భక్తులకు రక్షణము కల్గించు నప్పుడు దయతో నిండి పోవును. భక్తుడైన మూకకవి యొక్క ధుఃఖ సముద్రమును శుష్కింపజేయునప్పుడది కోపముతో నిండి పోవలయును. కంటిలోని మెఱుపు ఒకసారి దయను, మరొకసారి కోపమును, మరొకసారి యనురాగమును సూచించును. ఈ మూడు భావములు కోణ శబ్దముచే వ్యంజింప జేయబడు చున్నవి. మన్మథుని బాణముగా. నమ్మవారి చూపు రూపింప బడుటచే నిందు రూపకాలంకార మున్నది. నాలుగు పాదముల మొదట బాణేన, త్రాణేన, కోణేన, శోణేన అను నాల్గు పదములుండుటచే నీ శ్లోకమున బాదాద్యనుప్రా సాలంకారమొప్పు చున్నది. చివఱి పాదమున శకారము నాల్గుసార్లుండుట చే వృత్యానుప్రాసాలంకార మున్నది. శోషణము వాయుకృత్యము. వాయు పుత్రుడైన యగ్నికి నా గుణము సంక్రమించి యుండును. మూకకవి తన దుఃఖమును శోషయ (ఆర్పివేయుము) అని ప్రార్థించుట చేత అమ్మవారి చూపునకు శోషణ స్వభావమైన వాయులక్షణము వ్యంజింప జేయబడినది. కాని వాయువునకు రూపములేదు. అమ్మవారి చూపునకు రూపమున్నది. ఆ రూపమెఱుపు. అగ్నికి రోహిత రూపము వేదసిద్ధము. వాయు లక్షణమైన శోషణ మగ్నియందు సంక్రమింప జేయబడినట్లు అమ్మవారి చూపు నందును సంక్రమింప జేయబడినది. వాచ్యమైన శోకసింధు శోషణము చే పై విషయము వ్యంజింప జేయుబడినది.

అవ|| పై శ్లోకమున సముద్రము ప్రస్తావింపబడినది. సముద్రమున చేపలుండును. ఈ క్రింది శ్లోకమున అమ్మవారి చూపు చేప యా యని సందేహింపబడు చున్నది.

95. మారద్రుహో మకుటసీమని లాల్యమానే
మన్దాకినీ పయసి తే కుటిలం చరిష్ణుః
కామాక్షి! కోపరభసా ద్వలమానమీన
సందేహ ముజ్కురయతి క్షణ మక్షిపాతః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, మారద్రుహో - మన్మథునకు ద్రోహియైన శివుని చేత, మకుట సీమని - కిరీట ప్రదేశమున, లాల్యమాణే - ఆదరింప

బడుచున్న, మన్దాకినీ పయసి - ఆకాశ గంగాజలమున, కోపరభసాత్ - కోపావేశము వలన, కుటిలమ్ - వంకరగా, చరిష్ణుః - తిరుగు, తే - నీ యొక్క, అక్షిపాతః - చూపు, క్షణమ్ - కొంచెము సేపు, వలమాన మీన సన్దేహమ్ - కదలు చున్న చేపయా యను సందేహమును, అంకురయతి - కలిగించు చున్నది.

తా|| అమ్మా! నీ చూపు శివుడు నెత్తిని బెట్టుకొని యాదరించు గంగా జలమున కోపముచే వంకరగా తిరుగు చేపయా యని సందేహింప బడుచున్నది.

వి|| అమ్మవారి చూపు చేపగా సందెహింప బడుటచే నీ శ్లోకమున సందేహాలంకార మున్నదని నిస్సందేహముగా చెప్పవచ్చును. అమ్మవారు కోపమున గంగను చూచుటచే సపత్నీ మాత్సర్యముచే కలహోత్కంఠితగా నీశ్లోకమున సాక్షాత్కరించు చున్నది. శివుడామె కోపమును లెక్క చేయలేదు. కోపమున మరింత ప్రకాశించు నామె చూపు మారధ్వజమైన తిరుగుచున్న చేపవలె నున్నదని మారద్రుహాయను పదము వ్యంజింప జేయుచున్నది. దానిని బట్టు కొన వచ్చునని సంతోషించు చున్నాడని పై సందేహాలంకారము వ్యంజింప జేయు చున్నది.

అవ|| పై శ్లోకమున అమ్మవారి చూపు చలించు చేపగా సందేహింపబడినది. ఈ క్రింది శ్లోకమున చలనము లేని స్తంభముగా రూపింపబడు చున్నది.

96. కామాక్షి! సంవలిత మౌక్తికకుణ్డలాంశు
చంచత్స్మిత శ్రవణ చామర చాతురీకః
స్తమ్భే నిరన్తర మపాఙ్గమయే భవత్యా
బద్ధ శ్చకాస్తి మకరధ్వజ మత్తహస్తీ

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, సంవలిత - మూగిన, మౌక్తిక - ముత్తెముల, కుండల - కుండలముల, అంశు - కాంతి యనెడి, చంచత్ - ప్రకాశించు, స్మిత - చిఱు నవ్వుగల, శ్రవణ చామర - చామరముల వంటి చెవుల, చాతురీకః - చాతుర్యముకల, మకరధ్వజ మత్తహస్తీ - మన్మథుడనెడి మదగజము, అపాఙ్గమయే - చూపనెడి, స్తమ్భే - స్తంభమునందు, భవత్యా

- నీ చేత, బద్ధః - బంధింపబడినదై, చకాస్తి - ప్రకాశించు చున్నది.

తా|| అమ్మా! నీ చూపు ముత్యాల కుండలము. కాంతి యనెడి నవ్వుగల చామరముల వంటి చెవులు గల మన్మధుడనెడి మదగజము నీ చూపనెడి స్తంభమున బంధింప బడినదై ప్రకాశించు చున్నది.

వి|| ఈ శ్లోకమున అపాంగ మనెడి స్తంభమున మకరధ్వజుడు అమ్మవారి చేత చూపున గట్టి వేయబడిన మదగజముగా రూపింప బడుటచే రూపకాలంకారమున్నది. కుండలములు తెల్లని ముత్తెములు కలవగుటచే స్మితమున తెల్లని కాంతి వ్యాపించి యుండుటచే కటాక్ష స్తంభమున కట్టి వేయ బడిన యా మదగజ మైరావతమే యని స్ఫురించు చున్నది.

97. యావత్కటాక్ష రజనీ సమయాగమ స్తే
కామాక్షి తావ దచిరా న్నమతాం నరాణామ్
ఆవిర్భవ త్యమృత దీధితి బిమ్బ మమ్బ
సంవిన్మయం హృదయ పూర్వ గిరీన్ద్రశృఙ్గే

అ|| అమ్బ! - అమ్మా, కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, యావత్ - ఎంతలో, తే - నీ యొక్క, కటాక్ష రజనీ సమయాగమః - చూపనెడి పున్నమరాక యో, తావత్- అంతలో, అచిరాత్ - శీఘ్రముగా, నమతామ్ - నమస్కరించు నట్టి, నరాణామ్ - మనుష్యులకు, హృదయ పూర్వ గిరీన్ద్రశృంగే హృదయమనెడి తూర్పు కొండ కొమ్మున, సంవిన్మయం - జ్ఞానమయమైన అమృతదీధితి బింబమ్ - చంద్ర బింబము, ఆవిర్భవతి - ప్రాదుర్భవించును.

తా|| ఎంతలో నీకటాక్షమనెడి పున్నమ రాత్రి సమయము వచ్చునో అంతలోనే నమస్కరించు నరుల హృదయ మనెడి తూర్పు కొండ కొమ్మున జ్ఞాన మయమైన చంద్ర బింబమావిర్భవించును.

వి|| హృదయము తూర్పు కొండ కొమ్ముగా జ్ఞానము చంద్ర బిమ్బముగా అమ్మవారి కటాక్షము పున్నమి రాత్రి రాకగా రూపింపబడుటచే నీ శ్లోకమున రూపకాలంకారమున్నది. జ్ఞానమును చంద్రునితో బోల్చుట అద్వైత సమ్ప్రదాయమున నున్నదే. ప్రబోధ చన్ద్రోదయమను అధ్యాత్మిక నాటకము

కూడ ప్రసిద్ధమైనదే. విశిష్టాద్వైత సంప్రదాయమున వివేక సూర్యోదయ మను నాటకమున్నది. జ్ఞానమును సూర్యునిగా బేర్కొనుట అద్వైత సమ్ప్రదాయమునకు కించిద్భిన్నమైనను అంధకారమును జీల్చు నన్న తాత్పర్యములో భేదము లేదు. పున్నమి రాత్రి రాకయు చన్ద్రోదయము నొకేసారి వచ్చుటను యావత్ తావత్ శబ్దములు సూచించును. అమ్మవారియనుగ్రహము కలిగిన పిమ్మట జ్ఞానోదయము కలుగును. అమ్మవారి యనుగ్రహము కారణము. జ్ఞానోదయము కార్యము. ఇవి రెండు సమకాలికములని చెప్పుట కారణ కార్యముల మధ్య యెక్కువ వ్యవధానము లేదని కారణ ముదయించిన వెంటనే కార్యముదయించినదని శైఘ్ర్యాతిశయ మిట వ్యంగ్యమగు చున్నది. ఇది అతిశయోక్త్యాలంకారము.

అవ|| మోక్ష పురుషార్థము అలౌకికము. శ్రేయోనామకము. అమ్మవారి యనుగ్రహము శ్రేయో హేతువే కాక ప్రేయోహేతువు కూడ నగునని ఈ క్రింది శ్లోకమున చెప్పబడు చున్నది.

98. కామాక్షి కల్పవిటపీవ భవత్కటాక్షో
దిత్సు స్సమస్త విభవం నమతాం నరాణామ్
భృంగస్య నీల నలినస్య చ కాన్తి సంప
త్సర్వస్వమేవ హరతీతి పరం విచిత్రమ్

కామాక్షి! - ఓ కామాక్షీ దేవీ!, భవత్కటాక్షః -నీ చూపు, కల్పవిటపీవ - కల్పవృక్షమువలె, నమతామ్ - నమస్కరించు, నరాణామ్ - మనుష్యులకు, సమస్త విభవం - సమస్తమైన సంపదను, దిత్సుః - ఈ యగోరు చున్నాను, భృంగస్య - తుమ్మెదకును, నీల నలినస్య చ - నల్లని కమలమునకును, కాన్తి సంపత్సర్వస్వమ్ - కాన్తి సంపదను, హరతి ఏవ - తప్పక హరించును. ఇతి - అనుట పరమ్ - మిక్కిలి, విచిత్రమ్ - వింత.

తా|| అమ్మా! కల్పవృక్షము వంటి నీ చూపు నమస్కరించువారలకు సమస్త సంపదల నీయగోరును. కాని తుమ్మెద యొక్క నీల కమలము యొక్క కాంతి యను సంపద మొత్తము హరించుట వింత కదా! అమ్మవారి కటాక్షము తుమ్మెద కన్న నీల నలినముకన్న మిక్కిలి నల్లనై శోభించు చున్నది.

వి|| ఒకరికి సర్వ సంపదల నొసగుట మరొకరికి కాంతి సంపత్సర్వస్వము నపహరించుట యొక విధముగా విరోధమే. అది పక్షపాతమే. కాని నమస్కరించు వారికి సర్వ సంపద నొసగుట స్పర్థించు వారికీయక పోవుట యొక విధముగాన విరోధమే. విచిత్రమ్ అను పదము చేత నీ విరోధము వ్యక్తమైనను, అమ్మవారి కంటితో స్పర్థించుటచే విరోధము కాదని పరిహరింప బడు నవకాశముండుటచే నట విరోధా భాసాలంకారమున్నది.

99. అజ్ఞాత భక్తి రస మప్రసరద్వివేక
మత్యన్త గర్వ మనధీత సమస్త శాస్త్రమ్
అప్రాప్త సత్య మసమీపగతం చ ముక్తేః
కామాక్షి! నైవ తవ కాంక్షతి దృష్టిపాతః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, తవ - నీ యొక్క, దృష్టి పాతః - కటాక్షము, అజ్ఞాత భక్తి రసమ్ - భక్తిలోని రక్తి నెఱుగని వానిని, అప్రసరద్వివేకమ్ - వివేకము ప్రసరించని వానిని, అత్యన్త గర్వమ్ - మిక్కిలి గర్వము కలవానిని, అనధీత సమస్త శాస్త్రమ్ - సమస్తశాస్త్రముల నేర్వని వానిని, అప్రాప్త సత్యమ్ - సత్యముచేరని వానిని, ముక్తేః - ముక్తికి, అసమీపగతమ్ - దగ్గఱని వానిని, న ఏవ కాంక్షతి - కోరనేకోరదు.

తా|| అమ్మా! భక్తి యొక్క రక్తి నెఱుగని వానిని వివేకము ప్రసరించని వానిని, గర్వము లేని వానిని, అన్ని శాస్త్రముల నేర్వని వానిని, సత్యము చేరని వానిని ముక్తికి దగ్గఱని వానిని కోరదు. ఇన్ని ఉన్న వానికే అమ్మ వారికటాక్షములభించును. అనగా నది సామాన్యులకు దుర్లభము.

వి|| పై లక్షణములను లేని వానిని కోరదనుటలో పై లక్షణ ములనపేక్షింపకయే తన స్వేచ్ఛచే నెటువంటి సుగుణములు లేని వాని పై సైతము యాదృచ్ఛికముగ అమ్మవారి దృష్టి పడి వాడు కృతార్థుడగును. అను అర్థాంతరము కూడ స్ఫురించుటచే నమ్మవారి కటాక్షము యొక్క నిరంకుశ స్వాతంత్ర్యము కూడ దెలియు చున్నది.

100.అత్యన్త శీతల మనర్గల కర్మపాక
కాకోల హారి సులభం సుమనోభిరేతత్
పీయూష మేవ తవ వీక్షణ మమ్బ కిం తు
కామాక్షి! నీల మిత మిత్యయ మేవ భేదః

అ|| కామాక్షి - ఓ కామాక్షీ దేవీ!, అత్యన్త శీతలమ్ - మిక్కిలి చల్లని, అనర్గల కర్మ పాక కాకోలహారి - అడ్డులేని కర్మ పరిపాకమను విషమును హరించు, సుమనోభిః - దేవతల చేత, సులభమ్ - సుఖముగా బొందదగిన, ఏతత్ - ఈ, తవ - నీ, యొక్క, వీక్షణమ్ - చూపు, పీయూషమ్ ఏవ - అమృతమే, సులభమ్ - సుఖముగా బొందదగిన, ఏతత్ - ఈ, తవ - నీ యొక్క, వీక్షణమ్ - చూపు, పీయూషమ్ ఏవ - అమృతమే, కింతు - కాని, ఇదమ్ - ఇది (నీ చూపు), నీలమ్ ఇతి - నల్లని దనుట, అయమ్ ఏవ - ఇదియే, భేదః - భేదము.

తా|| అమ్మా! మిక్కిలి చల్లనిది అనర్గల కర్మపాకమను విషమును హరించునది దేవతలకు సులభమైనదియు నైన నీ చూపు అమృతమే కాని నీ యీ చూపు నల్లనిది.

వి|| అమృతము తెల్లనిది. దాని లక్షణములన్ని యున్నను అమ్మవారి చూపు నందు తెలుపు లేక నలుపుండుట ఇదియే విశేషము ఉపమానోపమేయములైన పీయుష కటాక్షములకు సామ్యమును పుష్కలముగా చెప్పి యీ విశేషము చెప్పుటచే నీ శ్లోకమున వ్యతిరేకాలంకార మున్నది.

101.పాతేన లోచనరుచే స్తవ కామకోటి
పోతేన పాతక పయోధి భయాతురాణామ్
పూతేన తేన నవ కాంచన కుండలాంశు
వీతేన శీతలయ భూధర కన్యకే మామ్


అ|| భూధర కన్యకే - పర్వత సుతవైన, కామకోటి - ఓ కామకోటి పీఠాధీశ్వరీ, పాతక పయోధి భయాతురాణామ్ - పాపసముద్రము యొక్క భయముచే పీడితులైన వారికి, పోతేన - ఓడయయిన, నవకాంచన కుండలాంశు

వీతేన - క్రొత్త బంగారు కుండలముల కాంతులచే కూడిన, తవ - నీ యొక్క, లోచన రుచేః - కంటి కాంతి యొక్క, పాతేన - ప్రసారము చేత, మామ్ - నన్ను, శీతలయ - చల్లబఱుపుము.

తా|| పర్వత సుతవైన యో కామాక్షీ దేవీ! నీ దృష్టి పాతము పాపసముద్ర భయాతురులకు పోతము. నవకాంచనకుండలాంశు సముపేతము. అట్టి నీ దృష్టి పాతము చేత నన్ను జల్లబఱుపుము.

వి|| అమ్మవారు భూధరకన్యక యని సంబోధింప బడినది. ఆ భూధరము సామాన్య భూధరముకాదు. అది శీత భూధరవేు యని శీతలయ (చల్లబఱుపుము) అనుటచే వ్యంగ్యమగు చున్నది. అమ్మ వారి దృష్టి పాతము పాత భయాతురులకు పోతము అనుటచే ద్వితీయ పాదమున రూపకాలంకారమున్నది.

కటాక్ష శతకం సర్వం సంపూర్ణం



‘లోకా స్సమస్తా స్సుఖినో భవంతు’